


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 200

మంగళవారం 10-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఊరంతా మా కుటుంబమే!

విధుల్లో ఉత్తమసేవలు అందించినందుకుగాను జాతీయ స్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, ఖాసింపేట గ్రామం, రేగట్టె వెంకట రమణ ఎంపికయ్యారు. నేడు న్యూఢిల్లీలో కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా రేగట్టె వెంకటరమణను పలకరిస్తే తన ఇరవై మూడేళ్ల కృషిని వివరించారు.



● కలిసికట్టుగా ప్రగతిని సాధిద్దాం



● పౌష్టికాహారం.. పంచుతూ...

''పై అధికారులు చెప్పిన పనిని సమయానుకూలంగా నూటికి నూరు శాతం పూర్తి చేస్తూ రావడం వల్లే ఈ రోజు ఈ పురస్కారం లభించింది. ఎనిమిదవ తరగతి పూర్తవుతూనే పెళ్లయ్యింది. ఇరవై మూడేళ్ల క్రితం అత్తింటిలో అడుగుపెడుతూనే అంగన్‌వాడీ టీచర్‌గానూ చేరాను. ఆ తర్వాత మా వారు భద్రయ్య, ఇతర కుటుంబ సభ్యుల సహకారంతో డిగ్రీ వరకు చదువుకున్నాను. నాకు ఇద్దరు కూతుళ్లు. మా ఇంటినే కాదు ఊరు బాగోగులు చూసుకునే అవకాశం కూడా దక్కడం అదృష్టంగా భావిస్తాను. అందుకే, నాకు మా ఊరే కుటుంబం అయ్యింది. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరికీ తెలిసిపోతుంది. అందరూ అందరి కోసం అన్నట్టుగా ఎన్నో కార్యక్రమాలను జరుపుతుంటాం. ఇవన్నీ ఊళ్లో అందరినీ సంఘటితం చేస్తున్నాయి. ప్రీ స్కూల్, ఆరోగ్యలక్ష్మి, ఇంటింటి అంగన్‌వాడీ హోమ్ విజిట్స్, పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాలు, మిల్లెట్స్ మాసం, పిల్లల చదువుకు సంబంధించి.. ఇలా ప్రతిదీ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. ఏ కార్యక్రమం చేసినా నూరు శాతం సక్సెస్ అవుతుంది.

ఇంటింటి ప్రోగ్రామ్..

గర్భిణులపై ఎక్కువ ఫోకస్ పెడుతుంటాం. వారి ఆరోగ్యం, పౌష్టికాహారం.. ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్లేవరకు ఎలా చూసుకోవాలో ఇంటిల్లిపాదికీ కౌన్సెలింగ్ ఇస్తాం. అలాగే పిల్లలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతుంటాం.

మేం మా డైరీలో సక్సెస్ స్టోరీలు కూడా నోట్ చేస్తాం. ఒకసారి ఒక గర్భిణి పౌష్టికాహారం గురించి, తీసుకోవలసిన ఇతర జాగ్రత్తల గురించీ మేం ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇచ్చిన పౌష్టికాహారం తీసుకోలేదు. ఆమెకు డెలివరీ అయి బరువు తక్కువతో పాప పుట్టి, చనిపోయింది. అయినా ఆమెను మళ్ళీ మళ్లీ కలుస్తూనే, విషయాలన్నీ చెబుతూ ఆమె తిరిగి కోలుకునేలా చేశాం. ఆమె మళ్లీ ప్రెగ్నెంట్ అయినప్పుడు మేం చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించింది. ఈసారి ఆరోగ్యకరమైన పాపకు తల్లి అయ్యింది. ఆ తర్వాత ఆమెనే ఊళ్లో ఎవరు ప్రెగ్నెంట్ అయినా తనలా అశ్రద్ధ చేయవద్దని సూచనలు చేస్తుంటుంది. చంటి పిల్లల విషయంలోనూ తల్లులు ఒకరిద్వారా మరొకరు సూచనలు చేసుకునేలా కౌన్సెలింగ్ చేస్తుంటాం.

అందరూ మా వాళ్లే..

గర్భిణులకు సీమంతాలు, స్కూల్ డే, చిల్డ్రన్ డే వంటి కార్యక్రమాలకు గ్రామపెద్దలు డబ్బులు పోగేసి మరీ చేస్తుంటారు. ర్యాలీలు, వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ గ్రామపెద్దలను కలిసి చెబుతాను. దీనివల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరిస్తాను. వాళ్లూ మిగతా అందరినీ కూడగట్టుకొని, మాకు మద్దతు ఇస్తారు. దీంతో ఊరంతా ఆరోగ్యంగా ఉండేలా సరైన కృషి జరుగుతోంది. కార్యక్రమాల్లో ఊరంతా ఒక్కటవుతుంది. ఆ రోజు ఎవరూ పనులకు కూడా వెళ్లరు. కార్యక్రమాలను ఓ పండగలా జరుపుతుంటారు. నేను చెప్పిన విషయాలను వినడంలోనూ, ఆచరించడంలోనూ మా ఊరంతా నాకు సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. కరోనా సమయంలోనూ తీసుకున్న జాగ్రత్తలకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ప్రశంసలు లభించాయి.

బెస్ట్ అవార్డీగా...

మండల, ప్రాజెక్ట్, జిల్లా స్థాయుల్లోనూ.. బెస్ట్ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డులు అందుకున్నాను. ఈ యేడాది జాతీయ స్థాయికి ఎన్నికైనందుకు చాలా ఆనందంగా ఉంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మిల్లెట్స్‌తో ఐటమ్స్ తయారుచేసి, డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాం. వాటి ప్రయోజనాలను వివరిస్తాం. దీనివల్ల ఇతర మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తుంటాయి. మా అంగన్‌వాడీ టీచర్స్‌కి నెలలో రెండు సమావేశాలు జరుగుతుంటాయి. వాటిలో ఊళ్లలో చేపట్టే కార్యక్రమాల వివరాలు పంచుకోవడం, ముందస్తు ప్రణాళికల గురించి చర్చించుకోవడం, నిర్ణయాల అమలుకు కృషి చేయడం మాకున్న పెద్ద బాధ్యత. దీనిని సక్రమంగా నిర్వర్తించడమే ఈ రోజు మీ అందరి ముందు నిలిపింది'' అని ఆనందంగా వివరించింది వెంకటరమణ.

– నిర్మలా రెడ్డి

పాకశాస్త్రం

నచ్చేలా మెచ్చేలా ఘనంగా గరిట పట్టేలా

'తినడం కోసం బతకడం కాదు. బతకడం కోసం తినాలి' అని కాస్త గంభీరంగా అనుకున్నాసరే, 'వంటల రుచుల కోసం కూడా బతకవచ్చు సుమీ!' అనిపిస్తుంది కొన్నిసార్లు. పసందైన వంటకాలు జీవనోత్సాహాన్ని కలిగిస్తాయి. చురుకుదనాన్ని నింపుతాయి. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని లండన్‌లో చేస్తున్న కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకొని చెఫ్‌గా మారి ప్రవాస భారతీయులకు అపూర్వమైన భారతీయ వంటకాలను పరిచయం చేయడంతో పాటు, వాటిని ఇంట్లోనే సులభంగా ఎలా తయారు చేసుకోవచ్చు అనేదానిపై పుస్తకాలు రాస్తోంది మౌనికా గోవర్ధన్...



● మౌనికా గోవర్ధన్

ముంబైలోని దాదర్ ప్రాంతంలో పుట్టి పెరిగిన మౌనిక ప్రస్తుతం లండన్‌లో ఉంటోంది. చెఫ్‌గా సంప్రదాయ భారతీయ వంటకాల రుచులను విదేశీయులకు పరిచయం చేస్తుంది. 'సులభంగా చేసుకునేలా... ఆరోగ్యంగా ఉండేలా...' అనేది ఆమె వంటల పాలసీ. ప్రతి కుటుంబానికి తరతరాలుగా తమవైన ప్రత్యేక వంటకాలు ఉంటాయి. కొన్నిసార్లు కాలంతోపాటు అవి కనుమరుగు అవుతుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మౌనిక తమ కుటుంబంలో ఎన్నో తరాల విలువైన వంటకాలను సేకరించింది.

పుస్తకాలు, టీవీ కార్యక్రమాలు, లైవ్ ఈవెంట్స్, సోషల్ మీడియా ద్వారా మన వంటకాలకు విదేశాల్లో ప్రాచుర్యం కల్పిస్తోంది. లండన్‌లో ఉంటున్నప్పటికీ మౌనికకు మన దేశంలోని పాతతరం వంటకాలపై ఆసక్తి తగ్గలేదు. ఏమాత్రం సమయం దొరికినా మన దేశానికి వచ్చి మధ్య ప్రదేశ్ నుంచి మణిపుర్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళుతుంటుంది.

'అందరిలాగే అమ్మ వంటకాలు అంటే నాకు ఇష్టం. అయితే కేవలం ఇష్టానికి పరిమితం కాకుండా అమ్మ చేసే వంటకాలను ఓపిగ్గా నేర్చుకున్నాను. నేను చేసే వంటకాలు కూడా అమ్మకు బాగా నచ్చేవి' గతాన్ని గుర్తు చేసుకుంది మౌనిక. ఆమె అమెరికాలాంటి దేశాలకు వెళ్లినప్పుడు ప్రవాస భారతీయులతో మాట్లాడుతున్న సందర్భంగా మన వంటకాలను గుర్తు చేస్తున్నప్పుడు వారి నోట్లో నీళ్ల ఊరేవి. ప్రతివ్యక్తికి 'సోల్ ఫుడ్' అనేది ఒకటి ఉంటుంది అని చెబుతుంటుంది మౌనిక.



మౌనిక తాజాపుస్తకం 'తందూరీ హోమ్ కుకింగ్' అద్భుత విజయాన్ని సాధించింది. ఈ పుస్తకంలో రకరకాల రుచికరమైన తందూరీ వంటకాలతో పాటు ఆయా వంటకాల చరిత్రను ఆసక్తికరంగా వివరిస్తుంది మౌనిక. ఇదంతా సరే, కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకొని మరీ మౌనిక ఎందుకు చెఫ్‌గా మారింది? ఆమె మాటల్లోనే...

'లండన్‌లో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో స్నేహితుల కోసం సరదాగా వంటలు చేసి పెట్టేదాన్ని. ఆ వంటకాలు వారికి విపరీతంగా నచ్చేవి. ఆ రుచుల మైమరుపులో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం కూడా మరచి పోయేవారు. కుకింగ్‌ను ప్రొఫెషనల్‌గా తీసుకుంటే తిరుగులేని విజయం సాధిస్తావు అని చెప్పేవాళ్లు. నేను ఆ మాటలను పెద్దగా సీరియస్‌గా తీసుకునేదాన్ని కాదు. అయితే పదే పదే ఇలాంటి మాటలు వినిపించడంతో ఒకసారి ట్రై చేద్దామని కార్పొరేట్ జాబ్‌ను వదులుకొని కుకింగ్‌ను ఫుల్–టైమ్ జాబ్ చేసుకున్నాను. అయితే ఇది మా కుటుంబ సభ్యులకు నచ్చలేదు. కొందరైతే లండన్‌కు వెళ్లింది వంటలు చేయడానికా? అని వెక్కిరించారు. దీనికి కారణం కుకింగ్ అనేది వారికి ఒక ప్రొఫెషన్‌గా కనిపించకపోవడమే. కుకింగ్ అంటే ఇంట్లో ఆడవాళ్లు చేసే పని మాత్రమే అనేది వారి అభిప్రాయం. కుకింగ్‌కు సంబంధించిన రోల్‌మోడల్స్ గురించి కూడా వారికి తెలియదు. అయితే తరువాత మాత్రం వారిలో మార్పు వచ్చింది' అంటుంది మౌనిక.

మౌనిక ఇంట్లో ఆ రోజుల్లో ఒకే ఒక వంటల పుస్తకం కనిపించేది. ఆ పుస్తకాన్నే పదేపదే తిరగేసేది అమ్మ. ఈ పుస్తకాలు కూడా కొన్ని వంటకాలకు సంబంధించినవే ఉండేవి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వంటలు ఎలా చేయాలో నేర్పించడం కోసం పుస్తకాలు కూడా రాయాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా వెబ్‌సైట్‌ను మొదలుపెట్టింది. ఆ తరువాత 'ది న్యూయార్క్ టైమ్స్' 'ది డెయిలీ మెయిల్'లో మన వంటకాలను ప్రపంచానికి పరిచయం చేసేది.

వంటకాల తయారీలో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న మౌనిక ఇండియన్ కిచెన్, థాలీ, తందూరీ హోమ్ కుకింగ్ అనే మూడు పుస్తకాలు రాసింది. 'వంటలు చేసే సమయంలో నా దృష్టి మొత్తం తయారీ ప్రక్రియపైనే ఉంటుంది. ఆ సమయంలో వేరే విషయాల గురించి ఆలోచించడం తాలూకు ప్రభావం రుచిపై పడుతుంది. అందుకే వంటగదిలోకి వెళ్లినప్పుడు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లుగా భావిస్తాను' అంటుంది మౌనిక.

మౌనిక లండన్‌లో చదువుకునే రోజుల్లో 'అన్ని భారతీయ వంటకాలకు ఒకటే రెస్టారెంట్' అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు కొత్తిమీర దొరకడం గగనంగా ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. 'మన వంటకాల కోసం రెస్టారెంట్‌లపై మాత్రమే ఆధారపడడం ఎందుకు? ఆడుతూ పాడుతూ మన ఇంట్లో చేసుకోవచ్చు కదా' అనుకునే ప్రవాస భారతీయులకు మౌనిక గోవర్ధన్ పుస్తకాలు అపురూపంగా మారాయి. చెఫ్‌గా మౌనికా గోవర్ధన్ అపూర్వ విజయానికి కారణం అయ్యాయి.

నాన్‌బీటీ సేంద్రియ పత్తికి పునరుజ్జీవం!

- తెలంగాణ, ఏపీ సహా ఆరు రాష్ట్రాల్లో నాన్‌బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి స్వతంత్ర పరిశోధనా సంస్థల శ్రీకారం
- వచ్చే ఖరీఫ్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో 3 వేల ఎకరాలకు నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనాల సరఫరా లక్ష్యం

మన దేశంలో పత్తి సాగులో వాడుతున్నది 95% వరకు జన్యుమార్పిడి చేసిన పత్తి విత్తనాలే. నాన్‌బీటీ దేశీ పత్తి రకాలు దాదాపు పూర్తిగా కనుమరుగైపోయాయి. ఈ నేపథ్యంలో నాన్‌బీటీ దేశీ, అమెరికన్ పత్తి రకాలను తిరిగి రైతులకు అందించే కృషికి అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయ స్వతంత్ర పరిశోధనా సంస్థలు శ్రీకారం చుట్టాయి. వచ్చే ఖరీఫ్ నుంచే తెలుగు రాష్ట్రాల్లో 3 వేల ఎకరాల్లో రైతులకు ఈ విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచ పత్తి దినోత్సవం (అక్టోబర్ 7) సందర్భంగా ప్రత్యేక కథనం...



● జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో నాన్ బీటీ హైబ్రిడ్ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి క్షేత్రంలో మహిళా రైతు



సేంద్రియ పత్తి సాగు వల్ల భూతాపం పెరుగుదలను దీటుగా ఎదుర్కోవటం, ఆరోగ్యదాయకమైన దూది ఉత్పత్తిని పెంపొందించటం వంటి ప్రయోజనాలెన్నో ఉన్నాయి. సేంద్రియ పత్తి విస్తీర్ణాన్ని పెంపొందించాలంటే మొదట జన్యుమార్పిడి చేయని (నాన్ బీటీ) దేశీ, హైబ్రిడ్ రకాల పత్తి విత్తనాలను తొలుత స్థానికంగా రైతులకు అందుబాటులోకి తేవాలి. ఈ అవసరాన్ని గుర్తించిన అనేక అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయ స్వతంత్ర పరిశోధనా సంస్థలు స్థానిక వాతావరణ పరిస్థితులకు అనువైన నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి కార్యక్రమాలను ఈ సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మన దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని నెదర్లాండ్స్‌కు చెందిన ఆర్గానిక్ కాటన్ యాక్సలరేటర్(ఒసిఎ), స్విట్జర్లాండ్‌కు చెందిన స్వతంత్ర సేంద్రియ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఎఫ్‌ఐబిఎల్) శ్రీకారం చుట్టాయి.

ఈ సంస్థల తోడ్పాటుతో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నాన్‌బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి ఈ ఖరీఫ్ నుంచి కృషి ప్రారంభించింది.

వచ్చే ఖరీఫ్ నాటికి 3 వేల ఎకరాలకు అందుబాటులోకి నాన్‌బీటీ పత్తి విత్తనాలు

ఇదిలా ఉండగా, 5 రకాల నాన్‌బీటీ పత్తి రకాల విత్తనోత్పత్తి ఆరు రాష్ట్రాల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ఈ ఖరీఫ్‌లో మొత్తం 25 ఎకరాల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా, తెలంగాణలోని రెండు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు 5 నాన్ బీటీ పత్తి రకాల విత్తనోత్పత్తిని 5 ఎకరాల్లో చేపట్టాయి. వీటిల్లో ఆర్‌విజెకె-ఎస్‌జిఎఫ్1 అనే దేశీ పత్తి (అర్బోరియం) సూటి రకం ఒకటి. ఆర్‌విజెకె-ఎస్‌జిఎఫ్2, ఎన్‌డిఎల్‌హెచ్, సురక్ష అనే 3 రకాల అమెరికన్ (హిర్సుటం) సూటి రకాలతోపాటు.. వసుధ గోల్డ్ అనే హైబ్రిడ్ పత్తి రకాలను ఒక్కో రకాన్ని ఒక్కో ఎకరంలో జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలోని రాజోలి ఎఫ్‌పిఓ, జనగామ జిల్లాలోని ఆరద్య ఎనబావి ఎఫ్‌పిఓలు సాగు చేస్తున్నాయి. ఈ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని సిఎస్ఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు నచ్చే లక్షణాలతో పాటు మేలైన దిగుబడినిచ్చే ఈ నాన్ బీటీ రకాల సామర్థ్యాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించే లక్ష్యంతో పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నామని, వచ్చే ఖరీఫ్‌కు 3 వేల ఎకరాల్లో సాగుకు ఈ విత్తనాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ నాన్ బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే ఆసక్తి ఉన్న రైతులు ఈ విత్తన క్షేత్రాలను దసరా తర్వాత కాయ దశలో స్వయంగా సందర్శించి, విత్తనాలను బుక్ చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు తనను సంప్రదించాలని డా. రాజశేఖర్ (83329 45368) తెలిపారు.



● నూజివీడు సమీపంలోని కొండపర్వలో 30 రకాల నాన్‌బీటీ పత్తి రకాల సేంద్రియ ప్రదర్శన క్షేత్రంలో పంటను పరిశీలిస్తున్న ఎఫ్ఐబిఎల్, సిఎస్ఎ శాస్త్రవేత్తలు





30 నాన్ బీటీ పత్తి రకాల ప్రయోగాత్మక సాగు

మన దేశంలో నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి సంబంధించి గత ఆరేళ్లుగా క్షేత్రస్థాయిలో వంగడాల ఎంపిక ప్రక్రియ స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిఓ)ల స్థాయిలో సాగుతోంది. ఈ క్రమంలో 30 నాన్ బీటీ రకాలు రైతులకు నచ్చే విధంగా ఫలితాలనిస్తున్నాయని గుర్తించారు. వీటిలో దేశీ పత్తి సూటి రకాలు, అమెరికన్ పత్తి సూటి రకాలతో పాటు అమెరికన్ హైబ్రిడ్ పత్తి రకాలు ఉన్నాయి. అయితే, ఈ 30 నాన్ బీటీ సూటి/హైబ్రిడ్ రకాల్లో ఏయే రకాలు ఏయే రాష్ట్రాల్లో ఉత్తమ ఫలితాలనిస్తున్నాయన్న క్షేత్ర స్థాయి అధ్యయనం ఈ ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి సాగయ్యే ఆరు రాష్ట్రాల్లో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రత్యేక జాగ్రత్తలతో సాగు చేస్తున్నారు. తెలంగాణలోని యాదాద్రి జిల్లా వెలమజాల గ్రామంలో నేలతల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఒక ఎకరంలో 30 రకాల నాన్‌బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తోంది. అదేవిధంగా, ఏపీలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో గల కృష్ణ సుధ అకాడమీ ఫర్ ఆగ్రోఎకాలజీ ఆవరణలో ఒక ఎకరంలో 30 నాన్ బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. జన్యుస్వచ్ఛత కోసం ఒక్కో రకానికి మధ్య జొన్న వరుసలు విత్తారు. ఈ రెండు క్షేత్రాలను సిఎస్ఎ శాస్త్రవేత్తలు పర్యవేక్షిస్తున్నారు. ఈ 30 రకాల్లో ఏ రకాలు మెరుగైన ఫలితాలనిస్తాయో పరిశీలించి, వచ్చే సంవత్సరాల్లో ఆయా రకాలను విస్తృతంగా సాగులోకి తెచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించనున్నాయని సిఎస్ఎ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ చెప్పారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

సాగుబడి

చిత్త కార్తె: అక్టోబర్ 11 నుంచి

ఒకటికి పది గ్రాసాలు.. పాడి రైతుకు పది మేళ్లు..

'మేపు లోనే సేపు' అని నానుడి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పూర్తి సామర్థ్యం పొందాలంటే మేలైన, నాణ్యమైన పశుగ్రాసాలను పచ్చిమేతగా అందించాలి. దాణా కన్నా పచ్చని పశుగ్రాసాలను మేతగా అందిస్తే అధిక పాల దిగుబడి సాధించడంతోపాటు పాడి పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచినవారమవుతాం. పాడి పరిశ్రమ లాభసాటి కావాలంటే ఖర్చు తగ్గాలి. ఇది తగ్గాలంటే మేలు జాతి పశుగ్రాసాలను పశువులకు మేతగా అందించాలి. దీనితో 40–50 శాతం ఖర్చు తగ్గటంతోపాటు పాల దిగుబడి 20 శాతం పెరుగుతోంది.

రైతులు పశుగ్రాసాల్లో ఏదో ఒకటి లేదా రెండు రకాలను పెంచి పాడి పశువులకు మేపుతుంటారు. అలా కాకుండా కొన్ని రకాల పశుగ్రాసాలను పెంచి పశువులకు క్రమపద్ధతిలో మేపితే మరింత మేలు జరుగుతోంది. ఈ విధానాన్ని అమలాపురం ఏరియా పశు వైద్యశాల అధికారులు ప్రయోగాత్మకంగా అమలు చేసి చూపిస్తున్నారు. ఏరియా పశు వైద్యశాల వెనుక నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని చదును చేసి పదిహేను సెంట్ల స్థలంలో పది రకాల పశుగ్రాసాలను పెంచుతున్నారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనా క్షేత్రంలో సూపర్ నేపియర్, గిని గడ్డి, కనుమ గడ్డి, రెడ్ నేపియర్, గిని గ్రాస్, మోని, చంగల్ గడ్డి, బొబ్బర గడ్డి, సీవో4, సీవో 5 రకాల గడ్డిని పెంచుతున్నారు. ఔత్సాహికులైన పాడి రైతులకు పశుగ్రాసాల పెంపక విధానాన్ని వివరిస్తున్నారు. ప్రతి గడ్డిలో వైవిధ్యభరితమైన పోషకాలు ఉండటంతో అన్ని రకాలు మేపితే మంచి ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కేవలం పేరా గ్రాస్ (ఇంగ్లిష్ గడ్డి) మాత్రమే మేపితే పశువుల్లో కాల్షియం లోపించే అవకాశముంది. చెంగల్ గడ్డి 'రాగి సంగటి'తో సమానం. సూపర్ నేపియర్ ఐదేళ్ల పాటు మేత అందుతోంది. కాండం మెత్తగా ఉండడంతోపాటు ఇందులో అధిక పోషకాలుంటాయి. రెడ్ నేపియర్‌లో ప్రొటీన్, గినీ గడ్డిలో శక్తినిచ్చే పోషకాలు ఎక్కువ. వీటిని కలిపి అందించడం వల్ల అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందుతాయి. దీని వల్ల పాల దిగుబడి పెరగడంతోపాటు పశువులు బలంగా ఉంటాయి. శాస్త్రీయ పద్ధతిలో పశు పోషణలో భాగంగా వివిధ పోషకాలున్న పశుగ్రాసాలను పరిచయం చేయటంతో పాటు వివిధ రకాల నేలలకు అనువైన పశుగ్రాసాల రకాల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. గడ్డి విత్తనాలు, కనుపులను ఉచితంగా అందజేస్తున్నారు. రైతులతోపాటు వెటర్నరీ విద్యార్థులకూ అవగాహన కల్పిస్తున్నారు.



● పశుగ్రాసాల క్షేత్రంలో పాడి రైతులకు అవగాహన



● వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ ఏడీ ఎల్.విజయ్ రెడ్డి

పదిహేను సెంట్లలో ఏడాదికి సగటున 2.5 టన్నుల పశు గ్రాసాన్ని రైతులు పొందనున్నారు. ఒక ఎకరం భూమిలో ఈ విధంగా పశుగ్రాసాలు పెంచితే 5 నుంచి 6 పాడి పశువులకు ఏడాది పొడవునా మేత అందించవచ్చు. వీటితోపాటు కలబంద, నల్లేరు, పసుపు, రణపాల, తులసి, తిప్పతీగ, ఇన్సులిన్ మొక్క వంటి ఔషధ మొక్కలను కూడా పెంచుతూ, సంప్రదాయ వైద్యంలో వాటి ఉపయోగాల గురించి రైతులకు తెలియజేస్తున్నారు. ఒకటికి పది రకాల పశుగ్రాసాల పెంపకం వల్ల పాడి రైతుల ఆదాయం పెరుగుతోందంటున్నారు విజయ్‌రెడ్డి (98663 27067).

– నిమ్మకాయల సతీష్ బాబు, సాక్షి, అమలాపురం

13 నుంచి సింహపురి సేంద్రియ మేళా

గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, సింహపురి సేంద్రియ వ్యవసాయదారుల సంఘం, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నెల్లూరులోని వి.ఆర్ కాలేజి గ్రౌండ్స్‌లో సేంద్రియ ఉత్పత్తులతో పాటు చేపలు, రొయ్యలు, పీతల ప్రదర్శన–అమ్మకం మేళా జరగనుంది. ఇతర వివరాలకు.. 81436 32488.

15,16 తేదీల్లో సేంద్రియ సేద్యంపై శిక్షణ

ఆదిగురు భారత్ ఫౌండేషన్ అధ్వర్యంలో జనగాంలోని బానపురంలో గోపాల్ గోశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంపై శిక్షణ ఉంటుంది. ద్రావణాలు, కషాయాలు, గానుగ నూనెలు, నెయ్యి, ధూప్ స్టిక్‌లు తదితర ఉత్పత్తుల తయారీపై నిపుణులు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 70953 14226.



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 200

మంగళవారం 10-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కివీస్ గెలుపు జోరు..

99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై న్యూజిలాండ్ విజయం - IVలో



'యుద్ధ' సెగలు


సెన్సెక్స్ 483 పాయింట్లు నష్టం.. నిఫ్టీ 141 పాయింట్ల పతనం - 11లో



గాజాపై నిప్పుల వర్షం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో నెత్తుటేర్లు పారుతున్నాయి. గాజాను స్వాధీనం చేసుకునే దిశగా ఇజ్రాయెల్ దాడులు ఉధృతం చేసింది.

వివరాలు 6లో ▸



2,400కు చేరిన మరణాలు

అఫ్గాన్‌లోని హెరాట్ ప్రావిన్స్‌లో భూకంప మృతుల సంఖ్య 2,445కు చేరుకుందని స్థానిక అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸



అధికారంలోకి రాగానే కుల గణన

కేంద్రంలో తాము అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహిస్తామంటూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో తీర్మానం చేశారు.


వివరాలు 6లో ▸



టాప్ గేర్‌లో వాహన విక్రయాలు

పండుగల సీజన్ నేపథ్యంలో దేశీయంగా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగాయి.

వివరాలు 11లో ▸



విజయవాడలో జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

విప్లవాత్మక పరిపాలన

మనం చేసిన మంచే మన బలం.. ధైర్యం: వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో సీఎం జగన్ దిశానిర్దేశం

- విప్లవాత్మక మార్పులతో 52 నెలలుగా సుపరిపాలన
- మేనిఫెస్టోలోని 99 శాతం వాగ్దానాలను అమలు చేశాం
- జగన్ చెప్పాడంటే చేస్తాడు.. కష్టమైన, నష్టమైనా మాట మీద ఉంటాడనే పేరు నిలబెట్టుకున్నాం
- ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ప్రజలతో మమేకమైన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే.. అర్హతే ప్రామాణికంగా 87% కుటుంబాలకు సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలు
- డీబీటీతో రూ.2.35 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి
- డీబీటీ లబ్ధిదారుల్లో 75 శాతానికిపైనే ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలే
- 2.07 లక్షల ప్రభుత్వ కొత్త ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే 80 శాతానికిపైగా
- ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో, ప్రతి నియోజక వర్గంలో కళ్లెదుటే కనిపిస్తున్న మార్పులు
- అలాంటప్పుడు వై నాట్ 175?..
- అదే లక్ష్యంతో ప్రజల్లోకి వెళ్దాం
- బహుశా మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరగవచ్చు

2లో

ప్రజలతో మరింత మమేకమయ్యేలా 8 కార్యక్రమాలు

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' నవంబర్ 10న ముగింపు..
- నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10 వరకు 'వై ఏపీ నీడ్స్ జగన్'
- అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ 31 వరకు ' సామాజిక బస్సుయాత్రలు'
- డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు 'ఆడుదాం ఆంధ్రా'
- జనవరి 1 నుంచి 10 వరకు 'పెన్షన్ పెంపు' సంబరాలు
- జనవరి 10 నుంచి 20 వరకు 'వైఎస్సార్ చేయూత'
- జనవరి 20 నుంచి 30 వరకు 'వైఎస్సార్ ఆసరా'
- ఫిబ్రవరిలో 'మళ్లీ జగనన్ననే తెచ్చుకుందాం'.. మేనిఫెస్టోతో ప్రజల్లోకి

మన పొత్తు ప్రజలతోనే

మన ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే దాన్నే కొలమానంగా తీసుకోండి. కురుక్షేత్ర యుద్ధంలో మీ బిడ్డకు మీరే సైనికులుగా మారండని కోరుతున్నా. పొత్తుల కోసం విపక్షాలు వెంపర్లాడుతున్నాయి. సున్నాలు ఎన్ని కలిసినా ఫలితం సున్నానే. 3లో

బాబుపై కక్ష లేదు

చంద్రబాబును ఎవరూ కక్ష సాధింపుతో అరెస్టు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బాబుపై ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేశారు. కేంద్ర విభాగాలు ఈడీ, ఐటీ ఆయన అవినీతిని నిరూపించాయి. 3లో

ఏది నిజం?

మత్తులోనూ ఇంతటి అబద్ధాలు కష్టమే!

- 'ఈనాడు' రాతల్ని లేఖ రూపంలో అచ్చువేసిన పురందేశ్వరి.. టీడీపీ చేస్తున్న ఆరోపణలతోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు
- అన్నీ అబద్ధాలు వల్లెవేస్తూ సీబీఐ దర్యాప్తు కావాలనే అర్థరహిత వినతులు
- కొద్దిరోజులుగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షురాలిగా మారిపోయిన పురందేశ్వరి

4లో



ప్రపంచంతో పోటీ పడండి

పెద్ద పెద్ద కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి

అమెరికా వెళ్లొచ్చిన ప్రభుత్వ విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

10లో

సెమీ 'ఫైనల్స్'కు రెడీ

మోగిన 5 రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నగారా

మిజోరం, చత్తీస్‌గఢ్ (తొలివిడత)లలో నవంబర్ 7న పోలింగ్	ఐదు రాష్ట్రాల్లో మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు
చత్తీస్‌గఢ్ (రెండో విడత), మధ్యప్రదేశ్‌లలో నవంబర్ 17న..	అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి
రాజస్తాన్‌లో నవంబర్ 23న..	ఉచితాలు, నగదు చేరవేతను అరికట్టేందుకు తనిఖీలు
తెలంగాణలో నవంబర్ 30న ఒకే విడతలో పోలింగ్	ఎన్నికల వ్యయంపై నిఘా
ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు, ఫలితాలు డిసెంబర్ 3నే..	కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్, మిజోరం అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల ఏర్పాట్లు, షెడ్యూల్‌ను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో వెల్లడించారు. మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రమైన

మిగతా 7వ పేజీలో ▶

ఒక్కో పోస్టుకు 15 మంది పోటీ



వైద్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు డిమాండ్

250 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తే 3,906 మంది దరఖాస్తు

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టులకు డిమాండ్ నెలకొంది. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 250 సీఏఎస్ వైద్య పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో 3,906 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 15 మంది చొప్పున అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వచ్చిన దరఖాస్తుల

మిగతా 12వ పేజీలో ▶

కృష్ణా జలాలపై తగ్గేదే లేదు

రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే పరమావధి

కేడబ్ల్యూడీటీ-2కు కేంద్రం కొత్త మార్గదర్శకాలపై ప్రధాని, హోంమంత్రికి లేఖలు

జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష

తాజా మార్గదర్శకాల వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని వివరించిన అధికారులు

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ఇప్పటికే నిర్ణయం

3లో

క్లాడియాకు ఆర్థిక నోబెల్

అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం ఈ ఏడాది అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌ను వరించింది. శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అవగాహనను మరింతగా పెంచే దిశగా చేసిన సమగ్ర అధ్యయనాలకు గాను ఆమెను ఎంపిక చేసినట్టు కమిటీ పేర్కొంది.

6లో



ఇడుపుగంట



సార్ లేరయ్యా.. అర్జంట్ పనుంటే బిగ్‌బాస్ హౌస్‌లోకి ఏదో రకంగా ఎంట్రీ సంపాదించుకుని వెళ్లు!



తిరుమలలో 13 కాటేజీల పునర్నిర్మాణం

- వరాహస్వామి కాటేజీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రహదారి
- రాజగోపురాల పటిష్టతపై నిపుణులతో కమిటీ
- పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపు
- టీటీడీ ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు

- వివరాలు 12లో


17ఏ.. నిందితులకు కాదేమో!

ఆ సెక్షన్ నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు

- అవినీతిని నిరోధించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం
- చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణ స్వీకరించలేం
- విచారణ సందర్భంగా న్యాయమూర్తుల వ్యాఖ్యలు
- సుదీర్ఘ వాదనలు వినిపించిన చంద్రబాబు న్యాయవాది
- బాబు న్యాయవాదికి పలు ప్రశ్నలు సంధించిన ధర్మాసనం.. విచారణ నేటికి వాయిదా
- వాదనలు వినిపించనున్న సీఐడీ న్యాయవాది

8లో



"అవినీతి నిరోధక చట్టానికి చేసిన 17ఏ సవరణను ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారో చూడాలి. దీని ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు అక్రమాలకు పాల్పడకూడదు. చట్టంలోని ప్రధాన ఉద్దేశాన్ని పక్కనపెట్టి ఓ వ్యక్తికి మేలు జరిగేలా ఈ చట్టాన్ని అన్వయించుకోకూడదు. అది చట్టం లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది

- సుప్రీంకోర్టు

బాబుకు 'నో బెయిల్'

ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

టెరాసాఫ్ట్‌తో బాబుకున్న సాన్నిహిత్యంపై హైకోర్టుకు సీఐడీ ఆధారాలిచ్చింది

ఆ సంస్థకు అనుకూలంగా ఆయన ఎలా వ్యవహరించారో వివరించింది

ఈ దశలో ముందస్తు బెయిల్ సాధ్యంకాదు

తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి

8లో

'ఇన్నర్'లోనూ చుక్కెదురు

బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

8లో

బాబుకు మళ్లీ భంగపాటు

స్కిల్ స్కాంలో బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన ఏసీబీ కోర్టు







విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో 'మా నమ్మకం నువ్వే జగన్..' అంటూ ప్లకార్డులు చూపుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆనందోత్సాహాలు



విప్లవాత్మక పరిపాలన

చేసిన మంచే మన బలం.. ధైర్యం: పార్టీ ప్రతినిధుల సదస్సులో సీఎం జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా విప్లవాత్మక మార్పులతో 52 నెలలుగా సుపరిపాలన అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గత పాలకులకు భిన్నంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన 99 శాతం వాగ్దానాలను అమలు చేయడం ద్వారా జగన్ చెప్పాడంటే చేస్తాడని.. మాట నిలబెట్టుకుంటాడని.. కష్టమైన, నష్టమైనా అండగా ఉంటాడనే మంచి పేరును దేవుడి దయతో తెచ్చుకోగలిగామన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు మన ప్రభుత్వం చేసిన మంచే మన ధైర్యం.. మన బలం.. మన ఆత్మవిశ్వాసమని పార్టీ ప్రతినిధులకు ఉద్బోధించారు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో గత 52 నెలలుగా అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ సీఎం జగన్ సుదీర్ఘంగా ప్రసంగించారు. మనం చేసిన మంచితో ప్రతి ఇంట్లో.. ప్రతి గ్రామంలో.. ప్రతి నియోజకవర్గంలో మార్పులు కళ్లెదుటే కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అడుగులు వేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటికీ వెళ్లి మనం చేసిన మంచిని వివరిస్తూ ప్రతిపక్షాల తీరును ఎండగట్టి అక్కచెల్లెమ్మల ఆశీస్సులు తీసుకుంటూ అడుగులు ముందుకు వేయించాల్సిన బాధ్యత మీ భుజస్కంధాలపై పెడుతున్నానని మార్గనిర్దేశం చేశారు. బహుశా మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. టీడీపీ, జనసేన సహా విపక్షాల తీరుపై సీఎం జగన్ పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ ప్రజలతో మరింతగా మమేకమయ్యేందుకు చేపట్టనున్న ఎనిమిది కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. సదస్సులో సీఎం జగన్ ఏమన్నారంటే..



సభా వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

అధికారం మనకు బాధ్యత మాత్రమే..

దేవుడి దయతో ప్రజలిచ్చిన అధికారం అన్నది మనకి బాధ్యతను మాత్రమే నేర్పిందని తెలియచేస్తూ వారికి తొలి సేవకుడిగా మీ ముందు మాట్లాడుతున్నా. అలా బాధ్యతగా వ్యవహరించాం కాబట్టే ఈ 52 నెలల్లో పౌరసేవల డెలివరీ విధానం , డీబీటీ ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చాం. మూడు ప్రాంతాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ మూడు రాజధానులను ప్రకటించే నిర్ణయం తీసుకున్నాం. 26 జిల్లాలను ఏర్పాటు చేశాం. ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థ, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వ్యవస్థను తేగలిగాం. ప్రభుత్వ పథకాలను అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అందించగలుగుతామా? ఇది సాధ్యమేనా? అనుకునే పరిస్థితుల నుంచి ఎక్కడా లంచాలు, వివక్షకు తావులేకుండా పారదర్శకంగా అందించే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగలిగాం.

నా సేనానులు.. దళపతులు

ఈ రోజు ఇక్కడికి వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రీజనల్ కో ఆర్డినేటర్లు, జేసీఎస్ కో ఆర్డినేటర్లు, నియోజకవర్గాల పరిశీలకులు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, ఏఎంసీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలు, జెడ్పీటీసీలు,ఎంపీపీలు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, కార్పొరేటర్లు.. ఒక్క మాటలో చెప్పాలంటే పార్టీ గుర్తు మీద ఎన్నికైన మండలం, ఆపై స్థాయిలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, వారితో పాటు సమావేశానికి వచ్చిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నా మంత్రిమండలి సహచరులందరికీ మీ తమ్ముడిగా, అన్నగా నిండు మనసుతో స్వాగతం పలుకుతున్నా. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ రెండు మెట్లు ఎదిగి మరో రెండు మెట్లు ఎదగడానికి సిద్ధంగా ఉన్న ప్రజాసేవకులు, నా సేనానులే. ఇక్కడకు రాలేని నా కుటుంబ సభ్యులైన ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు అందరూ నా దళపతులే.

డీబీటీలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు 75 శాతానికిపైనే

ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు మేనిఫెస్టో గురించి చెబుతారు. ఎన్నికలు కాగానే చెత్తబుట్టలో వేసిన గత పాలకులకు భిన్నంగా మేనిఫెస్టోలో చెప్పిన 99 శాతం వాగ్దానాలు అమలు చేయడం ద్వారా జగన్ చెప్పాడంటే చేస్తాడని, మాట నిలబెట్టుకుంటాడని, కష్టమైనా నష్టమైనా అండగా ఉంటాడనే మంచి పేరును దేవుడి దయతో నాలుగున్నరేళ్ల పాలనలో తెచ్చుకోగలిగాం. అన్ని సామాజిక వర్గాలు, ప్రాంతాలను గుండెల నిండా ప్రేమతో అభిమానించాం. నా ఎస్సీలు, నా ఎస్టీలు, బీసీలు, మైనార్టీలంటూ.. ప్రతి మాటకు ముందు నా అనే మాటకు అర్థం చెబుతూ రూ.2.35 లక్షల కోట్లను డీబీటీ ద్వారా బటన్ నొక్కి నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాం. నా అనే మాటకు అర్థం చెబుతూ నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు 75 శాతానికి పైచిలుకు ఇవ్వగలిగాం.

80 శాతానికిపైగా ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రం మొత్తమ్మీద ఇప్పటివరకూ 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే కేవలం ఈ నాలుగున్నరేళ్లలో మరో 2.07 లక్షలు ప్రభుత్వ ఉద్యోగాలను కొత్తగా మీ బిడ్డ ప్రభుత్వం ఇవ్వగలిగింది. ఇందులో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏకంగా 80 శాతం పైచిలుకు ఉద్యోగాలను ఇవ్వగలిగాం. 31 లక్షల ఇళ్ల పట్టాలను నా అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టగలిగాం. 22 లక్షల ఇళ్లు ఈ రోజు వారి పేరుతో వేగంగా కడుతున్నాం. ఇందులో అత్యధికంగా 80 శాతం పైచిలుకు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టగలిగాం. సామాజిక న్యాయం అనే పదానికి అర్థం చెబుతూ గతంలో ఎప్పుడూ చూడని విధంగా నామినేటెడ్ పోస్టులు, నామినేటెడ్ కాంట్రాక్టుల్లో ఏకంగా 50 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చట్టం చేసి మరీ ఇవ్వగలిగాం.

పేదలకు తోడుగా నిలబడ్డాం..

విద్య, వైద్య వ్యవసాయ రంగాలు బాగుంటేనే మారుమూల పల్లెల్లో పేద కుటుంబాలకు మంచి జరుగుతుందని నమ్మి ఈ మూడు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పేదరికం పోవాలని, పేదరికంలో ఉన్నవాళ్లు పైకి రావాలని, పేదరికం అడ్డు రాకూడదని ఈ మూడు స్తంభాలను బలపర్చాం. రైతులు, రైతు కూలీలు, మహిళలకు తోడుగా నిలిచాం. నా 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రాంతాలవారీగా, సామాజిక వర్గాల వారీగా గుర్తించిన ప్రతి సమస్యకూ ఈ 52 నెలల కాలంలో పరిష్కారం చూపగలిగాం.



జనవరి 1 నుంచి మరో నాలుగు కార్యక్రమాలు

అక్టోబరు 25 నుంచి మొదలయ్యే నాలుగు కార్యక్రమాలు జనవరి 15 వరకు జరుగుతాయి. అవే కాకుండా జనవరి 1 నుంచి మరో నాలుగు కార్యక్రమాలు కూడా మొదలవుతాయి.

జనవరి 1 నుంచి పెన్షన్ పెంపు..

నా అవ్వాతాతలకు, నా వితంతు అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.3,000 వరకూ పెంచుకుంటూ పోతామని చెప్పిన పెన్షన్ పెంపు కార్యక్రమానికి జనవరి 1న శ్రీకారం చుడతాం. ఈ కార్యక్రమం జనవరి 10వ తారీఖు వరకు 10 రోజుల పాటు జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్‌లు ఇస్తే ఇవాళ మీ బిడ్డ హయాంలో 66 లక్షల మందికి పెన్షన్ లిస్తున్నాడన్న విషయాన్ని చెప్పాలి. మన ప్రభుత్వం రాకమునుపు ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు పెన్షన్ల ఖర్చు కేవలం రూ.400 కోట్లు కాగా ఈ రోజు మీ బిడ్డ చిరునవ్వుతో భరిస్తున్న భారం నెలకు అక్షరాలా రూ.2,000 కోట్లు అని వివరించాలి.

జనవరి 10 నుంచి వైఎస్సార్ చేయూత

జనవరి 10 నుంచి రెండో కార్యక్రమం వైఎస్ఆర్ చేయూత మొదలవుతుంది. జనవరి 10 నుంచి జనవరి 20 వరకు ప్రతి గ్రామంలోనూ జరుగుతుంది. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ద్వారా ఇప్పటికే మూడు దఫాల్లో రూ.14,129 కోట్లు ఇచ్చాం. జనవరిలో ఇవ్వబోయేది కూడా కలుపుకొంటే ఈ ఒక్క కార్యక్రమానికే ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు ఇచ్చినట్లవుతుంది. అంతే కాకుండా వారికి బ్యాంకు రుణాలతో తోడ్పాటు అందిస్తున్నాం. అక్కచెల్లెమ్మలు విజయగాథలను అందరికీ తెలియచేసే ఈ పండుగ వాతావరణంలో మీరందరూ భాగస్వాములై వారి ఆశీస్సులు తీసుకోవాలి.

జనవరి 20 నుంచి వైఎస్సార్ ఆసరా..

జనవరి 20 నుంచి 30వతేదీ వరకు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమం చివరి విడత నిధుల్ని చెల్లిస్తూ జగనన్న మాట నిలబెట్టుకుంటున్నాడని చెప్పాలి. నాలుగు దఫాలుగా నా అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటానని చెప్పా. మన ప్రభుత్వం రాకమునుపు పొదుపు సంఘాల ఎన్‌పీఏలు, అవుట్ స్టాండింగ్‌లు 18 శాతం కాగా ఈరోజు కేవలం 0.3 శాతం మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే మూడు దఫాలుగా ఆసరా కార్యక్రమం ద్వారా రూ.19,178 కోట్లు అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టాం. చివరి విడతగా మరో రూ.6500 కోట్లు నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం జనవరి 20 నుంచి 30 వరకు ఆసరా ద్వారా చెల్లించి తోడుగా ఉండే కార్యక్రమం జరుగుతుంది. కేవలం వైఎస్ఆర్ ఆసరా ద్వారానే దాదాపు రూ.26 వేల కోట్లు వారి చేతిలో పెట్టాం. సున్నావడ్డీ ద్వారా మరో రూ.5వేల కోట్లు ఇచ్చాం.

ఫిబ్రవరి: మళ్లీ జగనన్ననే తెచ్చుకుందాం

ఇక ఫిబ్రవరిలో మళ్లీ జగనన్ననే తెచ్చుకుందాం కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇది జగనన్న పంపించిన మేనిఫెస్టో అని చెబుతూ ప్రతి ఇంటికీ తీసుకుని వెళ్లే కార్యక్రమం చేస్తాం. ఫిబ్రవరిలో ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మార్చిలో ఎన్నికలకు సన్నద్ధం కావాలి కాబట్టి మనం చేసిన మంచిని గ్రామ గ్రామాన, ఇంటింటా అందరికీ తెలియజేసేలా, పర్యవేక్షించే బాధ్యతను మీ భుజస్కంధాలపై మోపుతున్నాం. మీలో ప్రతి ఒక్కరూ ఇక్కడ తెలుసుకున్న ప్రతి అంశంపైన గ్రామ స్థాయిలో అవగాహన కలిగించాలి.

ఎన్నికల తర్వాతా.. జనంలోనే

మన మాదిరిగా ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా నిరంతరం జనంలో ఉన్న పార్టీ దేశంలో మరొకటి లేదని సగర్వంగా తెలియజేస్తున్నా. కోవిడ్ సమయంలో ఆదాయాలు తగ్గినా కూడా మాటకు కట్టుబడి ప్రజలకు మంచి చేశాం. మన బలం మాట నిలబెట్టుకోవడం. మన బలం విశ్వసనీయత అన్న పదానికి నిజమైన అర్థం చెప్పడం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద వర్గాలకు నిండు మనసుతో చేసిన మంచి మన బలం. 87 శాతం పైచిలుకు ఇళ్లల్లో మనం చేసిన మంచే కనిపిస్తుంది. నాలుగున్నరేళ్లలో మనం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో కళ్లెదుటే స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు మరి వై నాట్ 175? మనమంటే గిట్టని వారు ఎన్ని చెబుతున్నా అది కచ్చితంగా సాధ్యమే.

ఇక మరింతగా ప్రజల్లోకి..

ఇప్పుడు అక్టోబరులో ఉన్నాం. బహుశా ఎన్నికలు మార్చి, ఏప్రిల్‌లో జరుగుతాయి. ఇన్ని అడుగులు మనం వేశాం. రాబోయే నెలల్లో వేసే అడుగుల గురించి మీ అందరితో నా ఆలోచనలను ఇవాళ పంచుకుంటా. వాటిని మీరు గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి కచ్చితంగా, బాగా అమలయ్యేలా మీరు పర్యవేక్షించాలి. ఈ బాధ్యతను మీరు తీసుకోవాలి. గ్రామ స్థాయిలో సమావేశాలను నిర్వహించి గొప్పగా అడుగులు పడేలా చర్యలు తీసుకోవాలి.

జగనన్న ఆరోగ్య సురక్ష..

నాలుగు కార్యక్రమాల్లో ఒకటి.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం. ఇది ఇప్పటికే జరుగుతోంది. మీరు మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీవల్ల ప్రజలకు మరింత ఉపయోగం ఈ కార్యక్రమం ద్వారా జరగాలి. గత నెల 30న మొదలుపెట్టిన ఈ కార్యక్రమం నవంబరు 10 వరకు కొనసాగుతుంది. ప్రివెంటివ్ కేర్‌లో దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా అడుగులు వేస్తున్నాం . జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సచివాలయాల పరిధిలో 15 వేల క్యాంపులను అర్బన్, రూరల్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. మొత్తంగా 1.60 కోట్ల ఇళ్లను కవర్ చేస్తున్నాం. ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేస్తున్నాం. ఉచిత పరీక్షలకు శ్రీకారం చుట్టాం. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటినీ జల్లెడ పడుతున్నాం. ఆ ఇంట్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వారిని చేయిపట్టుకుని నడిపించడమే కాకుండా అన్ని రకాలుగా తోడుగా ఉంటూ అడుగులు వేయిస్తున్నాం. మొత్తం 5 దశలలో నిర్వహిస్తున్నాం. ఐదో దశ కీలకం. మీరు ఎక్కువగా నిమగ్నం కావాల్సిన దశ ఇదే. ఇక మీదట ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా జరుగుతుంది. గ్రామాల్లో ప్రతి 6 నెలలకొకమారు ఈ క్యాంపు జరుగుతుంది.

"వై ఏపీ నీడ్స్ జగన్.."

ఇక రెండో కార్యక్రమం.. ''వై ఏపీ నీడ్స్ జగన్''. ప్రజలందరి ఆశీస్సులతో వారికి మరింత సేవ చేయడానికి, మరింత మంచి చేయడానికి కొనసాగాల్సిన అవసరాన్ని వివరించే కార్యక్రమమే ఇది. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలని వివరిస్తూ 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం నవంబరు 1 తేదీ నుంచి మొదలవుతుంది. డిసెంబరు 10 వరకు దాదాపు 40 రోజులపాటు జరుగుతుంది. ఇందులో రెండు ముఖ్యమైన దశలుంటాయి. మొదటిది మన గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించడం. రెండో దశగా రాష్ట్రంలో ఉన్న 1.60 కోట్ల ఇళ్లకు, ప్రతి గడపకూ వెళ్లేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎంతమందికి లబ్ధి జరిగింది? వీటికి సంబంధించిన బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమంలో మీరంతా పాల్గొనాలి. ఆ తర్వాత గ్రామంలో పార్టీ జెండా ఎగరవేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. స్థానిక పెద్దల ఇంటికి వెళ్లి వారి ఆశీస్సులు పొందాలి. ఈ 52 నెలల కాలంలో గ్రామం నుంచి రాజధానుల వరకు మన ప్రభుత్వం ఎన్నెన్ని మార్పులు తెచ్చిందో ఇటీవల స్వాతంత్ర దినోత్సవం రోజు నా ప్రసంగంలో సుదీర్ఘంగా వివరించా. అందులో ప్రతి అంశాన్ని మండలస్థాయి నాయకత్వం అర్థం చేసుకోవాలి. గ్రామ స్థాయి నాయకత్వానికే కాకుండా పెద్దలందరికీ వివరించే కార్యక్రమం జరగాలి. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటినీ, ప్రతి గడపనూ విధిగా సందర్శించాలి. 99 శాతం వాగ్దానాలను పూర్తి చేసిన విషయాన్ని మేనిఫెస్టో చూపిస్తూ వివరించాలి. అదే సమయంలో మన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు 2014లో గత ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోను కూడా చూపించాలి. ప్రతి వాగ్దానాన్ని వాళ్లు ఎలా ఎగ్గొట్టారో, ప్రజలను ఎలా మోసం చేశారో వివరించాలి. ఆ మోసాల గురించి ప్రతి ఇంట్లో టైం తీసుకుని వినయంగా, సుదీర్ఘంగా చెప్పే కార్యక్రమం చేయాలి.

బస్సు యాత్రలు..

మూడో కార్యక్రమంగా బస్సు యాత్రలు అక్టోబరు 25వ తేదీన మొదలవుతాయి. డిసెంబరు 31 వరకు దాదాపు 60 రోజుల పైచిలుకు జరిగే కార్యక్రమమిది. రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో బస్సు యాత్రలు జరుగుతాయి. ఒక్కో టీమ్‌లో పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సీనియర్ నాయకులంతా ఉంటారు. ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మీటింగ్‌లు ఆ నియోజకవర్గంలో జరుగుతాయి. రోజూ రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో మూడు మీటింగ్‌లు జరుగుతాయి. ఒక్కో రోజు ఆ ప్రాంతంలోని అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించి మీటింగ్ పెట్టి ప్రభుత్వం చేసిన మంచి గురించి, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, మారిన మన ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రుల గురించి, మారిన మన వ్యవసాయం గురించి, జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ స్థానికంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రానికి మూడు ప్రాంతాల్లో మూడు పబ్లిక్ మీటింగ్‌లు, బస్సు పైనుంచే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభకు స్థానిక ఎమ్మెల్యే లేదా అసెంబ్లీ కన్వీనర్ అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా 60 రోజుల పాటు ప్రతిరోజూ మూడు ప్రాంతాల్లో మూడు మీటింగ్‌లు ఉంటాయి. మీరంతా ఈ బస్సు యాత్ర కార్యక్రమంలో పాల్గొని మమేకం కావాలి. ఇది మామూలు బస్సు యాత్ర కాదు. ఒక సామాజిక న్యాయ యాత్ర. పేదవాడికి జరిగిన మంచిని వివరించే యాత్ర. 60 రోజుల్లో మొత్తం 175 నియోజకవర్గాల్లో బహిరంగ సభలు జరుగుతాయి.

ఆడుదాం ఆంధ్రా..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అయిపోయిన తర్వాత నాలుగో కార్యక్రమంగా డిసెంబర్ 11 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' మొదలవుతుంది. ఇది డిసెంబర్ 11 నుంచి సంక్రాంతి వరకు అంటే జనవరి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించే క్రీడా సంబరం. ఆడుదాం ఆంధ్రా ద్వారా నైపుణ్యం ఉన్నవారిని గ్రామస్థాయి నుంచి గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వ ఉద్దేశం. భారతదేశ టీమ్‌లో వైనాట్ ఆంధ్రప్రదేశ్? అనే రీతిలో కార్యక్రమం జరగాలి. ఈ కార్యక్రమం 45 రోజుల పాటు జరుగుతుంది. గ్రామ, వార్డు సచివాలయాల నుంచి మొదలై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ క్రీడా సంబరాలు జరుగుతాయి. మన గ్రామంలో మరుగున పడి ఉన్న మన పిల్లల టాలెంట్‌ను దేశానికే పరిచయం చేసే కార్యక్రమం ఇది. ఇక నుంచి ఈ కార్యక్రమం ఏటా జరుగుతుంది.

మన పొత్తు ప్రజలతోనే..

వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో ముఖ్యమంత్రి జగన్

- ప్రజలకు మనం చేసిన మంచే మన బలం.. ధైర్యం.. ఆత్మవిశ్వాసం
- రాజకీయమంటే చనిపోయాక కూడా ప్రతి మనిషి గుండెలో బతికి ఉండటమే
- మన ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే దాన్నే కొలమానంగా తీసుకోండి
- కురుక్షేత్ర యుద్ధంలో మీ బిడ్డకు మీరే సైనికులుగా మారండని అడుగుతున్నా
- పొత్తుల కోసం విపక్షాల వెంపర్లాట.. సున్నాలు ఎన్ని కలిసినా ఫలితం సున్నానే
- విశ్వసనీయత లేని చంద్రబాబు జనంలో ఉన్నా జైల్లో ఉన్నా ఒకటే
- పార్టీ పెట్టి 15 ఏళ్లవుతున్నా బాబును భుజాన మోయడమే పార్ట్‌నర్ జీవితం

“ ప్రతిపక్షాలన్నీ పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయి. రెండు సున్నాలు కలిసినా.. నాలుగు సున్నాలు కలిసినా ఫలితం సున్నానే. ఎన్ని సున్నాలు కలిసినా వచ్చేది పెద్ద సున్నాయే. ఒకరైతే పార్టీ స్థాపించి 15 ఏళ్లవుతున్నా ఇవ్వాళ్టికీ ప్రతి నియోజకవర్గానికి అభ్యర్థి లేడు. ప్రతి గ్రామంలో జెండా మోసే కార్యకర్త లేడు. ఆయన జీవితమంతా చంద్రబాబును భుజానికెత్తుకుని మోయడమే. చంద్రబాబు దోచుకున్నది పంచుకోవడంలో ఆయన పార్ట్‌నర్. వారిద్దరూ కలిసి ప్రజలను ఎలా మోసం చేయాలని ఆలోచిస్తారు. ప్రజలకు మంచి చేయాలనే మనస్తత్వం వారికి లేదు. ”

– వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఎన్నికల సంగ్రామంలో తమ పొత్తు ప్రజలతోనేనని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. పొత్తుల కోసం ప్రతిపక్షాలు వెంపర్లాడుతున్నాయని.. రెండు సున్నాలు కలిసినా, నాలుగు సున్నాలు కలిసినా ఫలితం సున్నానేనంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై వ్యంగ్యోక్తులు విసిరారు. 'మీ బిడ్డ పొత్తుల మీద ఆధారపడడు. దేవుడ్ని.. ఆ తర్వాత ప్రజలనే నమ్ముకుంటాడు. మన పొత్తు నేరుగా ప్రజలతోనే' అని పేర్కొన్నారు. దేవుడి దయతో ప్రజలకు మనం చేసిన మంచే మన బలమని.. మన ధైర్యం.. మన ఆత్మవిశ్వాసమని స్పష్టం చేశారు. సోమవారం విజయవాడ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

ఇంటింటికీ వెళ్లిన పార్టీ మనదే..

ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన 99 శాతం వాగ్దానాలను అమలు చేసిన ప్రభుత్వం మనది. సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ప్రభుత్వం మనది. ఇదే మన ధైర్యం. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వం మనది. ఇలాంటివన్నీ సాధ్యపడతాయని ఎవరైనా కలలోనైనా అనుకున్నారా? ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా, అర్హతే ప్రామాణికంగా మీ బిడ్డ బటన్ నొక్కగానే ఆర్థిక సహాయం అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా వస్తుందని ఎవరైనా అనుకున్నారా? అలాంటి విప్లవాత్మక చర్యలు మన సొంతం. నవరత్నాల్లోని ప్రతి సంక్షేమ పథకం అమలూ ఒక విప్లవమే. ఎన్నికల మేనిఫెస్టోను వెంటబెట్టుకుని ఇంటింటికీ వెళ్లి ఇదిగో వీటిని అమలు చేశామంటూ ప్రజల ఆశీర్వాదాన్ని తీసుకున్న పార్టీ దేశ చరిత్రలో ఏదైనా ఉందంటే.. అది వైఎస్సార్ సీపీనే. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా నిరంతరం ప్రజల్లో ఉన్న పార్టీ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే. అప్పుడు ఎమ్మెల్యేల్లో కొంతమందికి కష్టం అనిపించినా ఇప్పుడు వారిలో చిరునవ్వులు చూస్తున్నాం.

బాబు జనంలో ఉన్నా జైల్లో ఉన్నా ఒకటే!

చంద్రబాబు అనే వ్యక్తి ప్రజల్లో ఉన్నా జైల్లో ఉన్నా పెద్ద తేడా ఏమీ ఉండదు. ఆయనకు విశ్వసనీయత లేదు. అలాంటి వ్యక్తి ఎక్కడున్నా ఒకటే. చంద్రబాబును, ఆయన పార్టీని చూసినప్పుడు పేదవాడికి, ప్రజలకు గుర్తుకొచ్చేది ఒక్కటే.. మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాలు, వంచనలే. అదే మన పార్టీని చూసినప్పుడు, జగన్‌ను చూసినప్పుడు సామాజిక న్యాయం గుర్తుకొస్తుంది. గ్రామాల్లో మారిన వైద్యం, స్కూళ్లు, వ్యవసాయం, ప్రాంతాల మధ్య న్యాయం, లంచాలు, వివక్షలేని వ్యవస్థలు గుర్తుకొస్తాయి. ఫోన్ తీసుకుని అక్క చెల్లెమ్మలు ధైర్యంగా బయటకు వెళ్లే పరిస్థితి గుర్తుకు వస్తుంది. దిశ యాప్ ద్వారా వారికి లభించే భరోసా గుర్తుకు వస్తుంది. 1.24 కోట్ల మంది అక్కచెల్లెమ్మలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఫోన్‌ను ఐదు సార్లు ఊపినా.. ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా పోలీసులు వెంటనే వారి వద్ద ఉంటారు. రాష్ట్రంలో మంచి పోలీసన్న రూపంలో జగనన్న ఆ మహిళలకు గుర్తుకొస్తారు. ఎస్‌వోఎస్ కాల్ ఫీచర్ ద్వారా ఇప్పటికే 30,336 మంది అక్కచెల్లెమ్మలు సహాయం పొందారు.

రాజకీయమంటే..

చంద్రబాబు, ఆయన పార్ట్‌నర్‌కు రాజకీయం, విశ్వసనీయత అంటే తెలియదు. చనిపోయిన తర్వాత ప్రతి ఇంట్లో మన ఫోటో ఉండాలనే ఆలోచన వారికి లేదు. వారికి తెలిసిన రాజకీయమంతా అధికారంలోకి రావడం.. దోచుకోవడం.. పంచుకోవడం.. తినడమే. రాజకీయం అంటే ఇది కాదు. చనిపోయిన తర్వాత కూడా ప్రతి మనిషి గుండెలో బతికి ఉండటం.. ప్రతి ఇంట్లో మన ఫోటో ఉండటం అన్నది మనకు తెలిసిన రాజకీయం. మీ బిడ్డ ఎవరితోనూ పొత్తు పెట్టుకోడు. నేరుగా ప్రజలతోనే మన పొత్తు. అబద్ధాలు, మోసాలను నమ్మకండి. మన ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే దాన్ని మాత్రమే కొలమానంగా తీసుకోండి. కురుక్షేత్ర యుద్ధంలో మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవండి. దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ప్రజలను అడగడానికి ధైర్యం చేయని విషయాలను మీ బిడ్డ అడగగలుగుతున్నాడు.

కష్టమైనా మాట తప్పలేదు..



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం జగన్

మన ప్రభుత్వం చేసిన మంచి పనులే మన బలం. కోవిడ్ సమయంలోనూ, ఆదాయాలు తగ్గిన సమయంలో కూడా రాబడి తగ్గినా ఇచ్చిన మాటకు కట్టుబడి కష్టమైనా సరే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మంచి చేశాం. ఇదే మన బలం. మాట నిలబెట్టుకోవడం, విశ్వసనీయత అనే పదానికి నిజమైన అర్థం చెప్పడం మన బలం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద వర్గాలకు అండగా నిలవడం మన బలం. అవ్వాతాతల గురించి ఆలోచించి సమయానికి వారికి మంచి చేయడం మన బలం. వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలలో మనం తెచ్చిన మార్పులు మన బలం. అధికార వికేంద్రీకరణ, పారదర్శకత వ్యవస్థ, లంచాల్లేని వ్యవస్థను గ్రామస్థాయిలో తీసుకురావడం మన బలం. ఇన్ని బలాలతో మనం ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్నాం. ఏ గ్రామాన్ని చూసినా, ఏ నియోజకవర్గాన్ని చూసినా ప్రతి ఇంటికీ మనం చేసిన మంచే కనిపిస్తుంది. ప్రతి ఇంట్లో కూడా మనం తీసుకొచ్చిన మార్పు కనిపిస్తుంది. అలాంటప్పుడు వైనాట్ 175? అని అడుగుతున్నా.

చంద్రబాబుపై నాకు కక్ష లేదు

కక్ష సాధింపుతో ఆయన్ను ఎవరూ అరెస్టు చేయలేదు: సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే.. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు చేసిన ప్రధాని మోదీ
- సీబీఐ, ఈడీ, ఐటీలను ఏపీలో అడుగుపెట్టనివ్వకుండా అనుమతి రద్దు చేసిన చంద్రబాబు
- కేంద్ర ప్రభుత్వ విభాగాలు ఐటీ, ఈడీలు ఆయన అవినీతిపై విచారణ చేసి నిరూపించాయి
- దోషులను ఈడీ అరెస్టు చేసింది.. చంద్రబాబుకు నోటీసులు జారీ చేసిన ఐటీ శాఖ
- బాబును సమర్థించడమంటే పేదలను వ్యతిరేకించడమేనని ప్రజలకు వివరించాలి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేతలు, ఎల్లో మీడియా చేస్తున్న ఆరోపణలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొట్టి పారేశారు. చంద్రబాబుపై తనకు ఎలాంటి కక్ష లేదని స్పష్టం చేశారు. కక్ష సాధింపుతో ఆయన్ను ఎవరూ అరెస్టు చేయలేదని తేల్చి చెప్పారు. తాను దేశంలో లేనప్పుడు, లండన్‌లో ఉన్న సమయంలో పోలీసులు చంద్రబాబును అరెస్టు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం జగన్ మాట్లాడారు.



- చంద్రబాబుపై కక్ష సాధింపు నిజమనుకుంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉంది. తాను బీజేపీతోనే ఉన్నానని దత్తపుత్రుడు ఇప్పటికీ అంటున్నాడు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలితోపాటు సగం మంది టీడీపీ నాయకులు రాష్ట్ర బీజేపీలోనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్‌కమ్ ట్యాక్స్(ఆదాయపు పన్ను శాఖ), ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారణ చేసి చంద్రబాబు అవినీతిని నిరూపించాయి. ఈడీ దోషులను అరెస్టు చేసింది. చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు కూడా ఇచ్చింది.
- మనం (వైఎస్సార్ సీపీ) ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు చేశారు. నాడు కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు సర్కార్‌కు నోటీసులు కూడా జారీ చేసింది. తన అవినీతి గురించి ప్రధాని మోదీకి తెలుసుకాబట్టే సీబీఐ, ఐటీ, ఈడీని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వకుండా చంద్రబాబు వాటికి అనుమతిని రద్దు చేశారు.
- ఆనాటికే అవినీతిపరుడని స్పష్టంగా రూఢీ అయిన చంద్రబాబుపై విచారణ చేయకూడదట! ఆధారాలు లభించినా అరెస్టు చేయకూడదట! విచారించిన తర్వాత కోర్టు రిమాండుకు పంపినా ఒక చంద్రబాబునుగానీ ఒక వీరప్పన్‌నుగానీ ఎవరూ పట్టించి ఇవ్వడానికి వీల్లేదనే తరహాలో ఎల్లో మీడియా, ఎల్లో గజదొంగల ముఠా వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వ్యవస్థలతో మనం యుద్ధం చేస్తున్నాం.
- చంద్రబాబును సమర్థించడం అంటే.. పేద సామాజిక వర్గాలను వ్యతిరేకించడమే అనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లండి. చంద్రబాబును సమర్థించడమంటే పేదవాళ్లకు వ్యతిరేకంగా ఉండటమే! పెత్తదారీ వ్యవస్థను, నయా జమీందారీ వ్యవస్థను సమర్థించడమే. పేద వర్గాల పిల్లలకు ఇంగ్లిష మీడియం చదువులను వ్యతిరేకించడమే. చంద్రబాబును సమర్థించడమంటే నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలిస్తే డెమోగ్రాఫిక్ ఇంబ్యాలెన్స్ (సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది) ఏర్పడుతుందంటూ వారు కోర్టుల్లో వేసిన దావాలను సమర్థించడమే. చంద్రబాబును సమర్థించడమంటే కొన్ని వర్గాలు ఎప్పటికీ పేదలుగా, కూలీలుగా మిగిలిపోవాలని సమర్థించినట్లే. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తానన్న పెత్తందారీ భావజాలాన్ని సమర్థించడమేనని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి.

వైఎస్సార్‌సీపీలో సరికొత్త జోష్

- ప్రతినిధుల సదస్సులో సీఎం ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపు
- ఎన్నికల కదన రంగంలోకి సమరోత్సాహం
- సంక్షేమ పథకాల అమలుతో పార్టీపై ప్రజల్లో మరింత ఆదరణ
- 175కి 175 సీట్లు సాధిస్తామని ధీమా
- వన్స్ మోర్ జగనన్న.. వై నాట్ 175, మా నమ్మకం నువ్వే జగన్ నినాదాలతో మార్మోగిన సదస్సు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమరోత్సాహం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో భాగంగా విజయవాడలో సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో సరికొత్త జోష్‌ను నింపింది. 175కి 175 స్థానాలను సాధించడమే లక్ష్యంగా ఎన్నికల కదన రంగంలోకి దూకడానికి సీఎం మాటలు బూస్ట్ ఇచ్చాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత 52 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రతి ఇంటికీ చేస్తున్న మంచిని వివరిస్తూ.. ప్రతిపక్షాల తీరును ఎండగడుతూ ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం ఆ పార్టీ ప్రతినిధుల్లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపయ్యేలా చేసింది. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు సేనానులుగా.. సైనికులుగా పోరాటం చేస్తామని ప్రతినిధులు నినదించారు. '2024లో వన్స్‌మోర్ జగనన్న', 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్', 'వైనాట్ 175' నినాదాలతో ప్రతినిధుల సదస్సు ప్రాంగణం మార్మోగింది. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా విజయవాడలో సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ ప్రతినిధుల సదస్సును వైఎస్సార్‌సీపీ నిర్వహించింది. పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశానికి తరలివచ్చారు.

80 శాతం ప్రజల మద్దతుతో నూతనోత్సాహం..

గత సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మేనిఫెస్టోలో ఇచ్చిన 95 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేసి చూపారు. ఎక్కడా ఎలాంటి అవినీతికి తావులేకుండా, కులమతవర్గాలు, పార్టీలకతీతంగా అర్హతలున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారు. దీంతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీపై మరింత ఆదరణ పెరిగింది. ఆ తర్వాత మేనిఫెస్టోలోని వాగ్దానాలను 99 శాతం అమలు చేశారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల పదవుల నుంచి కేబినెట్ వరకూ సామాజిక న్యాయాన్ని ఆచరించి చూపారు. అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట వేశారు. పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేలా భారీ ఎత్తున పోర్టులు, షిప్ యార్డ్‌లు చేపట్టడంతో అన్ని వర్గాల ప్రజల్లోనూ వైఎస్సార్‌సీపీకి ఆదరణ మరింత పెరిగింది. ఇది స్థానిక సంస్థల ఎన్నికలు.. తిరుపతి లోక్‌సభ.. ఆత్మకూరు, బద్వేలు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడానికి దారితీసింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికీ చెప్పడానికి గతేడాది మే 11న చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని వివరిస్తూ.. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎండగడుతూ ఏప్రిల్ 7 నుంచి 29 వరకూ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి కూడా విశేష స్పందన లభించింది. 80 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

క్లీన్‌స్వీప్ ఖాయం..

ప్రభుత్వం చేసిన మంచి వల్ల ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో కొట్టొచ్చినట్లు మార్పు కనిపిస్తోంది. ఇదే అంశాన్ని ప్రతినిధుల సదస్సులో సీఎం వైఎస్ జగన్ నొక్కిచెప్పడం శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేసింది. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి, పార్టీకి ఇంత సానుకూలమైన వాతావరణం గతంలో ఎన్నడూ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో తాము వైఎస్సార్‌సీపీ నేత, కార్యకర్తనంటూ ప్రజల్లో కాలరెగరేసుకుని తిరగగలుగుతున్నామని.. ఈ నేపథ్యంలో 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం తథ్యమని విశాఖపట్నం జిల్లా నుంచి వచ్చిన ప్రతినిధి సతీశ్ 'సాక్షి'కి చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల్లో వైఎస్సార్ సీపీకి అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేసినట్లుగా కలిసికట్టుగా కదిలితే క్లీన్‌స్వీప్ చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

కృష్ణా జలాలపై తగ్గేదే లేదు

జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం

సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ఇప్పటికే నిర్ణయం

సాక్షి, అమరావతి: కృష్ణా నది జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్లాలని జల వనరుల శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణలో రాజీపడే ప్రశ్నే లేదని తేల్చిచెప్పారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2)కు కేంద్ర జల్ శక్తి శాఖ కొత్త మార్గదర్శకాలతో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖలు రాయాలని ఆదేశించారు. రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని చెప్పారు. కృష్ణా జలాలపై కేంద్రం తాజా విధి విధానాలపై సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, న్యాయ నిపుణులతో సీఎం వైఎస్ జగన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కృష్ణా జలాల పంపిణీపై గతంలో బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1), బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) చేసిన కేటాయింపులపై సమగ్రంగా చర్చించారు. కేడబ్ల్యూడీటీ-2 తదుపరి నివేదిక ద్వారా మిగులు జలాల కేటాయింపుల్లోనూ రాష్ట్రానికి నష్టం జరిగిన అంశంపైనా చర్చించారు. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు.

విభజన చట్టానికి విరుద్ధం

కేంద్ర మార్గదర్శకాలు విభజన చట్టం సెక్షన్-89లో పేర్కొన్న అంశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. రాష్ట్ర విభజనకు ముందు చేసిన కేటాయింపులకు కట్టుబడి ఉండాలని విభజన చట్టం స్పష్టం చేస్తుంటే.. దీనిని ఉల్లంఘించేలా కేంద్రం మార్గదర్శకాలు ఉన్నాయని వివరించారు. ఇప్పటికే సుప్రీం కోర్టు ముందు పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. అలాగే అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టంలో క్లాజ్-4ను కూడా కేంద్రం ఉల్లంఘించిందని, 2002కు ముందు చేసిన కేటాయింపులను, పంపకాలను పునఃపరిశీలించరాదని ఈ చట్టం స్పష్టం చేస్తోందని తెలిపారు. గోదావరి జలాల కేటాయింపులను ఇంకో బేసిన్‌కు తరలించుకోవచ్చన్న వెసులుబాటుతో మన రాష్ట్రం పోలవరం నుంచి తరలించే నీటిని పరిగణనలోకి తీసుకుని ఆమేరకు తెలంగాణకు కృష్ణా జలాల్లో అదనపు కేటాయింపులు చేసే అంశాన్ని కూడా కేడబ్ల్యూడీటీ-2కు నిర్దేశించడం సమంజసం కాదని, ఇది రాష్ట్రానికి నష్టమని అధికారులు వివరించారు. అదే తెలంగాణ గోదావరి నుంచి 214 టీఎంసీలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్నప్పటికీ, ఆ మేరకు కృష్ణా జలాలను అదనంగా మన రాష్ట్రానికి కేటాయించేలా కేడబ్ల్యూడీటీ-2కు జారీ చేసిన విధి విధానాల్లో చేర్చకపోవడంపైనా సమావేశంలో చర్చించారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్గనిర్దేశం చేశారు.









తన ఆలోచనల రంగులతో ఆత్మ వన్నెలద్దుకుంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 10 అక్టోబర్ 2023

మానవాళి కోరుకోని యుద్ధం

ఆ దృశ్యాలు ఏదో హార్రర్ సినిమానో, మరేదో అమెరికన్ వార్ సినిమానో చూస్తున్నట్లుంది. ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన 'హమాస్' తీవ్రవాద సంస్థ జరిపిన ఆకస్మిక దాడులు, బదులుగా గాజా భూఖండంపై ఇజ్రాయెల్ చేస్తున్న ప్రతీకార దాడుల దృశ్యాలు మూడు రోజులుగా చూస్తున్న వారికి ఒళ్ళు ఝల్లుమనేలా చేస్తున్నాయి. భారీ విధ్వంసాలు, 1200 మందికి పైగా మృతులు, వేలల్లో నిరాశ్రయులు, పసిపిల్లల మొదలు పదహారేళ్ళ పడుచుల దాకా తీవ్రవాదుల చేతిలో చిక్కిన వందకు పైగా బందీల కథ మానవతావాదుల గుండెను బరువెక్కిస్తోంది. పొరుగున ఉన్న అరబ్ దేశాలతో ఇప్పుడిప్పుడే ఇజ్రాయెల్ సంబంధాలు మెరుగుపడుతున్నాయనీ, ఆర్థిక సహకారం – శాంతి సాధనే ధ్యేయంగా సరికొత్త మధ్యప్రాచ్యానికి బాటలు పడుతున్నాయనీ భావిస్తున్న వేళ ఉరుము లేని పిడుగులా హమాస్ దాడి మొత్తం కథను మార్చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చేసిన అనివార్య యుద్ధప్రకటన కాలాన్ని వెనక్కి తిప్పేసింది. తాజా ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంతో దశాబ్దాల పాటు మధ్యప్రాచ్యంలో కొనసాగిన అశాంతి మళ్ళీ భూతమై తిరిగొచ్చింది.

ఇది యాభై ఏళ్ళ నాటి జ్ఞాపకాలను తట్టిలేపింది. అప్పట్లో 1973 అక్టోబర్ 6న యూదుల లెక్కలో పవిత్రమైన యోమ్ కిప్పూర్ రోజున ఈజిప్ట్, సిరియాలు సరిగ్గా ఇలాగే ఇజ్రాయెల్‌పై దాడి చేశాయి. 1949, 1956, 1967 తర్వాత 'నాలుగో అరబ్ – ఇజ్రాయెలీ యుద్ధం'గా పేరుబడ్డ ఆ 19 రోజుల యుద్ధంలో చివరకు ఇజ్రాయెల్ పైచేయి సాధించి, పొరుగు భూభాగాలను స్వాధీనం చేసుకుంది. దాంతో, పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. అప్పటిలానే మళ్ళీ ఇప్పుడు ఇజ్రాయెల్‌పై భయానక దాడి జరిగింది. అదీ పవిత్ర హిబ్రూ బైబిల్‌లోని తొలి అయిదు భాగాల సమాహారమైన తోరా పఠనం ప్రారంభించే రోజున జరిగింది. గూఢచర్యంలో, దాడుల్ని నిరోధించే వ్యవస్థల్లో పేరున్న ఇజ్రాయెల్ ఈసారీ ఏమరుపాటుతో ఉంది. అక్టోబర్ 7 తెల్లవారుజామున అంతా నిద్రలో ఉన్న వేళ ఆకాశ, సముద్ర, భూ మార్గాలు మూడింటి ద్వారా, ఏకకాలంలో అనేక ప్రాంతాల్లో హమాస్ తీవ్రవాదులు ఆకస్మిక దాడి జరిపి, దిగ్భ్రాంతికి గురిచేశారు. 5 నుంచి 7 వేల రాకెట్ల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్ అన్నట్టు ఒక రకంగా ఇది... 2001 సెప్టెంబర్ 11న అమెరికాలో అంతర్జాతీయ వాణిజ్య కేంద్ర జంట భవనాలపై అల్–ఖైదా తీవ్రవాదుల '9/11 దాడుల'ను గుర్తుచేస్తోంది.

ప్రపంచ ప్రసిద్ధ క్షిపణి – రాకెట్ నిరోధక వ్యవస్థ 'ఐరన్ డోమ్ సిస్టమ్'ను సైతం తప్పించుకొని, వందలాది రాకెట్లు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకొని రావడం నివ్వెరపరిచింది. ఇది నెతన్యాహూ సర్కార్ వైఫల్యాల్లో కొత్త చేరిక. తూర్పు జెరూసలేమ్‌లోని పవిత్ర అల్–అక్సా మసీదుకు వచ్చే పాలస్తీనా భక్తులపై దాడులు, మసీదులోకి యూదుల ప్రవేశం లాంటి రెచ్చగొట్టే చర్యలు పరిస్థితిని ఇక్కడి దాకా తెచ్చాయి. తాజా దాడి నుంచి ఇజ్రాయెల్ వెంటనే తేరుకొని, హమాస్ కీలక కేంద్రాలపై ప్రతిదాడులు జరిపింది. జొరబడిన హమాస్ తీవ్రవాదులను నిర్వీర్యం చేసింది. ఇప్పుడప్పుడే తెగే అవకాశం లేని ఈ యుద్ధంలో సైనిక బలిమితో చివరకు ఇజ్రాయెలే గెలవచ్చు కానీ, ఇరువైపులా జరిగే నష్టం మాటేమిటి? ఇరాన్‌ను శత్రువుగా భావిస్తూ, దాన్ని శిక్షించడానికి ఇజ్రాయెల్‌ను వాటంగా చేసుకుంటున్న అమెరికా ఈ ఒత్తిడి వ్యూహం వల్ల మధ్యప్రాచ్యంలో మంటలు చల్లారవని గ్రహించాలి.

మధ్యప్రాచ్యంలో మంటలు ఈనాటివి కావు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పాటుతో లక్షలాది పాలస్తీనియన్లు నిరాశ్రయులై, సొంత గడ్డ మీదే శరణార్థులు కావాల్సి వచ్చింది. నాటి నుంచి పాలస్తీనియన్లకూ, ఇజ్రాయెల్‌కూ మధ్య పోరు సాగుతూనే ఉంది. గతంలో 2008–09లో, 2014లో ఇజ్రాయెల్‌కీ, హమాస్‌కీ మధ్య యుద్ధాలు జరిగాయి. కానీ, కథ కంచికి చేరలేదు. నిజానికి, పాలస్తీనియన్ ప్రజలందరికీ హమాస్ ప్రతినిధి అనుకోవడం కూడా పొరపాటే. ఆ తీవ్రవాద సంస్థ చేసిన చర్యలన్నిటికీ పాలస్తీనాను తప్పుబట్టలేం. కానీ, దీర్ఘకాలిక పాలస్తీనా సమస్యకు పరిష్కారానికి చర్చలు, శాంతియుత మార్గమే సాధనం. అది గ్రహించకుండా హింసకు దిగేవారిని కూడా క్షమించలేం. తీవ్రవాద దాడుల దుష్ఫలితం ఇప్పటికే ప్రతిదాడుల రూపంలో గాజా భూఖండంలో అమాయకులపై పడింది. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక శాంతి, సుస్థిరతలు కావాలంటే పాలస్తీనియన్లకూ, ఇజ్రాయెల్‌కూ మధ్య పరస్పర అంగీకారయోగ్యమైన రాజకీయ రాజీ కుదరాలి. స్వతంత్ర పాలస్తీనా దేశమనేది అసాధ్యమైన వేళ ఆచరణయోగ్య పరిష్కారం వైపు ఆలోచించాలి. పాలస్తీనా పక్షాన ఇజ్రాయెల్‌కు ఎదురొడ్డుతున్న ఇరాన్, సిరియా, లెబనాన్‌లోని హెజ్బొల్లా బృందం అది గ్రహించాలి. ఉక్రెయిన్ యుద్ధంతో అస్తుబిస్తవుతున్న ప్రపంచం మరో యుద్ధాన్ని భరించలేదు.

భారత్ సంగతికొస్తే, రక్షణ వ్యవహారాల్లో బలమైన భాగస్వామి అయిన ఇజ్రాయెల్ చేతిని విడిచిపెట్టే పరిస్థితి లేదు. అదే సమయంలో దశాబ్దాల తరబడి పాలస్తీనా అంశంలో బాధితుల గళానికి మద్దతుగా నిలిచిన చరిత్ర మనది. ఆ చారిత్రక వైఖరిని పూర్తిగా వదిలేసి, ఇరాన్‌తో పాటు వివిధ అరబ్బు దేశాలతో స్నేహానికి పీటముడి వేసుకోనూ లేము. 'ఈ కష్టకాలంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటిస్తున్నాం' అని భారత ప్రధాని ప్రకటించారు. దురాక్రమణలు, తీవ్రవాద దాడులను విస్పష్టంగా ఖండించాల్సిందే. అదే సమయంలో గాజా భూఖండంపై ప్రతీకార దాడుల వల్ల ఇప్పటికే నిరాశ్రయులైన లక్షా పాతిక వేల మంది సామాన్య పౌరులపై మానవతాదృష్టి సారించాల్సిందే. అందుకు మనం ఇప్పుడు ఆచితూచి అడుగేయాలి. తటస్థంగా ఉంటూ, శాంతి స్థాపనకు కృషి చేయాలి. పాలస్తీనియన్లకు కొద్దిపాటి సడలింపులిస్తే ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలకు సిద్ధపడ్డ సౌదీ అరేబియా సైతం నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. మానవాళి కోరుకోని ఈ యుద్ధం ఆగాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.3.10 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.7.03 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.8.21 నుండి 10.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.33 నుండి 11.23 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం: 5.55
సూర్యాస్తమయం: 5.40
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

మద్యంలోనూ ఇంతటి అబద్ధాలు కష్టమే!

ఏది నిజం?

'ఈనాడు' రాతల్ని లేఖ రూపంలో అచ్చువేసిన పురందేశ్వరి

- తెలుగుదేశం చేస్తున్న ఆరోపణలతోనే హోంమంత్రి అమిత్ షాకు ఫిర్యాదు
- అన్నీ అబద్ధాలు వల్లెవేస్తూ సీబీఐ దర్యాప్తు కావాలనే అర్థరహిత వినతులు
- కొద్దిరోజులుగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షురాలిగా మారిపోయిన పురందేశ్వరి
- మొదట అప్పులపై అలవోకగా అబద్ధాలు... ఇప్పుడు మద్యంపై
- వాస్తవానికి మద్య నియంత్రణ దిశగా పకడ్బందీగా ఏపీ అడుగులు
- విక్రయ వేళలు తగ్గించటం నుంచి బెల్ట్ షాపుల రద్దు వరకూ అన్నీ ఆ దిశగానే
- పర్మిట్ రూమ్‌లు రద్దు... దుకాణాల సంఖ్య తగ్గింపు సైతం నిక్కచ్చిగా అమలు
- రేట్లు పెంచితే మద్యానికి దూరంగా ఉంటారనే ఉద్దేశంతో అదనపు పన్నులు
- ఈ చర్యలతో రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన మద్యం విక్రయాలు
- అన్నీ కళ్లముందు కనిపిస్తున్నా... దుష్ప్రచారానికి దిగుతున్న ఎల్లో ముఠా
- వారి తరఫునే తానూ వకాల్తా పుచ్చుకుంటున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు

అచ్చం రామోజీరావు నోట్లోంచి ఊడిపడ్డట్టు... 'ఈనాడు' రాతల్లోంచి పుట్టుకొచ్చినట్లు... తెలుగుదేశం ఆరోపణల్ని పుణికిపుచ్చుకున్నట్లు...!! కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేసిన ఫిర్యాదు గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే ఇంతకన్నా మరేమీ లేదు. టీడీపీ నేతల ఆరోపణల్ని చూసి రాసినట్టుగా తయారు చేసిన లేఖను అమిత్‌షాకు అందజేసి.. దీనిపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరటం ద్వారా పురందేశ్వరి తన మరిది చంద్రబాబు నాయుడి కళ్లలో సంతోషాన్ని చూడాలనుకున్నట్టున్నారు. తెలుగుదేశం పార్టీకి కొత్త ఆశలివ్వాలని అనుకున్నట్టున్నారు. అసలు ఆమె లేఖలో పేర్కొన్న ఆరోపణల్లో ఏ కొంచెమైనా నిజం ఉందా? ఏది నిజం? చూద్దాం...

వైఎస్సార్‌సీపీ హయాంలో దశలవారీ మద్య నియంత్రణ

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దశలవారీగా మద్య నియంత్రణ విధానాన్ని సమర్థంగా అమలు చేస్తోంది. ఇందుకోసం పలు చర్యలు చేపట్టింది.

- టీడీపీ హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 11 వరకూ విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24 గంటలూ విక్రయిస్తుండేవి. కానీ, ఇప్పుడు ఆ సమయాన్ని కుదించి, ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకే విక్రయాలకు అనుమతించారు. ఇది నిజం కాదా?
- బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు రద్దు చేశారు. చంద్రబాబు హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా 43 వేల బెల్ట్ దుకాణాలుండేవి. వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే వాటన్నింటినీ పూర్తిగా తొలగించారు. గతంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా అనుమతించిన పర్మిట్ రూమ్‌లు అనధికారిక బార్లుగా చలామణి అయ్యేవి. వాటినీ ఈ ప్రభుత్వం రద్దు చేయటం పచ్చి నిజం.
- రాష్ట్రంలో మద్యం దుకాణాల సంఖ్యనూ తగ్గించారు. టీడీపీ హయాంలో 4,380 మద్యం దుకాణాలుండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటిని 2,934కి తగ్గించింది. బార్ల సంఖ్యను పెంచలేదు. 2019లో ఖరారుచేసిన 840 బార్లే ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులివ్వలేదు. ఇది నిజం కాదా?
- మద్యం విక్రయాలను నిరుత్సాహపరచడమే తమ పార్టీ విధానమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చాలాసార్లు చెప్పారు. అందుకే అధికారంలోకి వచ్చాక మందుబాబులకు షాక్ కొట్టేలా మద్యం ధరలను పెంచారు. అదనపు ఎక్సైజ్ టాక్స్ (ఏఆర్ఈటీ) విధించారు. దీంతో మద్యం ధరలు పెరిగాయి. ఏఆర్ఈటీ పన్నుతో రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా, వాస్తవానికి మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా పేదలు ఈ వ్యసనానికి క్రమంగా దూరమవుతున్నారు. ఇది నూరు శాతం నిజం.

తగ్గిన మద్యం వినియోగం... కేంద్ర సర్వేనే వెల్లడించిన వాస్తవం: రాష్ట్రంలో మద్య వినియోగం గణనీయంగా తగ్గిందని కేంద్ర ప్రభుత్వ నివేదికే వెల్లడించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ప్రకారం 2015–16లో రాష్ట్రంలో పురుషుల్లో 34.9 శాతం, మహిళల్లో 0.4 శాతం మద్యం సేవించేవారు. 2019–21 నాటికి రాష్ట్రంలో మద్యం సేవించే పురుషులు 31.2 శాతానికి, మహిళలు 0.2 శాతానికి తగ్గారు. ఇది మద్య నియంత్రణ విధానాల వల్ల కాదా పురందేశ్వరి గారూ?

డిస్టిలరీలన్నీ మీ చంద్రబాబు అనుమతిచ్చినవే

చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కల్పించాలనే ఆతృతతో పురందేశ్వరి వాస్తవాలను విస్మరించారు. వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన కంపెనీలకే మద్యం తయారీ కాంట్రాక్టులు అప్పగించి దోపిడీకి పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. కానీ వాస్తవం ఏమిటంటే.. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క మద్యం డిస్టిలరీకి కూడా అనుమతివ్వలేదు. రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉంటే వాటిలో 12 డిస్టిలరీలకు చంద్రబాబే అనుమతిచ్చారు. మిగిలిన 6 అంతకు ముందటి ప్రభుత్వాలు అనుమతిచ్చినవి. ప్రస్తుతం చంద్రబాబు సన్నిహితుల కంపెనీలే మద్యాన్ని తయారు చేస్తున్నాయి. గతంలో తయారు చేస్తున్న మద్యాన్నే ఇప్పుడూ తయారు చేస్తున్నాయి. మరి ఎందుకీ దుష్ప్రచారం?



సీబీఐతో దర్యాప్తు జరిపించండి

- ఎంకే డిస్టిలరీ టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేశ్‌కుమార్‌ది. ఆయన టీడీపీ నేత పుట్టా మధుసూదన్ యాదవ్‌కు కుమారుడు కూడా.
- శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ టీడీపీ మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవుల నాయుడు కుటుంబానిది.
- ఎస్పీవై ఆగ్రో ప్రొడక్ట్స్ టీడీపీ నేత, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుటుంబానిది. వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా గెలిచి నిబంధనలకు విరుద్ధంగా టీడీపీలో చేరినందుకు నజరానాగా ఎస్పీవై రెడ్డికి చంద్రబాబు అనుమతిచ్చారు.
- ఇక బాబు ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు ఆగమేఘాల మీద 2019 ఫిబ్రవరి 25న అనుమతినిచ్చిన విశాఖ డిస్టిలరీస్‌లో టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు వాటాదారు.

మద్యం నాణ్యతపైనా దుష్ప్రచారమే

పురందేశ్వరి కుట్రపూరితంగా చేసిన మరో దుష్ప్రచారం.. మద్యంలో నాణ్యత లేదని. గతంలో తెలుగుదేశం పార్టీ కూడా ఇలాంటి విషపు ఆరోపణే చేసి భంగపడింది. విషపు అవశేషాలు ఉన్నాయని చెన్నైలోని ఎస్‌జీఎస్ లేబొరేటరీ పేరిట ఓ నకిలీ నివేదికను టీడీపీ తెరపైకి తెచ్చి అభాసుపాలైంది. కానీ, అదే నివేదికను ఉటంకిస్తూ పురందేశ్వరి అవే అసత్య ఆరోపణలు ఇప్పుడూ చేయడం విచిత్రమే. చెన్నైలోని ఎస్‌జీఎస్ లేబొరేటరీ అసలు తాము అలాంటి నివేదికే ఇవ్వలేదని అప్పట్లోనే స్పష్టం చేసింది. తాము పరీక్షించిన మద్యం నమూనాల్లో అవశేషాలు పరిమితికి లోబడే ఉన్నాయని, అవి ప్రమాదకరం కాని సహజసిద్ధమైన మొక్కల నుంచి తయారైనవేనని స్పష్టం చేసింది. తమ నివేదికను తప్పుగా అన్వయించారని చెప్పింది. అయినా సరే రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ రాష్ట్రంలో మద్యం నమూనాలను హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ప్రయోగశాలలో పరీక్షించింది. ఆ నమూనాలన్నీ నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే ఉన్నాయని ఆ లేబొరేటరీ నివేదిక ఇచ్చింది. మద్యం నాణ్యతపై ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పింది. పురందేశ్వరి ఆరోపణలు చేసే ముందు ఈ వాస్తవాలను కావాలనే విస్మరించారు.

డిజిటల్ చెల్లింపులూ జరుగుతున్నాయి

రాష్ట్రంలో 80 శాతం మద్యం అమ్మకాలు నగదు లావాదేవీల ద్వారానే నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని పురందేశ్వరి మరో అబద్ధాన్ని రాసేశారు. వాస్తవానికి రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నగదు అమ్మకాలే కాదు డిజిటల్ చెల్లింపుల విధానాన్నీ బెవరేజెస్ కార్పొరేషన్ అమలు చేస్తోంది. రోజువారీ వేతనాలు తీసుకునే కూలీలు నగదు ద్వారానే కొంటున్నారు కనక ఆ విధానాన్నీ కొనసాగిస్తోంది. మద్యం విక్రయాల మొత్తాన్ని ఏ రోజుకా రోజు సమీపంలోని ఎస్‌బీఐ శాఖలో జమ చేసి చలానాలు అందజేస్తోంది. మద్యం నిల్వలు, విక్రయాలు, బ్యాంకుల్లో జమ చేసిన మొత్తం అన్నింటిపై బెవరేజెస్ కార్పొరేషన్ పకడ్బందీగా రికార్డులు నిర్వహిస్తోంది.

ఇవి కాకిలెక్కలు కాదా?

- రాష్ట్రంలో రోజూ 80 లక్షల మంది ఒకొక్కరూ సగటున రూ.200 విలువైన మద్యాన్ని సేవిస్తున్నారని పురందేశ్వరి కాకి లెక్కలు వల్లించడం మరో విడ్డూరం. ఆ విధంగా మద్యం అమ్మకాల మొత్తం రూ.57,600 కోట్లలో రూ.25 వేల కోట్లు అక్రమంగా మళ్లిస్తున్నారని నోటికొచ్చింది కూసేశారు. కేంద్ర జాతీయ కుటుంబ ఆరోగ్య నివేదిక(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ప్రకారం 2019–21లో రాష్ట్రంలో 18.7 శాతం మంది అంటే దాదాపు 40 లక్షల మంది మాత్రమే మద్యం సేవిస్తున్నారు. మరి 80 లక్షల మంది అంటూ అంత అబద్ధాన్ని ఎలా చెప్పగలిగారో పురందేశ్వరికే తెలియాలి!!.
- లంచాలిచ్చే కంపెనీల నుంచే మద్యం కొంటున్నారని పురందేశ్వరి ఆరోపించారు. కానీ రాష్ట్రంలో 2015లో ఇచ్చిన నోటిఫికేషన్‌ను అనుసరించే ప్రస్తుతం బెవరేజస్ కార్పొరేషన్ మద్యం కొంటోంది. 2019 తరువాత ఆ విధానంలో ఎలాంటి మార్పూ లేదు. కాంపిటేటివ్ కమిషన్ ఆఫ్ ఇండియా కూడా రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా, నిబంధనల మేరకే ఉన్నాయని నివేదిక ఇచ్చింది.
- రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై స్పెషల్ డ్యూటీ (పన్ను) వసూలు చేస్తున్నారని, ఆ మొత్తం ఎక్కడికి వెళ్తోందో తెలియడంలేదని పురందేశ్వరి మరో దరిద్రమైన ఆరోపణ చేశారు. ఏదైనా ప్రభుత్వ ఖజానాకు వెళ్లేదే కదా!. వాస్తవానికి అది స్పెషల్ డ్యూటీ (పన్ను) కాదు. అది స్పెషల్ మార్జిన్. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ పథకాలు కోసం ప్రభుత్వం 2021 నవంబరు 9న ప్రత్యేక జీవో జారీ చేసి ఆ స్పెషల్ మార్జిన్ వసూలు చేస్తోంది. ఆ నిధుల్ని సంక్షేమ పథకాల కోసం వెచ్చిస్తోంది.
- రాష్ట్రంలో రెండేళ్లలో కాలేయ సంబంధ వ్యాధులతో మృతి చెందిన వారు 25 శాతం పెరిగారనటం మరో దుర్మార్గం. విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో గత పదేళ్లలో నెలకు సగటున 20 మంది మాత్రమే కాలేయ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రిలో చేరారు. వారిలో కూడా 95 శాతం మంది పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ నివేదిక కూడా ఇచ్చారు. కాకపోతే మరిది కోసం... బాబు కోసం కష్టపడుతున్న పురందేశ్వరికి ఈ వాస్తవాలతో పనేముంటుంది!?

భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలు సగానికి పడిపోయాయి. ఆ వివరాలు చూస్తే...



టీడీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాలు .. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం)	బీరు విక్రయాలు
2017-18	3.60 కోట్లు	2.27 కోట్లు
2018-19	3.84 కోట్లు	2.77 కోట్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాలు... (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.87 కోట్లు	50 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.63 కోట్లు	28 శాతం	82 లక్షల కేసులు	70 శాతం
2022-23	3.35 కోట్లు	13 శాతం	1.16కోట్లు	58శాతం
2023	1.45 కోట్లు	54 లక్షలు		

(ఏప్రిల్ నుంచి ఆగస్టు)

నిరాశ్రయులను ఆదుకోవాలి!

'నిరాశ్రయులు కూడా ఈ దేశ పౌరులే. వారికి సాధారణ పౌరులకు కల్పించే అన్ని సౌకర్యాలు, రాయితీలు చట్టపరంగా అందాల్సినవి అన్నీ అందించాల'ని సుప్రీంకోర్టు ఓ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఇందుకు కారణం వారిని ప్రభుత్వాలు అంతగా పట్టించుకోకపోవడమే. భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం నిరాశ్రయులు 20 లక్షల మంది. కానీ కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో వివిధ కారణాల వల్ల కోట్లాది మంది నిరాశ్రయులు అయ్యారు. సరైన నివాస సౌకర్యం లేని వారు 5 కోట్ల మంది ఉండగా మిగిలిన వారు బ్రతుకుతెరువు కోసం నిరాశ్రయులుగా ఏదో పంచన ఉంటున్నారు. వీరిలో వలస కూలీలు, మానసిక వైకల్యం కలవారు, వికలాంగులు, వయోవృద్ధులు, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికి గురైన వారు ఉన్నారు. వీధిబాలలు, భిక్షాటన చేసుకునేవారు, గ్రామాల నుండి ఉపాధి, ఉద్యోగాల కోసం పట్టణాలకు వచ్చిన వారు కూడా నిరాశ్రయులు గానే జీవిస్తున్నారు.

2013లో సర్వోన్నత న్యాయస్థానం భారత ప్రభుత్వం ద్వారా రాష్ట్రాల్లోని నిరాశ్రయుల కోసం వసతి గృహాలు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. పట్టణ నిరాశ్రయుల కేంద్రం 'జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్' కింద నిర్వహించాలని సూచించింది. అదే సంవత్సరం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి 'కైలాస్ గంభీర్ కమిటీ' పలు రాష్ట్రాలలో పర్యటించి నిరాశ్రయుల స్థితిగతులపై సుప్రీంకోర్టుకు ఒక నివేదికను సమర్పించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని అన్ని ప్రధాన నగరాలలోనూ నిరాశ్రయుల కోసం వసతి కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి వసతి, భోజనం, సంరక్షణ బాధ్యతలు చూడాలని చెప్పింది. నిరాశ్రయుల కోసం ప్రతీ లక్ష మంది జనాభా ఉన్నచోట ఒక నైట్ షెల్టర్ ప్రారంభించాలి. వారి జీవనోపాధి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ప్రారంభించాలి. మహిళలకు, దివ్యాంగులకు, మానసిక విధి వంచితులకు, యాచకులకు వేరువేరుగా నైట్ షెల్టర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పట్టణ జీవనోపాధుల పథకం ద్వారా అప్పులు ఇచ్చి, వ్యాపారాలు ప్రారంభించేలా చేసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే ఏర్పాటు చేయాలి.

– డా॥ గుబ్బల రాంబాబు,
ఉభయ గోదావరి జిల్లాల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు
(నేడు ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం)

వ్యాక్సిన్‌ల సామర్థ్యం తెలిసేదెలా?!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"ఎప్పటికప్పుడు కొత్త వ్యాక్సిన్‌ల సృష్టి జరుగుతున్న సందర్భంగా సదరు వ్యాక్సిన్‌లు సరిగ్గా పని చేసేవా, లేదా అని తెల్సుకోవాలంటే – ముందు ఆ వ్యాక్సిన్‌లను రాజకీయ పాలకులపై ప్రయోగించి చూడాలి. ఎందుకంటే, తీసుకున్న వ్యాక్సిన్ వల్ల ఆ పాలకులు బతికి బట్టకడితే ఆ వ్యాక్సిన్ మంచిదని నిర్ధారణ చేసుకోవచ్చు. కానీ ఆ పాలకులు ఆ వ్యాక్సిన్ వల్ల స్వర్గస్థులయితే, దేశం సుఖంగా ఉన్నట్టు భావించాలి."
– ప్రసిద్ధ పోలిష్ తాత్వికులు మోనికా విర్నివా స్కా

ఈ బండ 'జోకు' వినడానికి కటువుగా ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ గత పదేళ్లకు పైగా ప్రజా బాహుళ్యం ఆరోగ్య భాగ్యం కన్నా, వ్యాపార లాభాల కోసం పెక్కు ప్రయివేట్ కంపెనీలు వ్యాక్సిన్ల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వస్తున్నాయి. అవి సృష్టించే వ్యాక్సిన్‌లు ప్రముఖ శాస్త్రవేత్తల కొలమానాలకు అందకపోయినా, తిరస్కరిస్తున్నా మార్కెట్‌లోకి పాలక వర్గాల అండతో విడుదలవుతూండటం చూస్తున్నాం.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యథేచ్ఛగా సాగిన ఈ కుంభకోణాన్ని భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎండకట్టి అనుక్షణం, ఈ రోజు దాకా ప్రశ్నిస్తూ వస్తున్న ప్రసిద్ధ భారత కరోనా శాస్త్రవేత్త, పరిశోధకురాలు గగన్‌దీప్ కాంగ్! వైరస్‌ల స్థాయి ఎంత తీవ్రమైనదంటే – భవిష్యత్తులో సోకగల ప్రమాదాలను కూడా ముందుగానే ఊహించి రోగ నిర్ణయానికి అవసరమైన ప్రయివేట్ స్థాయి అవకాశాలను కూడా గణించి, ప్రయివేట్ కంపెనీలను షరతులతో అదుపులో ఉంచుతూ రంగంలోకి దించాలని ఆమె పదేపదే ముందస్తుగానే సూచిస్తూ వచ్చారు. ఈ రోజు కాకపోతే రేపు అయినా పాలకులు అను మతించిన ప్రయివేట్ కంపెనీలను అదుపాజ్ఞల మధ్య వాడుకోవలసి ఉంటుందన్నారు. ప్రపంచ క్లినీషియన్ శాస్త్రవేత్తలలో భారతదేశ ఉద్దండురాలుగా ఆమెను గుర్తిస్తూ లండన్ రాయల్ సొసైటీ 'ఫెలోషిప్' ఇచ్చి గౌరవించింది. రాయవెల్లూరు మెడికల్ కాలేజీలో వైద్య శాస్త్ర పరిశోధనా కేంద్రంలో పిల్లల్లో ప్రబలుతున్న వైరల్ వ్యాధులపై ఎనలేని పరిశోధన చేశారు. అంతేకాదు, పిల్లలకు సంబంధించి పటిష్ఠమైన ఆరోగ్య జాగ్రత్తలను ప్రాథమిక దశ నుంచే తీసుకోవడం వల్ల ఉత్తరోత్తరా వాళ్లను ఆస్పత్రుల చుట్టూ తిప్పే అవసరం ఉండదనీ, ఆ జాగ్రత్త తీసుకోకపోవడం వల్లనే కనీసం వంద దేశాల్లో లక్షలాది చిన్నారులు దారుణ పరిస్థితుల్లో చనిపోవలసి వచ్చిందనీ గగన్‌దీప్ కాంగ్ ఆందోళన వెలిబుచ్చారు. మానవాభ్యున్నతి గణింపులో గత పదిహేనేళ్లలో భారత అభివృద్ధి సూచీ 3 స్థానాలు దిగజారి పోయింది. ఈ గణింపులో చిన్నారుల మరణ శాతం కూడా పరిగణనలోకి తీసుకుంటారనేది మరువరాదు.

రెండో మాట



ప్రజల జీవన ప్రమాణాలను పెంచవలసిన పాలకులు ఎప్పటికప్పుడు అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజాస్వామ్య, లౌకిక వాద సిద్ధాంతాలను తుంగలో తొక్కుతున్నారు. మత రాజకీయాలను పెంచి పోషిస్తూ 'హిందూ జాతీయవాదాన్ని' రేకెత్తించి నియంతృత్వ పాలనను స్థాపించడానికి కావలసిన వాతావరణాన్ని సృష్టించుకొంటున్నారు. దీన్ని ఊహించే భారత రాజ్యాంగ నిర్మాత 'భారత రాజ్యాంగంలో ఆచరణకు పొందుపరచిన ప్రజాస్వామ్య సూత్రాలను ఇతరులు ప్రజాస్వామ్య విరుద్ధంగా మార్చేసే ప్రమాదం లేకపోలేదు, నియంతృత్వాన్ని ప్రవేశపెట్టే ప్రమాదమూ లేకపోలేదు' అని హెచ్చరించారు.

దక్షిణాసియాలో ముఖ్యంగా భారతదేశంలో హిందూ మత రాజకీయాల వల్ల అన్య మతస్థులకు స్థానముండదనీ, ప్రజాస్వామ్య లక్ష్యాలతో పొందుపరిచిన భారత సెక్యులర్ వ్యవస్థను అపహాస్యం చేస్తూ గాంధీజీ హంతకుడు గాడ్సే కాలం నాటి పరిస్థితులను 'సెక్యులరిజం' పేరు చాటున తాము కూడా పాలనలో కొనసాగించ దలచినట్లు 'బీజేపీ – ఆరెస్సెస్' నాయకుల ప్రస్తుత ధోరణులు కనిపిస్తున్నాయనీ 'వర్జీనియా యూనివర్సిటీ' భారతీయ ప్రొఫెసర్ నీతీ నాయర్ 'గాయపడ్డ మనస్సులు' (2021) గ్రంథంలో పేర్కొన్నారు. ప్రత్యేక 'హిందూ రాష్ట్రం' సెగ ఒక మతాన్ని కాదు – ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, దళితులు, బౌద్ధులు అందర్నీ చుట్టుముడుతుందనీ, అందుకని, మన భారత ప్రజలు ప్రత్యేక 'హిందూ రాష్ట్ర ప్రతిపత్తి'కీ లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అక్షర సత్యంగా పొందుపరిచిన 'సమగ్ర భారతదేశ' భావనకూ మధ్య వాస్తవాన్ని విధిగా ప్రేమించాలని ప్రొఫెసర్ నీతీ నాయర్ ఆ గ్రంథంలో పేర్కొన్నారు. ఇటీవల 'మహిళా రిజర్వేషన్ల' సమస్యపై బీజేపీ పాలకులు నడిపిన తంతుపై సుప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు మంజుల్ వేసిన పాకెట్ కార్టూన్ (23.9.2023) వీరి రాజకీయాలను పట్టిస్తుంది.

'మీ మహిళా రిజర్వేషన్ల కోటా 2039లో వస్తుంది. అయితే దాన్ని పెద్దగా ఆలస్యమైనట్టు మీరు భావించకండి. 2024లోనే మీ కోటాను మీకు కాగితం మీద కల్పిస్తాం. కానీ ఈలోగా, అంటే 2024లోనే మీ ఓటును మాకు ముందస్తు క్రెడిట్‌గా వేయండి' అని ప్రధాని ముక్తాయించడం అసలు 'చరుపు'! కానీ, ఆ 2039 నాటికి ఎవరుంటారో, ఎవరు ఊడతారో మాత్రం తెలియకపోవడం అసలు 'మర్మం'!

అందుకే అన్నాడేమో వేమన:
"కులము గలుగువారు, గోత్రంబు గలవారు
విద్య చేత విర్రవీగు వారు,
పసిడి గల్గు వాని బానిస కొడుకులు!"

abkprasad2006@yahoo.co.in

జగనన్న ఆరోగ్య సురక్ష


చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం చార్వా కానిపల్లి గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


శ్రీసత్యసాయి జిల్లా అమరాపురంలోని శిబిరంలో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు


అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం నవాబుకోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన గ్రామస్తులు


పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరం సురక్ష శిబిరంలో గుండె వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం తారాపురంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది


విశాఖ జిల్లా భీమిలి మండలం శింగనబంధలో వైద్య సేవలు అందిస్తున్న సాధారణ, స్పెషలిస్ట్ వైద్యులు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణారెడ్డి పాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో స్థానికులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ఆవులమందలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుయ్యేరులో స్థానికులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది


కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కలవపాములలో వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేశ్వరి


పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్లలో ఏర్పాటు చేసిన శిబిరంలో వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది


కర్నూలు నగరంలోని ఎ.క్యాంప్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రక్త పోటుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ ప్రాణాలు కాపాడిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- రైల్లో గుండెనొప్పితో బాధపడిన ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్
- సింగరాయకొండలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు తరలింపు
- ప్రథమ చికిత్స చేసి.. ఒంగోలు రిమ్స్‌కు తరలింపు
- సమయానికి రావడం వల్లే ప్రాణాలు దక్కాయన్న రిమ్స్ వైద్యులు
- క్యాంపులో పలువురికి గుండె జబ్బులున్నట్టు గుర్తింపు


ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ నందకిషోర్


గుండె జబ్బు నిర్ధారణ కాకముందు అధికారులతో జయలక్ష్మీదేవి(మధ్యలో జగనన్న కార్డుతో)

సింగరాయకొండ/ఆత్మకూరు రూరల్(నంద్యాల) : జగనన్న సురక్ష క్యాంపులు ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి. ఇటీవల ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ప్రాణాలు కాపాడగా, తాజాగా ఓ మహిళ గుండె జబ్బుతో బాధపడుతున్నట్టు గుర్తించి ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వైకే నందకిషోర్ రోజూ నెల్లూరు నుంచి ఒంగోలుకు ఉద్యోగం నిమిత్తం వస్తుంటారు. ఈ నెల 5న రైల్లో వస్తుండగా కావలి దాటగానే స్వల్పంగా గుండెనొప్పి వచ్చింది. మొదట గ్యాస్ సమస్య అని మందులు వేసుకున్నా.. నొప్పి తగ్గకపోవడంతో వెంటనే తనకు రైల్లో పరిచయం ఉన్న సింగరాయకొండ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఉజ్వలకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. ఆ సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఉజ్వల.. సింగరాయకొండ గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం మెడికల్ క్యాంపు జరుగుతోందని, కార్డియాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు క్యాంపులో ఉన్నారని.. సింగరాయకొండలో దిగాలంటూ స్టేషన్‌కు 108ను పంపించి సురక్ష క్యాంపునకు తీసుకొచ్చారు. అనంతరం డాక్టర్ ఉజ్వల, డాక్టర్ వంశీధర్‌లు ఆయనకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి.. రిపోర్టును పరిశీలించిన డాక్టర్ వెంకటేశ్వరరావు.. రిజిస్ట్రార్‌కు గుండె నొప్పి వచ్చిందని నిర్ధారించి వెంటనే ప్రథమ చికిత్స చేయించి తర్వాత ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కిమ్స్‌లోని డాక్టర్లు రిజిస్ట్రార్ నందకిషోర్‌కు యాంజియోగ్రామ్ పరీక్ష చేసి రెండు వాల్వ్‌స్ దెబ్బతిన్నాయని గుర్తించి.. వెంటనే స్టంట్ వేసి చికిత్స చేశారు. సకాలంలో అక్కడకు రావడంతో ఆయన ప్రాణాలు దక్కాయని కిమ్స్ డాక్టర్లు కుటుంబ సభ్యులకు చెప్పారు. సరైన సమయంలో చికిత్స అందించి తన భర్త ప్రాణాలు కాపాడారని అతని భార్య విజయలక్ష్మి.. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ఉన్న వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ సోమవారం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో 35 మందికి ఈసీజీ పరీక్షలు చేయగా వారిలో ముగ్గురికి గుండె సమస్యలున్నట్టు తేలిందని చెప్పారు.

ఓ మహిళను కాపాడిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఇదిలా ఉండగా, నంద్యాల జిల్లా ఆత్మకూరు శ్రీపతిరావుపేటలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ మహిళను కాపాడింది. జయలక్ష్మీదేవి కొద్దిగా ఆయాసం ఉందంటూ గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరానికి వచ్చింది. వైద్యులు ఆమెకు గుండె పరీక్షలు చేసి గుండె సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. అప్పటికప్పుడు ప్రాథమిక వైద్యం చేసి హుటాహుటిన అక్కడే ఉన్న అంబులెన్స్‌లో కర్నూలు జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

యూరప్‌లో శ్రీవారి కల్యాణం.. కమనీయం

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో యూరప్‌లోని ప్యారిస్ (ఫ్రాన్స్), డబ్లిన్ (ఐర్లాండ్) నగరాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అక్టోబర్ 7న ప్యారిస్‌లో, 8న డబ్లిన్‌లో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ మలయప్ప స్వామి వారు ఎన్నారై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక తెలుగు, భారతీయ ధార్మిక సంస్థల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి ఆయా నగరాల కార్యనిర్వాహక వర్గాలను సమన్వయం చేస్తూ కల్యాణం సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశారు. టీటీడీ నుంచి వెళ్లిన అర్చకులు, వేదపండితులు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణోత్సవాలను వైభవంగా జరిపించారు. ఈ కల్యాణోత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించడానికి తెలుగు వారే కాక, తమిళనాడు, కేరళ, కర్నాటక, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు హాజరైనట్టు వెంకట్ మేడపాటి తెలిపారు. ఆయా ప్రాంగణాలు గోవింద నామస్మరణతో మారుమోగాయని, హాజరైన భక్తులందరికి తిరుమల నుంచి తెప్పించిన స్వామివారి లడ్డూలను ప్రసాదంగా అందించామని చెప్పారు. యూరప్‌లోని మరో రెండు నగరాల్లో 14, 15 తేదీల్లో శ్రీవారి కల్యాణాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.


కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


భారీగా హాజరైన ఎన్నారై భక్తులు

స్వగ్రామానికి తెలుగు విద్యార్థి మృతదేహం

- కొలంబియాలో అనుమానాస్పద స్థితిలో మృతి
- ప్రభుత్వం చొరవతో స్వగ్రామానికి భౌతికకాయం
- కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు


జి.కొండూరు చేరిన సుధీర్‌కుమార్ మృతదేహం (ఇన్‌సెట్‌లో) బేతపూడి సుధీర్‌కుమార్(ఫైల్)

జి.కొండూరు: కొలంబియాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన తెలుగు విద్యార్థి బేతపూడి సుధీర్‌కుమార్ మృతదేహం స్వగ్రామమైన ఎన్‌టీఆర్ జిల్లా, జి.కొండూరుకు సోమవారం ఉదయం చేరింది. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ కృషి, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో బాధిత తల్లిదండ్రులకు కుమారుడి చివరిచూపు దక్కింది. జి.కొండూరుకు చెందిన బేతపూడి దేవదాసు కుమారుడు సుధీర్‌కుమార్ అలియాస్ జోషీ (34) ఎంఎస్ చదివేందుకు 2018లో స్పెయిన్ వెళ్లాడు. అనేక కారణాలతో ఎంఎస్ పూర్తి చేయలేకపోయాడు. అక్కడే ఉంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ చదువు కొనసాగిస్తున్నాడు. గతనెల 15వ తేదీన తన స్నేహితురాలైన తోటి విద్యార్థి జెస్సికా జన్మదిన వేడుకల నిమిత్తం కొలంబియా వెళ్లాడు. 19వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు బేతపూడి కేథరీన్, దేవదాసు తమ కుమారుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తమ కుమారుడి ఆఖరి చూపు కల్పించాలని వారు అభ్యర్థించారు. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీ) ద్వారా కొలంబియాలోని ఇండియన్ ఎంబసీతో సంప్రదింపులు జరిపి, జి.కొండూరు తరలించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. బంధువులు, కుటుంబ సభ్యుల చివరిచూపు అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. తమ కుమారుడి చివరిచూపును కల్పించిన ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి తామెప్పుడూ రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

15 నుంచి శ్రీశారదాపీఠంలో శరన్నవరాత్రులు


అమ్మవారికి హారతి ఇస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠంలో ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీశారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతీరోజు ఉదయం అమ్మవారి నిజరూపానికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా విశేషంగా అభిషేకం ఉంటుంది. సాయంత్రం శ్రీ శారదా స్వరూప రాజశ్యామల, చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన జరుగుతుంది. తదుపరి సాంస్కృతిక ఆరాధన నిర్వహిస్తారు. శరన్నవరాత్రుల్లో ప్రతీ రోజూ ఒక్కో అవతారంలో రాజశ్యామల అమ్మవారు దర్శనం ఉంటుంది. బాలత్రిపుర సుందరీదేవి, మహేశ్వరి, వైష్ణవి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, సరస్వతిదేవి, మహాలక్ష్మి, మహాకాళి, మహిషాసురమర్దిని, విజయదశమి రోజు విజయదుర్గాదేవి అవతారాల్లో అమ్మవారు దర్శనమిస్తారు. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్ల చేతులమీదుగా అమ్మవారికి అలంకరణలు చేస్తారు. 20వ తేదీన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీ పూజ, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు.

శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మహర్దశ

- ప్రసాద్ పథకం పరిధిలోకి తెస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ
- ఇక ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు

నెల్లూరు(దర్గామిట్ట): భారతదేశం అంతటా పుణ్యక్షేత్రాలను అభివృద్ధి పరచి, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని వృద్ధి చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 2014–15లో ప్రారంభించిన ప్రసాద్ పథకం పరిధిలోకి నెల్లూరులోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తీసుకొస్తున్నట్లు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చొరవ తీసుకుని గతంలో ప్రసాద్ పథకం కింద ఈ ఆలయాన్ని పరిశీలించాలని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు సూచన చేశారు. ఫలితంగా గతంలో పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆలయాన్ని దర్శించి వెళ్లారు. అనంతరం నరసింహకొండను ప్రసాద్ పథకం పరిధిలో చేరుస్తున్నట్లు సోమవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ప్రక్రియలో చొరవ తీసుకున్న వారందరికి అభినందనలు తెలిపారు. ఈ పథకం పరిధిలోకి రావడం ద్వారా ఆలయం అభివృద్ధికి కావాల్సిన నిధులను భారత ప్రభుత్వం విడుదల చేస్తుంది. ముందుగా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం అందజేయాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక శోభతో భాసిల్లుతున్న ఆలయానికి ఈ పథకం ద్వారా పర్యాటకంగానూ మెరుగులు దిద్దనున్నారు. ఫలితంగా నెల్లూరు ఆధ్యాత్మిక సిగలో మరో ధార్మిక పుష్పం వికసించనుంది.

నవులూరు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం రెడీ

- ఈ నెల 12న వినూ మన్కడ్ ట్రోఫీ ప్రారంభం
- ఈ ఏడాది డిసెంబర్‌లో విజయ్ మర్చంట్ ట్రోఫీ నిర్వహణ
- ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు
- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు


నవులూరు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

మంగళగిరి: గుంటూరు జిల్లా నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మ్యాచ్‌లకు రెడీ అయ్యింది. మూడేళ్ల కిందట నిర్మాణం పూర్తి చేసుకున్నా నిధుల కొరతతో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు తదితర తుది దశ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం బీసీసీఐ నుంచి నిధులు విడుదల కావడంతో తొలి విడతగా రూ.15 కోట్లతో స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు వేగంగా పూర్తి చేయించి త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అడుగులు వేస్తోంది. ఈలోపు ఈ సీజన్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు ట్రోఫీల నిర్వహణకు బీసీసీఐ అనుమతులు ఇవ్వగా, మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని రకాల వసతులు కల్పించారు. ఈ నెల 12 నుంచి పురుషుల అండర్-19 వినూ మన్కడ్ ట్రోఫీ జరుగనుంది. ఇక్కడ 15 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, ఉత్తరాఖండ్, మేఘాలయ జట్లు తలపడనున్నాయి. అలాగే ఈ ఏడాది డిసెంబర్‌లో విజయ్ మర్చంట్ ట్రోఫీ నిర్వహించనున్నారు. 15 మ్యాచ్‌ల ఈ ట్రోఫీలో ఢిల్లీ, మహారాష్ట్ర, జమ్ము కశ్మీర్, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్లు తలపడనున్నాయి. అలాగే 2024 జనవరి, ఫిబ్రవరి నెలల్లో మహిళల అండర్-23 వన్ డే ట్రోఫీ కోసం 21 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. హైదరాబాద్, ఉత్తరాఖండ్, బరోడా, విదర్భ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి జట్లు తలపడనున్నాయి. మూడు ట్రోఫీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి అనంతరం అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణకు ఏసీఏ సన్నాహాలు చేస్తోంది.

త్వరలో అంతర్జాతీయ మ్యాచ్



త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ నెల 12 నుంచి రానున్న ఆరు నెలల కాలంలో మూడు ట్రోఫీలకు సంబంధించిన 51 మ్యాచ్‌లు ఇక్కడ జరగనున్నాయి. త్వరలోనే బీసీసీఐ బృందం పర్యటించి అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణకు అవసరమైన సూచనలు చేసే అవకాశం ఉంది.

– ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి, ఏసీఏ కార్యదర్శి


గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల దాడి దృశ్యం


షాతీ శరణార్థి శిబిరం వద్ద ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన యాసిన్ మసీదు


గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్తున్న రాకెట్లు


ఇజ్రాయెల్ దాడిలో నేలమట్టమైన పాలస్తీనియన్ల రఫా శరణార్థి శిబిరం

గాజాపై నిప్పుల వర్షం

వైమానిక దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్

జెరూసలేం: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో నెత్తుటేర్లు పారుతున్నాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణ మూడు రోజులుగా కొనసాగుతూనే ఉంది. హమాస్ మిలిటెంట్ల పీచమణచడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం సోమవారం గాజాపై వైమానిక దాడులు ఉధృతం చేసింది. మిలిటెంట్ల చొరబాట్లను అడ్డుకోవడానికి సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు, డ్రోన్లను మోహరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. దక్షిణ గాజాలోని రఫాలో సోమవారం ఉదయం ఇజ్రాయెల్ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 19 మంది మృతిచెందారు. మరోవైపు దక్షిణ ఇజ్రాయెల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ జవాన్లపై కాల్పులకు దిగుతున్నారు. అడపాదడపా రాకెట్లు కూడా ప్రయోగిస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం తిప్పికొడుతోంది. గాజాలో వెయ్యికి పైగా టార్గెట్లపై దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. గాజాలో ఎక్కడ చూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. తాజా యుద్ధంలో మృతుల సంఖ్య 1,200 దాటింది. హమాస్ మిలిటెంట్ల దాడిలో ఇజ్రాయెల్‌లో 700 మందికిపైగా బలయ్యారు. ఇజ్రాయెల్ సైన్యం ఎదురుదాడిలో గాజాలో 500 మందికి పైగా మరణించారు. ఇరువైపులా వేలాది మంది క్షతగాత్రులుగా మారారు. ఇజ్రాయెల్‌లో 130 మందికిపైగా పౌరులను బందీలుగా పట్టుకున్నామని, వారంతా తమ అధీనంలో ఉన్నారని హమాస్ ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య కాల్పులు జరుగుతున్నాయి.

గాజా దిగ్బంధానికి ఆదేశాలు

గాజాలో హమాస్ ముష్కరులను, వారి ప్రభుత్వాన్ని తుదముట్టిస్తామని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. హమాస్‌ను ఇప్పటికే చాలావరకు బలహీనపర్చామని ఇజ్రాయెల్ అధికార వర్గాలు వెల్లడించాయి. గాజాను పూర్తిగా దిగ్బంధించాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ తమ


సరిహద్దు వద్ద మోహరించిన ఇజ్రాయెల్ యుద్ధట్యాంక్‌లు

సైన్యాన్ని ఆదేశించారు. గాజాకు విద్యుత్, ఆహారం, ఇంధనం సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లో 24 కాలనీలు ఉండగా, 15 కాలనీలను ఖాళీ చేయించారు. మిగిలినవాటిని 24 గంటల్లోగా ఖాళీ చేయిస్తామని ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. గాజాపై ఇప్పటిదాకా వైమానిక దాడులకే పరిమితం అయిన ఇజ్రాయెల్


దక్షిణ ఇజ్రాయెల్‌లో దగ్ధమవుతున్న కార్లు

ఇక భూ యుద్ధంపై దృష్టి పెట్టింది. నేరుగా భూమిపైనుంచే క్షిపణులు ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. యుద్ధం వల్ల గాజాలో 1,23,000 మంది నిరాశ్రయులయ్యారని, ఇళ్లు విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గాజా బయట తమ పోరాటం కొనసాగుతోందని, సోమవారం ఉదయం మరికొంతమంది ఇజ్రాయెల్ పౌరులను బంధించామని హమాస్ ప్రతినిధి అబ్దెల్–లతీఫ్ అల్–ఖనౌవా చెప్పారు. ఇజ్రాయెల్ చెరలో ఉన్న పాలస్తీనా ఖైదీలందరినీ విడిపించి, స్వేచ్ఛ ప్రసాదించడమే తక్షణ లక్ష్యమని ఉద్ఘాటించారు. హమాస్ చేతిలో ఉన్న బందీలను విడిపించడానికి సహకరించాలంటూ ఇజ్రాయెల్ కోరిందని ఈజిప్టు అధికారులు చెప్పారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం

మిత్రదేశం ఇజ్రాయెల్ కోసం అమెరికా రంగంలోకి దిగింది. సైనిక సాయం అందిస్తోంది. తూర్పు మధ్యధరా సముద్రానికి యుద్ధ నౌకలను పంపించింది. ఇంకా అదనపు సైనిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

260 మృతదేహాలు లభ్యం

దక్షిణ ఇజ్రాయెల్‌లో శనివారం సూపర్‌నోవా ఫెస్టివల్‌లో ఆనందంగా గడుపుతున్న జనంపై హమాస్ ముష్కరులు హఠాత్తుగా దాడి చేశారు. సైనిక దుస్తుల్లో వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 260కిపైగా మృతదేహాలను ఇజ్రాయెల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతం గాజాకు సమీపంలోనే ఉంది.

నా భార్యాబిడ్డలను అపహరించారు

యువకుడు యెనీ అషెర్ గాజా సరిహద్దుకు సమీపంలో ఇజ్రాయెల్‌లో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. హమాస్ మిలిటెంట్లు అతడి భార్య డోరన్, కుమార్తెలు రజ్(5), అవివ్(3)ను శనివారం అపహరించారు. ఎక్కడ దాచారో తెలియడం లేదు. వారి కోసం అషెర్ గుండెలవిసేలా రోదిస్తున్నాడు. వారిని కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

ఫోన్‌లో మాట్లాడుతుండగానే చంపేశారు

ఇలాన్ ట్రోయెన్ అమెరికాలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె డెబోరా మతియాస్, అల్లుడు స్కోమ్లీ మతియాస్, మనవడు ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. శనివారం ఆమె అమెరికాలో ఉన్న తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతుండగా హమాస్ తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో డెబోరా, స్కోమ్లీ దంపతులు బలయ్యారు. వారి 16 ఏళ్ల కుమారుడు గాయాలతో బయటపడ్డాడు.

హమాస్ దాడిలో కేరళ మహిళకు గాయాలు

ఇజ్రాయెల్ ఆయాగా పనిచేస్తున్న కేరళ మహిళ షీజా ఆనంద్ హమాస్ మిలిటెంట్ల దాడిలో గాయపడ్డారు. కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లా పయ్యావూర్‌కు చెందిన షీజా ఆనంద్ దక్షిణ ఇజ్రాయెల్‌లోని సముద్ర తీర నగరం అష్కెలాన్‌లో ఆయాలో పని చేస్తున్నారు. శనివారం హమాస్ మిలిటెంట్లు అష్కెలాన్‌పై రాకెట్లు ప్రయోగించంతో ఆమె గాయాలపాలయ్యారు. భారత్‌లో ఉన్న భర్త ఆనంద్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతుండగా ఈ ఘటన జరిగింది. ఇజ్రాయెల్‌లోని భారత



రాయబార కార్యాలయ అధికారులు షీజా ఆనంద్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఆదివారం మధ్యాహ్నం షీజా భారత్‌లోని తన తల్లితో మాట్లాడారు. 'అమ్మా.. ఐయామ్ ఓకే' అని చెప్పారు.

పట్టు సాధిస్తున్న ఇజ్రాయెల్

జెరూసలేం: హమాస్ మెరుపుదాడితో బిత్తరపోయిన ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడుతోంది. ఇప్పటిదాకా 800 పైచిలుకు ప్రాంతాలను నేలమట్టం చేసినట్టు ప్రకటించింది. ఈ క్రమంలో పలు ఇజ్రాయెలీ ప్రాంతాలను మిలిటెంట్ల చెర నుంచి సోమవారం విడిపించింది. అయితే దక్షిణాదిన పలుచోట్ల ఇంకా మిలిటెంట్లతో ఇజ్రాయెల్ సైన్యం హోరాహోరీ పోరాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పదుల కొద్దీ అదనపు దళాలను ఇజ్రాయెల్ రంగంలోకి దించుతోంది. ఇజ్రాయెల్‌కు అదనపు మద్దతు అందించాలన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాల నేపథ్యంలో ఆ దేశ విమాన వాహక యుద్ధ నౌకలు తదితరాలు తూర్పు మధ్యధరా సముద్రం వైపు తరలాయి. సమీప ప్రాంతాల యుద్ధ విమాన దళాలను కూడా అమెరికా హుటాహుటిన సమీకరిస్తోంది.

దాడి వెనక ఇరాన్!

ఇజ్రాయెల్‌పై దాడి వెనక ఇరాన్ హస్తం, ప్లానింగ్ ఉన్నట్టు హమాస్, హెజ్బొల్లా నేతలే స్వయంగా వెల్లడించారు. గాజా స్ట్రిప్‌లో 30 మందికి పైగా ఇజ్రాయెలీలను తాము బందీలుగా పట్టుకున్నట్టు ఇస్లామిక్ జిహాద్ సంస్థ చీఫ్ జైద్ అల్ నఖాలా చెప్పాడు.

ఖతర్ మధ్యవర్తిత్వం

దోహా: ఇజ్రాయెల్, హమాస్ మధ్య బందీల మార్పిడికి, వీలైతే పోరుకు తెర దించేందుకు ఖతర్ రంగంలోకి దిగింది. హమాస్ చెరపట్టిన మహిళలు, పిల్లలను విడిపించేందుకు ముందుకొచ్చింది. బదులుగా ఇజ్రాయెలీ జైళ్లలో బందీలుగా ఉన్న 36 మంది మహిళలు, పిల్లలను విడుదల చేయాలని ప్రతిపాదించింది. దీనిపై ఇప్పటికే హమాస్ తో మాట్లాడుతున్నట్టు ఖతర్ విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈ విషయంలో అమెరికా సాయం కూడా తీసుకుంటున్నట్టు చెప్పింది. ''చర్చల్లో పురోగతి ఉంది. పోరుకు తెర పడి శాంతి నెలకొనాలని, బందీలు విడుదల కావాలని మా ప్రయత్నం'' అని వివరించింది. ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి సంప్రదింపులూ జరగడం లేదని పేర్కొంది.

ఇజ్రాయెల్‌లో 9 మంది అమెరికన్ల మృతి

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిలో కనీసం 9 మంది అమెరికా పౌరులు మరణించారు. మరెందరో ఆచూకీ తెలియకుండా పోయారని అమెరికా విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో జాడ తెలియకుండా పోయిన 8 మంది ఫ్రాన్స్ దేశస్తులు కూడా హమాస్ మిలిటెంట్లకు చిక్కడమో, వారి చేతిలో మరణించడమో జరిగి ఉంటుందని చెబుతున్నారు. 10 మంది బ్రిటిష్ పౌరులు కూడా హమాస్ దాడుల్లో మరణించడమో, జాడ తెలియకుండా పోవడమో జరిగిందని చెబుతున్నారు.

జర్మనీ మహిళను నగ్నంగా ఊరేగించిన హమాస్

జెరూసలేం: ఇజ్రాయెల్‌పై మెరుపు దాడి సందర్భంగా బందీలుగా పట్టుకున్న వారిపై హమాస్ మిలిటెంట్ల అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. శని లౌక్ అనే జర్మనీ దేశస్తురాలిని శనివారం గాజా వీధుల్లో నగ్నంగా ఊరేగించి పైశాచికానందం పొందడం తెలిసిందే. ''శని క్రెడిట్ కార్డును గాజాలో పూర్తిగా వాడేశారు. తను కనీసం ప్రాణాలతోనైనా ఉందని ఆశపడుతున్నాం''అంటూ ఆమె తల్లి బావురుమంది. శనివారం ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతమైన కిబుట్జ్ సమీపంలో ఫెస్టివల్ ఆఫ్ పీస్ జరుగుతుండగా హమాస్ మిలిటెంట్లు మెరుపు దాడిచేసి పలువురిని బందీలుగా గాజాకు తరలించారు.

అఫ్గాన్ భూకంపం..2,400కు చేరిన మరణాలు

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లోని హెరాట్ ప్రావిన్స్‌లో శనివారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. మట్టిదిబ్బల్లా మారిన ఇళ్ల శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం స్థానికులు, సహాయక సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. సోమవారం మరికొన్ని మృతదేహాలు బయటపడటంతో మృతుల సంఖ్య 2,445కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, క్షతగాత్రుల సంఖ్య గతంలో ప్రకటించిన 9,240 కాదన్నారు. 2వేల మంది మాత్రమే గాయపడ్డారన్నారు. గాసహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. హెరాట్‌లోని ఏకైక ప్రధాన ఆస్పత్రి వెలుపల బాధితుల కోసం బెడ్లు ఏర్పాటు చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఇక్కడ ప్రస్తుతం 500 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. సోమవారం మరోసారి భూమి కంపించడంతో స్థానికులు భయాందోళనలకు గురై రోడ్లపైకి చేరుకున్నారు. అఫ్గాన్ ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి అబ్దుల్ బరాదర్ సోమవారం హెరాట్ ప్రావిన్స్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్ పరిణామాలపైనే ప్రపంచదేశాల దృష్టి కేంద్రీకృతం కావడంతో అఫ్గాన్‌లో భూకంపబాధితులకు సాయం నెమ్మదిగా అందుతోంది. దశాబ్దాలపాటు అంతర్యుద్ధంతో చితికిపోయిన అఫ్గానిస్తాన్ ప్రజలకు తాజాగా సంభవించిన భూకంపం మరింత కుంగదీసింది. అంతర్జాతీయ సమాజం స్పందించాలంటూ ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు పిలుపునిచ్చినప్పటికీ చైనా, పాకిస్తాన్ వంటి కొన్ని పొరుగుదేశాలు మాత్రమే అఫ్గాన్‌లకు సాయం అందించేందుకు ముందుకు వచ్చాయి. అఫ్గాన్ రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన 20 బృందాలు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సేవలందిస్తున్నాయి. నీడ కోల్పోయిన వారికోసం తాత్కాలిక క్యాంపులను ఏర్పాటు చేసింది.


నోబెల్ పొందిన సంతోషంలో ఫోన్‌లో మాట్లాడుతున్న క్లాడియా

క్లాడియాకు ఆర్థిక నోబెల్

- అమెరికా ఆర్థికవేత్తను వరించిన పురస్కారం
- శ్రామిక శక్తిలో లైంగిక అంతరాలపై లోతుగా పరిశోధనలు

స్టాక్‌హోం: అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం ఈ ఏడాది అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌ను వరించింది. నోబెల్ అవార్డులిచ్చే రాయల్ స్వీడిష్ అకాడెమీ సోమవారం ఈ మేరకు ప్రకటించింది. శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అవగాహనను మరింతగా పెంచే దిశగా చేసిన సమగ్ర అధ్యయనాలకు గాను ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు కమిటీ పేర్కొంది. ''గ్లాడిన్ పరిశోధన నేరుగా పరిష్కారాలు చూపించేది కాదు. ఎప్పట్నుంచో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు విధానకర్తలకు మెరుగైన మార్గాలు సూచిస్తుంది. అంతరాలకు కారణాలను పట్టిచూపుతుంది. అవి కాలానుగుణంగా ఎలా మారుతూ వస్తున్నాయో వివరిస్తుంది''అని వివరించింది. ''గడిచిన వందేళ్లలో సంపన్న దేశాల్లో మహిళల్లో సంపాదనపరులు మూడింతలైనా లైంగిక అంతరాలు అలాగే ఉన్నాయి. వీటి మూలాలు తదితరాలపై గోల్డిన్ పరిశోధనలు లోతైన వివరాలు అందించాయి''అని తెలిపింది.

లోతైన పరిశోధనలు: 77 ఏళ్ల గ్లాడిన్ గత 200 ఏళ్లలో కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితరాలపై లోతుగా పరిశోధనలు చేశారు. ఆర్థిక వృద్ధి ఎంతగా పెరుగుతున్నా మహిళల వేతనాలు పురుషుల స్థాయిలో ఎప్పుడూ పెరగలేదు. కొన్నేళ్లుగా చదువులో పురుషుల కంటే ముందుంటున్నా మహిళల విషయంలో ఈ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందంటారామె. ''నేనెప్పుడూ ఆశావాదినే. కానీ గణాంకాలు చూస్తుంటే నిర్వేదమే మిగులుతోంది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం విషయంలో 1990ల్లో ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉన్న అమెరికా ఇప్పుడు ఎక్కడికో దిగజారిపోయింది''అని చెప్పుకొచ్చారు. ''ఇళ్లలో జరిగేదే బయట శ్రామిక రంగంలోనూ జరుగుతుంది. మహిళలకు పనెక్కువ, ప్రతిఫలం తక్కువ''అని వివరించారు. ''అందుకే జీవిత భాగస్వాముల మధ్య సమానత్వ భావనను పెంచితే అంతిమంగా లైంగిక సమానత్వమూ పెరుగుతుంది''అంటూ ముక్తాయించారు. క్లాడియా 1946లో న్యూయార్క్‌లో పుట్టారు. షికాగో వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం హార్వర్డ్ వర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

కొసమెరుపు: శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అధ్యయనం చేసిన గ్లాడిన్, అర్థశాస్త్రంలో ఇప్పటిదాకా నోబెల్ అందుకున్న 93 మందిలో మూడో మహిళ కావడం విశేషం!

ఫైనల్‌కు ముందు..అగ్ని పరీక్ష

- మినీ సంగ్రామాన్ని తలపించనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు
- నాలుగు రాష్ట్రాల్లో కాషాయ దళానికి, కాంగ్రెస్‌కు హోరాహోరీ
- రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌ను దించేందుకు బీజేపీ ప్రయత్నాలు
- మధ్యప్రదేశ్‌లో చౌహాన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్ ఎత్తులు
- తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చేందుకు రెండు పార్టీల తహతహ

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామానికి ముందు సెమీస్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు అధికార కాషాయ దళానికి, విపక్ష కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారాయి. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో తన అధికార పీఠాన్ని సుస్థిర పరుచుకోవాలంటే ప్రస్తుత ఎన్నికల్లో మెజార్టీ రాష్ట్రాలను దక్కించుకునేలా బీజేపీ ఇప్పటికే కదనరంగంలోకి దిగింది. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాపాడుకుంటూనే మరో రెండు రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ కాలుదువ్వుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్తాన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార మార్పిడి జరుగుతుందని బీజేపీ నమ్మకంగా ఉంటే.. బీజేపీ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌ను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నమ్మకంగా ఉంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో రెండు పార్టీలు పట్టు నిలుపుకునేందుకు, మిజోరంలో నిర్ణయాత్మక శక్తిగా ఎదిగేందుకు పోరాడుతుండటంతో ఈ ఎన్నికలకు రసవత్తరంగా ఉండనున్నాయి.

పెద్ద రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో...

త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో పెద్దదైన మధ్యప్రదేశ్‌లో 230 స్థానాలకు గానూ 2018 ఎన్నికల్లో 114 స్థానాలను గెలుచుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, ముఖ్యమంత్రి పదవి ఆశించి భంగపడ్డ జ్యోతిరాదిత్య సింధియా 2020లో సొంత పార్టీలోని 21 మంది ఎమ్మెల్యేలతో కాషాయ కండువా కప్పుకోవడంతో అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చింది. దీనిపై ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్న కాంగ్రెస్ అక్కడ తిరిగి అధికారాన్ని కైవసం చేసుకునేందుకు చెమటోడ్చుతోంది. వరుసగా తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచిన కమల్‌నాథ్ ప్రస్తుతం పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను బలంగా వాడుతున్నారు. బీజేపీ కూడా కేంద్ర మంత్రులు, లోక్‌సభ ఎంపీలను అసెంబ్లీ బరిలో నిలిపింది. కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న డిసెంబర్ 2018 నుంచి మార్చి 2020 మినహా దాదాపు రెండు దశాబ్దాలుగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది.

రాజస్తాన్ కీలకం

రాజస్తాన్‌లో ఏ ప్రభుత్వమూ వరుసగా రెండోసారి ఎన్నికకాని చరిత్ర ఉంది. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు ప్రత్యర్థి పార్టీకి అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలో ఈసారి ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రంలోని ఇతర వెనుకబడిన తరగతుల ఓట్లే కీలకంగా ఉండటంతో వాటిపైనే ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. అదే సమయంలో, కాంగ్రెస్‌కు చెందిన సీఎం గెహ్లోట్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌ల మధ్య విరోధం నివురుగప్పిన నిప్పులా ఉంది. రాజస్తాన్‌లో కాషాయ జెండా రెపరెపలాడాలని చూస్తున్న బీజేపీ అక్కడ 'ఆపో్న రాజస్తాన్'పేరిట ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రధాని మోదీ నాలుగుసార్లు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరుమార్లు పర్యటించారు.

ఛత్తీస్‌గఢ్ ఎవరిదో?

పదిహేనేళ్ల పాలన తర్వాత 2018లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎలాగైనా ఛత్తీస్‌గఢ్‌ను తిరిగి నిలబెట్టుకునే కృతనిశ్చయంతో ఉండగా ఇక్కడ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. 90 స్థానాలున్న రాష్ట్రంలో 68 సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉన్న ఇమేజ్‌కు తోడు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తమను తిరిగి అధికారంలోకి తేవొచ్చని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తోంది. రాష్ట్రంలోని కీలక రంగాల్లో జరిగిన అవినీతి తమకు లాభిస్తుందని బీజేపీ భావిస్తోంది. ఇప్పటికే ప్రధాని మూడుసార్లు ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు. ఇటీవలి ఇండియా టుడే–సీవోటర్ ఒపీనియన్ పోల్‌లో 90 సీట్లలో 46 శాతం ఓట్లతో 51 సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందన్న అంచనాలు బీజేపీకి మింగుడుపడటం లేదు.

తెలంగాణలో త్రిముఖం..

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్, తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్‌ల మధ్య ప్రధాని పోటీ ఉందనుకుంటున్న 119 సీట్లున్న తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితులతో బీజేపీ సైతం పోటీలోకి వచ్చింది. త్రిముఖ పోటీ ఉండే అవకాశాలతో తాము అధికారంలోకి వస్తామని బీజేపీ నమ్ముతుంటే, అతిపెద్ద పార్టీగా తామే అవతరిస్తామన్న గట్టి నమ్మకంతో కాంగ్రెస్ ఉంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు, పార్టీకి ఉన్న ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు, ధర్మపురి అరవింద్‌లతో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను ఎన్నికల బరిలో నిలపనుంది. గడిచిన 15 రోజుల్లోనే రెండుసార్లు తెలంగాణలో మోదీ పర్యటించారు. కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందిన మాదిరే ఇక్కడా 6 గ్యారెంటీ కార్డు హామీలతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది.

మిజోరంలో స్థానిక పార్టీలదే హవా

క్రైస్తవులు మెజారిటీగా ఉన్న మిజోరంలో స్థానిక పార్టీలైన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) పార్టీలదే హవా నడుస్తోంది. 40 స్థానాలున్న మిజోరంలో ప్రస్తుతం అక్కడ ముఖ్యమంత్రి జోరమ్‌తంగా నేతృత్వంలోని ఎంఎన్ఎఫ్ ప్రభుత్వం 28 సీట్లతో అధికారంలో ఉండగా, జెడ్‌పీఎం 9 సీట్లు, కాంగ్రెస్ 5, బీజేపీ ఒక్క సీటు సాధించుకున్నాయి. రెండు పర్యాయాలకు ఒకమారు అధికారం మారే మిజోరంలో ఈ ఏడాది ఎంఎన్ఎఫ్‌దే విజయమని సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి. మయన్మార్ శరణార్థులే ప్రధాన అంశంగా ప్రస్తుత ఎన్నికలు జరుగనున్నాయి.

గత ఎన్నికల్లో పార్టీలు సాధించిన సీట్లు.. ఓట్ల శాతం

మిజోరం (40 సీట్లు)

పార్టీ	2018		2013	
	సీట్లు	ఓట్ల శాతం	సీట్లు	ఓట్ల శాతం
మిజో నేషనల్ ఫ్రంట్	26	37.7	5	28.4
కాంగ్రెస్	5	29.98	34	44.3
జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్	8	22.9	0	17.3
బీజేపీ	1	8.09	0	0.37
ఇతరులు	0	1.3	1	9

తెలంగాణ (119)

పార్టీ	2018		2014	
	సీట్లు	ఓట్ల శాతం	సీట్లు	ఓట్ల శాతం
టీఆర్ఎస్	88	46.87	63	-
కాంగ్రెస్	19	28.43	21	-
టీడీపీ	2	3.51	15	-
ఎంఐఎం	7	2.71	7	
బీజేపీ	1	6.98	5	-
ఇతరులు	1	6	5	-

మధ్యప్రదేశ్(230 సీట్లు)

పార్టీ	2018		2013	
	సీట్లు	ఓట్ల శాతం	సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	114	40.89	58	36.38
బీజేపీ	109	41.02	165	44.88
బీఎస్పీ	2	5.01	4	6.29
ఇతరులు	5	9	3	5.4

రాజస్తాన్ (200)

పార్టీ	2018		2013	
	సీట్లు	ఓట్ల శాతం	సీట్లు	ఓట్లశాతం
కాంగ్రెస్	100	39.30	21	33.1
బీజేపీ	73	38.77	163	45.2
స్వతంత్రులు	13	9.5	7	8.2
బీఎస్పీ	6	4	3	3.4
ఇతరులు	8	7.1	6	5

ఛత్తీస్‌గఢ్(90)

పార్టీ	2018		2013	
	సీట్లు	ఓట్ల శాతం	సీట్లు	ఓట్లశాతం
కాంగ్రెస్	68	43	39	40.3
బీజేపీ	15	33	49	41
ఇతరులు	7	11.5	2	11.3

అధికారంలోకి రాగానే కుల గణన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పేద వర్గాల, దళిత, బీసీల సాధికారత కోసం కుల గణన చేపట్టాలని పేర్కొంది. కుల గణన కోసం అధికార బీజేపీపై ఒత్తిడి పెంచుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించారు. కేంద్రంలో తాము అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహిస్తామని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు చేస్తామని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం చేశారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని వెల్లడించింది. కుల గణనకు మద్దతు ఇస్తూ సీడబ్ల్యూసీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాహుల్ గాంధీ అన్నారు. కుల గణన అనేది ఇండియాకు ఎక్స్–రే అని అభివర్ణించారు. బిహార్‌లో నిర్వహించిన కుల గణనను సీడబ్ల్యూసీ స్వాగతించింది.



త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నేతలు చర్చించారు.

ప్రభావవంతమైన వ్యూహం కావాలి: ఖర్గే

ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ప్రభావవంతమైన వ్యూహం అవసరమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా, క్రమశిక్షణతో పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు సీడబ్ల్యూసీ భేటీలో పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అసలైన లబ్ధిదారులకు అందాలంటే కేంద్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించాలని అన్నారు. కుల గణనకు తాను వంద శాతం మద్దతు ఇస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ సోనియా గాంధీ చెప్పారు. దానికోసం పోరాడుదామని సూచించారు. కులాల వారీగా జనాభా లెక్కలకు తమ పార్టీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

కశ్మీర్‌లో 'సరైన సమయం'లో ఎన్నికలు: ఈసీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని సరైన సమయంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషన్(సీఈసీ) రాజీవ్ కుమార్ సోమవారం చెప్పారు. ఏది సరైన సమయం అని తాము భావిస్తామో అప్పుడే అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఇతర ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత అక్కడ ఎన్నికలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య 83 నుంచి 90కి పెరిగింది.

క్లుప్తంగా...

విచారణకు హాజరైన 'బండారు'

గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసి, దూషించిన కేసులో టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి సోమవారం గుంటూరు అరండల్‌పేట పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఆయన్ను ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ విచారించారు. కాగా.. ఈ కేసులో రూ.25 వేల వ్యక్తిగత పూచీకత్తు బాండ్‌ను కోర్టుకు సమర్పించేందుకు నిందితుడు సత్యనారాయణమూర్తి స్పెషల్ మొబైల్ కోర్టులోనూ హాజరయ్యారు. పూచీకత్తు బాండ్‌ను కోర్టులో దాఖలు చేయగా.. పరిశీలించి ఆమోదించారు.

తాగునీటికి సాగర్ జలాలు: మంత్రి సురేశ్



సాక్షి, అమరావతి: ప్రజల తాగునీటి అవసరాలకు నాగార్జునసాగర్ జలాలు విడుదల చేశారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు సాగర్ కుడికాలువ ద్వారా ఈనెల 7వ తేదీ నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేస్తునట్లు తెలిపారు. ఈ జలాలు ప్రకాశం జిల్లా సరిహద్దు పుల్లల చెరువు మండలం మానేపల్లి 85/3 మైలు వద్దకు ఈ నెల 12 నాటికి చేరతాయని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో నీటి ఎద్దడి ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీలకు సంబంధించిన అన్ని తాగునీటి చెరువులను ఈ జలాలతో నింపాలని అధికారులకు సూచించారు. చెరువులు నింపే విషయంలో అధికారులు నిర్లక్ష్యం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికలు వస్తున్నాయని కపట ప్రేమ

- సీఎం జగన్‌పై టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శ

సాక్షి, అమరావతి: ఎన్నికలు సమీపించడంతో వైఎస్సార్‌సీపీ నేతలపై సీఎం జగన్ కపట ప్రేమ ఒలకబోస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌ను మించిన పేదల ద్రోహి ఎవరూ లేరన్నారు. తాము అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు రూ.1.14 లక్షల కోట్లను దారి మళ్లించారని, 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. విదేశీ విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి విద్యా పథకాలు లేకుండా చేశారని విమర్శించారు. ప్రశ్నించిన వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను హత్య చేశారని, వేల మందిపై దాడులు చేశారని ఆరోపించారు.

చంద్రబాబు అరెస్టును తప్పుపట్టను

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఒంగోలు టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు తప్పు చేసివుంటే.. అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని తాను తప్పుపట్టబోనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ఢిల్లీలో డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను కేవలం వంద కోట్ల రూపాయల కుంభకోణంలోనే అరెస్టు చేసి ఆరు నెలలుగా జైలులోనే పెట్టారని, అందువల్ల అవినీతికి పాల్పడిన ఎవరినైనా శిక్షించే అధికారం చట్టానికి ఉందన్నారు. గుండ్లకమ్మ ఆయకట్టు రైతుల పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించిన ధర్నాలో పాల్గొనేందుకు సోమవారం ఆయన ఒంగోలుకు వచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు విషయంలో ఢిల్లీకి వెళ్లిన లోకేశ్ 20 రోజులపాటు ఎదురు చూసినా ఎవరూ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను బీజేపీని వదిలి పెట్టమని సూచిస్తున్నామన్నారు. నరేంద్ర మోదీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అన్యాయమే జరిగిందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతికి మారుపేరు: కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర)/నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబునాయుడని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం విశాఖలోని ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పని అయిపోయిందని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాశాంతి పార్టీలో చేరితే మంచిదన్నారు. త్వరలో ప్రజల వద్దకు యాత్ర చేస్తానని చెప్పారు. పవన్‌కళ్యాణ్ ఇప్పటికే రూ.1,500 కోట్లకు చంద్రబాబుకు అమ్ముడుపోయారని, దానిపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బాబు రూ.ఆరులక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయన్నారు. తాను చేపట్టిన ఆందోళనల వల్లే విశాఖస్టీల్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించుకుందని పాల్ చెప్పారు. త్వరలోనే తెలంగాణాలో 119 మంది ప్రజాశాంతి పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తానని తెలిపారు. డిసెంబర్ 10న వైజాగ్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.


కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా సీఎం జగన్ పాలన

- ఏపీకి మళ్లీ జగనే సీఎం ఎందుకు కావాలో వివరిద్దాం
- నాలుగు ప్రధాన కార్యక్రమాల ద్వారా నిత్యం ప్రజల్లోకి వెళ్దాం
- వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో మాజీ మంత్రి కన్నబాబు



సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కాలర్ ఎగరేసుకునేలా పరిపాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం తపించే వ్యక్తి నాయకత్వంలో పనిచేయడం ప్రతి కార్యకర్త గొప్ప అదృష్టంగా భావిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దుష్ట శక్తులను ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు సీఎం కావాలనేది ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. భవిష్యత్తులో పార్టీ, ప్రభుత్వం నిరంతరం ప్రజల్లోనే పని చేసేలా రూపొందించిన నాలుగు ప్రధాన కార్యక్రమాలను సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ.. 'జగనన్న ఆరోగ్య సురక్ష, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. జగనే మళ్లీ ఎందుకు రావాలంటే, బస్సు యాత్ర, ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాల ద్వారా ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్తా ఓ సైనికుడిగా సీఎం జగన్ ప్రజలకు చేసిన మంచిని వివరించాలని కోరారు. అంతకు ముందు పలువురు ప్రజా ప్రతినిధులు మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌ను గెలిపించుకునే ఆవశ్యకతపై ప్రసంగించారు. వారు చెప్పిన విషయాలు వారి మాటల్లోనే..

జగన్‌తోనే సామాజిక న్యాయం



స్వాతంత్ర్యం తర్వాత ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. అందరూ పేదల గురించే, సామాజిక న్యాయం గురించే మాట్లాడేవారు. కానీ తొలిసారిగా సామాజిక న్యాయం నినాదం కాదని, అది అమలు చేయాల్సిన విధానమని నిరూపించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్. సీఎం జగన్ పేదవాడి గుండె చప్పుడుగా నిలబడితే.. చంద్రబాబు పెత్తందార్ల వైపు నిలబడ్డారు. ఈ యుద్ధంలో పేదలు గెలవాలంటే, వారి జీవితాలు బాగుపడాలంటే ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ జగనే సీఎం కావాలి.

– మోపిదేవి వెంకట రమణ, రాజ్యసభ సభ్యుడు

జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి



కుల, మతాలకు అతీతంగా పని చేస్తున్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుంది. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, దత్తపుత్రుడు కూటములు కడుతుంటే.. సీఎం జగన్ ఒంటరిగానే పేదలకు మేలు చేస్తున్నారు. గత ఎన్నికలకు 2 నెలల ముందు పింఛన్ల ఖర్చు కేవలం రూ.400 కోట్లు. ఇప్పుడు నెలకు రూ.2 వేల కోట్లు. ఇంత మంచి చేస్తున్న జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని గ్రామాల్లోని అవ్వతాతలకు, అక్క చెల్లెమ్మలకు చెప్పాలి.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ

సంక్షేమ రాజ్యానికి ఏపీ ప్రతీక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ రాజ్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రతీకగా నిలుస్తోంది. పేదల అభ్యున్నతే లక్ష్యంగా వాడవాడలా అంబేడ్కర్ భావజాలం విరాజిల్లుతోంది. ఎందరో మహానుభావులు కలలుగన్న సామాజిక అసమానతలు తొలగించి సామాన్యుల స్థితిగతుల్లో మార్పు తెచ్చిన గొప్ప నాయకుడు సీఎం జగన్. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో మనోధైర్యం పెరిగింది. ఏ ప్రభుత్వంలో వెనుకబడిన వర్గాలకు ఇన్ని రాజకీయ పదవులు దక్కాయి? ఇంత గౌరవం వచ్చింది? జగన్ నాయకత్వంలో రాజ్యాంగబద్ధంగా పాలన సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక సమతుల్యత ప్రజ్వరిల్లుతోంది. అందుకే జగనే మళ్లీ కావాలి.. మళ్లీ అధికారంలోకి రావాలి.

– మేరుగు నాగార్జున, రాష్ట్ర మంత్రి


ఓటర్లకు జవాబుదారీగా ప్రభుత్వం



గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రతి ఇంటి ముంగిటకు చేర్చారు సీఎం జగన్. దశాబ్దాలుగా గిరిజన ప్రజలు ఎరుగని సామాజిక చైతన్యం ఇప్పుడు ప్రజ్వరిల్లుతోంది. బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం దక్కింది. దేశంలో తొలిసారిగా ప్రభుత్వం ఓటు వేసిన ప్రజలకు జవాబుదారీగా పని చేస్తోంది. అందుకే రాష్ట్రంలోమళ్లీ సీఎంగా జగన్ ఉండాలి.. పేదలకు మరింత మేలు జరగాలి.

– కె.భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే

నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్



సీఎం జగన్ అనుకుంటే నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్. వైనాట్ 175 ధీమా వెనకాల నాలుగున్నరేళ్ల ప్రభుత్వ సంక్షేమం ఉంది. నిస్వార్థంగా పేదల కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే. అందుకే త్వరలో మూడు ప్రాంతాల్లో బస్సు యాత్రలు నిర్వహిస్తున్నాం. ఇది సామాజిక న్యాయ యాత్ర. పేదవాడికి జరిగే మంచిని వివరించే యాత్ర. దాదాపు 175 నియోజకవర్గాల్లో మీటింగులు పెడతాం. ఒక్కో టీంలో పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన సీనియర్ నాయకులు ఉంటారు. ప్రతిరోజూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మూడు ప్రాంతాల్లో మూడు మీటింగులు ఉంటాయి. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో పేదవాడికి, పెత్తందారుకీ మధ్య జరిగే యుద్ధంలో గెలవడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకులు సన్నద్ధం కావాలి.

– ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్

పేదల సంతోషం కోసమే జగన్



పేదలు సంతోషంగా బతకాలంటే సీఎంగా జగన్ ఉండాలి. పేద గడప నుంచి వచ్చిన మన పిల్లలను అంతర్జాతీయ మెట్లు ఎక్కిస్తున్నారు. అనారోగ్యం వస్తే ఇంటికే డాక్టర్ వస్తున్నారు. రైతన్నకు తోడుగా భరోసా ఇస్తున్నారు. వలంటీర్ల సైన్యంతో కరోనాను ఎదిరించడమే కాదు.. ప్రజా సంక్షేమాన్ని గడపగడపకు చేరుస్తున్నారు. సంక్షేమ పథకాలు విజయవంతంగా కొనసాగాలన్నా, ఆంధ్రప్రదేశ్ ప్రజలు చిరునవ్వుతో ఉండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మన జగన్ ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. అందుకే ప్రజలకు గత మాఫియా పాలనను, ప్రస్తుత సంక్షేమ సారథ్యాన్ని వివరించాలి.

– విడదల రజిని, రాష్ట్ర మంత్రి

ధనిక, పేదల మధ్య అంతరంపై పోరు



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ ఉండాలంటే 2024లోనూ మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవాలి. ధనిక, పేద అనే తారతమ్యాలను తొలగించే లక్ష్యంతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. అందుకే ప్రతి రంగంలోనూ ఏపీ సత్తా చాటుతోంది. చంద్రబాబు ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తే.. సీఎం జగన్ గవర్నమెంట్ బడుల రూపురేఖలు మార్చి ఇంగ్లిషు మీడియం, సీబీఎస్‌ఈ, ఐబీ సిలబస్, డిజిటల్ లెర్నింగ్ విధానాలను ప్రోత్సహిస్తున్నారు. 3257 ప్రొసీజర్లలో ఆరోగ్యశ్రీ వైద్యం అందిస్తున్నారు. 17 కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ఆరోగ్య ఆసరా, ఇంటి వద్దకే వైద్యం దక్కుతోంది. ఇవన్నీ ఉండాలంటే మళ్లీ సీఎంగా జగన్ రావాల్సిందే.

– వెలంపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి

బాబును నమ్మి బాగుపడింది లేదు



చంద్రబాబు పెత్తందారులతో కలిసి పేదలకు విద్య, వైద్యం దూరం చేస్తే.. అదే పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్య సౌకర్యాలు అందిస్తున్న మనసున్న వ్యక్తి జగన్. దేశంలో చంద్రబాబును నమ్మి బాగుపడిన వాళ్లు లేరు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఆనందపడని వాళ్లు ఉండరు. రాష్ట్ర భవిష్యత్తును చంద్రబాబు నాశనం చేస్తే.. దానిని సీఎం జగన్ సమర్థవంతంగా గాడిన పెట్టారు. స్కాముల్లో తన స్కిల్ చూపించి రూ.కోట్లు కొట్టేసిన ఘనుడు చంద్రబాబు. స్కిల్ కేసులో తండ్రి అడ్డంగా దొరికిపోయి జైలులో ఉంటే.. కొడుకు లోకేశ్ ఢిల్లీ పారిపోయి తలదాచుకుంటున్నాడు. ఇలాంటి దుష్టశక్తులు ఏం చెప్పినా మన జీవితాలతో మళ్లీ ఆటలు ఆడుకోవడానికేనని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి.

– నందిగం సురేష్, బాపట్ల ఎంపీ

వై ఏపీ నీడ్స్ జగన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం



పేదలు గుడిసెల్లోనే ఉండాలని, కాలనీల్లో ఉండకూడదనుకునే మనస్తత్వం చంద్రబాబుది. అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని అవమానించారు. బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను కించపరిచిన కుసంస్కారం చంద్రబాబుది. 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. మేనిఫెస్టో కూడా కనపడకుండా చేశారు. కానీ, సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను నెరవేర్చి పేదల గుండెల్లో నిలిచిపోయారు. ఏకంగా చట్టం తెచ్చి నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం ఇచ్చారు. అందుకే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అందరమూ ప్రజల్లోకి తీసుకెళ్దాం.

– పాముల పుష్పశ్రీవాణి, మాజీ మంత్రి


బాబు అబద్ధాలను నమ్మొద్దని ప్రజలను చైతన్య పరచాలి



దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడా లేనంతగా ఏపీలో సంక్షేమ ఫలాలు నిజమైన పేదలకు దక్కుతున్నాయి. గ్రాఫిక్స్ బొమ్మల మాయలేదు. పథకం పేరుతో దోపిడీ లేదు. స్కాంలు లేవు. అందువల్లే రాష్ట్ర పేద ప్రజలందరికీ నేరుగా రూ.2.60 లక్షల కోట్లు లబ్ధి జరిగింది. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బలహీనులైన పేదలను బలవంతులుగా మార్చిన నాయకత్వం ఇది. మహానేత వైఎస్సార్ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తే.. జగన్ ముస్లిం పిల్లలను కలెక్టర్లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్నారు. అందుకే జగన్ ఏపీకి కావాలి. చంద్రబాబు అధికారం కోసం చెప్పే అబద్ధాలను నమ్మొద్దని ప్రజలను చైతన్యపరచాలి.

– హఫీజ్ ఖాన్, ఎమ్మెల్యే

సంక్షేమ పథకాల విప్లవం



సీఎం జగన్ అంటేనే ఒక సంకల్పం. పేదరికాన్ని రూపుమాపడమే ఆయన లక్ష్యం. అందుకే సంక్షేమ పథకాల విప్లవాన్ని సృష్టించారు. బీసీలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణాల్లోని పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా పౌర సేవలను డోర్ డెలివరీ చేయడంతో పాటు మూడు ప్రాంతాల ఆత్మగౌరవాన్ని కాపాడేలా మూడు రాజధానులను ప్రకటించారు. ఇది గతంలో ఏ పాలకుడికీ సాధ్యం కాలేదు. గత పాలకులకు భిన్నంగా చెప్పిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేశారు. సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడని నిరూపించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం మళ్లీ జగనే రావాలి.. పేదలకు మరింత న్యాయం జరగాలి.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మంత్రి

సెమీ 'ఫైనల్స్'కు రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

చత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో, తెలంగాణ సహా మిగిలిన 4 రాష్ట్రాల్లో ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలో నవంబర్ 3న నామినేషన్లతో ఎన్నికల కోలాహలం ప్రారంభమవుతుంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఐదు రాష్ట్రాల్లో పోలింగ్ వేర్వేరు తేదీల్లో నిర్వహించినప్పటికీ ఫలితాలు మాత్రం డిసెంబర్ 3న ఒకేసారి ప్రకటించనున్నారు. ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 679 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 35,356 పోలింగ్ బూత్‌ల్లో 3.17 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పు ఇవ్వనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లేనని సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు.



సీఈసీ రాజీవ్‌కుమార్

నియోజకవర్గాల్లో ఒకేసారి పోలింగ్ జరుగుతుంది. తెలంగాణ ఓటర్లలో 1.58 కోట్ల మంది పురుషులు, 1.58 కోట్ల మంది మహిళలు ఉన్నారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేవారు 8.11 లక్షల మంది ఉన్నారు. దివ్యాంగులు 5.06 లక్షల మంది, 80 సంవత్సరాలకు పైబడిన వారు 4.44 లక్షల మంది, వందేళ్లు పైబడిన వారు 7,005 మంది ఉన్నారు. తెలంగాణలో 2018తో పోలిస్తే ఎలక్టోరల్ రోల్ లింగ నిష్పత్తి పెరిగి 998కు చేరింది. రాష్ట్రంలో 5,356 పోలింగ్ స్టేషన్లు సిద్ధమయ్యాయి. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 14,484, గ్రామీణ ప్రాంతాల్లో 20,892 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలో 27,798 పోలింగ్ స్టేషన్లలో ఆన్‌లైన్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నారు. మహిళలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలు 597, మోడల్ పోలింగ్ కేంద్రాలు 644, దివ్యాంగులు నిర్వహించేవి 120 ఉన్నాయి. ఐదు రాష్ట్రాల్లో కలిపి 2,900కు పైగా పోలింగ్ కేంద్రాలను యువత నిర్వహిస్తారని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. తెలంగాణలోని 119 స్థానాల్లో జనరల్ 88, ఎస్సీ రిజర్వ్‌డ్ 19, ఎస్టీ రిజర్వ్‌డ్ 12 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపులు, ఉచితాలు, బహుమతులు, మద్యం, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడానికి విస్తృత తనిఖీలు చేపట్టనున్నారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. తెలంగాణలో 148 చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తారు.

తెలంగాణ 'దంగల్'

వచ్చే ఏడాది జనవరి 16వ తేదీతో ముగిసే తెలంగాణ అసెంబ్లీలోని 119 నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఈసారి ఒకే విడతలో జరుగనుంది. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. నామినేషన్ దాఖలుకు నవంబర్ 10 ఆఖరు తేదీగా నిర్ణయించారు. నవంబర్ 13న దరఖాస్తుల పరిశీలన చేపడతారు. నవంబర్ 15న దరఖాస్తుల ఉపసంహరణకు చివరి తేదీ. నవంబర్ 30న రాష్ట్రవ్యాప్తంగా 119

మొదటిసారిగా 'సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా అతిక్రమించినట్లు గుర్తిస్తే.. సీవిజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సీఈసీ రాజీవ్ కుమార్ సూచించారు. క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా కేసులకు సంబంధించి పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మొదటిసారిగా 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం' ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఖర్చుపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. నాన్ షెడ్యూల్డ్ చార్టెడ్ విమానాలతో పాటు రైల్వే, పోస్టల్ కార్గోలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. వివాదాస్పద, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరిస్తామని ప్రకటించారు.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఇదీ.. కౌంటింగ్: డిసెంబర్ 3

రాష్ట్రం	మొత్తం స్థానాలు	నోటిఫికేషన్	నామినేషన్లకు ఆఖరు తేదీ	నామినేషన్ల పరిశీలన	నామినేషన్ల ఉపసంహరణ	పోలింగ్
తెలంగాణ	119	నవంబర్ 3	నవంబర్ 10	నవంబర్ 13	నవంబర్ 15	నవంబర్ 30
రాజస్తాన్	200	అక్టోబర్ 30	నవంబర్ 6	నవంబర్ 7	నవంబర్ 9	నవంబర్ 23
మధ్యప్రదేశ్	230	అక్టోబర్ 21	అక్టోబర్ 30	అక్టోబర్ 31	నవంబర్ 2	నవంబర్ 17
చత్తీస్‌గఢ్ (తొలివిడత)	90	అక్టోబర్ 13	అక్టోబర్ 20	అక్టోబర్ 21	అక్టోబర్ 23	నవంబర్ 7
(రెండో విడత)		అక్టోబర్ 21	అక్టోబర్ 30	అక్టోబర్ 31	నవంబర్ 2	నవంబర్ 17
మిజోరం	40	అక్టోబర్ 13	అక్టోబర్ 20	అక్టోబర్ 21	అక్టోబర్ 23	నవంబర్ 7

తెలంగాణ

15 నుంచి రంగంలోకి కేసీఆర్!

నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డిలలో కేసీఆర్ నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రంగంలోకి దిగుతున్నారు. ఈ నెల 15 నుంచి సభలు, ఇతర కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధంచేసి ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ నెల 15న తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమై పార్టీ బీఫారాలు అందజేస్తారు. తర్వాత పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారు. ఆ వెంటనే నియోజకవర్గాల పర్యటనకు బయలుదేరుతారు. 15న తెలంగాణ భవన్‌లో పార్టీ అభ్యర్థులతో జరిగే భేటీలో ఎన్నికల ప్రచార వ్యూహాలు, సభలు, సమావేశాల నిర్వహణ, ప్రత్యర్థులను చిత్తు చేయడంపై కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. కేసీఆర్ తాను పోటీ చేసే గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 9న నామినేషన్లు దాఖలు చేస్తారు.

త్వరలోనే రాష్ట్రానికి పీడ విరగడ

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మరికొన్ని రోజుల్లోనే రాష్ట్రానికి పట్టిన పీడ విరగడ కాబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో ఇప్పటికే కేసీఆర్‌కు చలిజ్వరం పట్టిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడనుండటంతో ఇకపై ఆయన ఫాంహౌస్ నుంచి బయటకు రావాల్సిన అవసరం లేదన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాబోయే విజయదశమిని తెలంగాణ ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అధికారం కోల్పోతున్నామన్న భయం బిల్లా-రంగాలలో మొదలైందని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

చంద్రబాబు సర్కారు నిర్వాకం.. భూకేటాయింపుల్లో బరితెగింపు

- చట్టం ముందు అందరూ సమానమే అనే ప్రాథమిక హక్కు గాలికి
- ప్రభుత్వ రంగ సంస్థలకైతే అత్యధిక ధరకు.. ప్రైవేట్ సంస్థలకు మాత్రం కారుచౌకగా..
- అమరావతిలో భూ కేటాయింపుల తీరును తప్పుబట్టిన 'కాగ్'



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో భూముల కేటాయింపులకు సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారంగా.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక తప్పుబట్టింది. చట్టం ముందు అందరూ సమానమేననే ప్రాథమిక హక్కును నాటి ప్రభుత్వం కాలరాసిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. భూముల కేటాయింపుల కోసం ఏకరీతి ధరల విధానాన్ని రూపొందించడంలో చంద్రబాబు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైనట్లు తేల్చిచెప్పింది. ప్రభుత్వరంగ సంస్థలకు భూములను అత్యధిక ధరకు కేటాయించారని.. అలాగే ప్రైవేట్ సంస్థలకు అతితక్కువ ధరకు కేటాయించినట్లు కాగ్ ఆ నివేదికలో పేర్కొంది.

మంత్రివర్గ సూచనలూ బేఖాతరు..

ఇక రాజధాని అమరావతిలో ఫ్రీ హోల్డింగ్ ప్రాతిపదికన టీడీపీ సర్కారు 63 కేటాయింపులు చేసిందని, ఇందులో ఆరు కేటాయింపులను కాగ్ తనిఖీ చేయగా ప్రభుత్వం ఏకరీతి ధరలను ఆమోదించలేదని పేర్కొంది. భూ కేటాయింపుల్లో ఏకరీతి లేనప్పుడు ఏకపక్ష, విచక్షణతో కూడిన ధరలకు అవకాశముందని కాగ్ వ్యాఖ్యానించింది. మంత్రివర్గ ఉప సంఘం సూచించిన ధరలను కూడా పక్కన పెట్టి ఒక విధానం అంటూ లేకుండా కొన్ని సంస్థలకు ఒక ధర, మరికొన్ని సంస్థలకు మరో ధరకు భూములను కేటాయించినట్లు కాగ్ వివరించింది. ప్రైవేట్ విద్యా సంస్థలకు ఒక ధర, ప్రైవేట్ ఆరోగ్య సంస్థలకు ఇంకో ధర, బ్యాంకులకు మరో ధరకు భూములు కేటయించినట్లు తెలిపింది.

ఫ్రీ హోల్డ్ ప్రాతిపదికన వివిధ సంస్థలకు భూ కేటాయింపుల ధరలిలా..

సంస్థ	కేటాయింపు (రూ.కోట్లలో)	ఎకరాలు
జేవియర్ లేబర్ ఇన్‌స్టిట్యూట్	0.10	50.00
బ్రహ్మకుమారి ఎడ్యుకేషన్ సొసైటీ	0.10	10.00
వీఐటీ-ఏపీ	0.50	100.00
ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం	0.50	150.00
అమృత విశ్వవిద్యాలయం	0.50	50.00
నాబార్డు	2.00	4.30
ఏపీసీఓబీ	2.00	4.00
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	4.00	1.57
ఇండియన్ బ్యాంకు	4.00	1.50
విజయా బ్యాంకు	4.00	1.50
బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్	0.25	15.00
హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్	0.25	12.00
బీఆర్ఎస్ మెడిసిటీ	0.50	100.00

అంగళ్లు కేసులోనూ ఎదురుదెబ్బ

- చంద్రబాబు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు
- డీమ్డ్ కస్టడీగా భావించాలన్న ఆయన అభ్యర్థన తిరస్కృతి
- తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి

సాక్షి, అమరావతి : అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసంపై ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం హైకోర్టు కొట్టేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో అంగళ్లు కేసులో కూడా తాను కస్టడీలోనే ఉన్నట్లు (డీమ్డ్) భావించాలన్న చంద్రబాబు అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అంగళ్లు కేసు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు రెండూ పూర్తిగా వేరు వేరని హైకోర్టు తెలిపింది. అందువల్ల అంగళ్లు కేసులో చంద్రబాబు కస్టడీలో ఉన్నట్లు (డీమ్డ్) భావించడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. ఈ కేసులో ఆయన అరెస్టు కావడంగానీ, జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేయడంగానీ జరగనందున ఈ కేసులో ఆయన బెయిల్‌కు అర్హులుకాదని స్పష్టంచేసింది. అలాగే, ఈ కేసులో ఇప్పటివరకు తనను అరెస్టు చేయకపోవడంలో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, తనను మరికొంత కాలం జైలులో ఉంచేందుకే ఇలా చేస్తున్నారంటూ చంద్రబాబు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చుతూ ఈ వాదనలో ఎలాంటి బలంలేదని స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు.

'యుద్ధభేరి' ముసుగులో విధ్వంసం..

యుద్ధభేరి పేరుతో ప్రాజెక్టుల సందర్శన కోసం యాత్ర చేపట్టిన చంద్రబాబు అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్దకు రాగానే టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున విధ్వంసం సృష్టించాయి. దీనిపై ముదివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో చంద్రబాబు ఏ1గా ఉన్నారు. అప్పటి నుంచి బెయిల్ కోసం ప్రయత్నించని చంద్రబాబు, స్కిల్ స్కాం కేసులో అరెస్టయి, జ్యుడీషియల్ రిమాండ్‌లోకి వెళ్లగానే తనకు అంగళ్లు కేసులో బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం తీర్పు వాయిదా వేసిన న్యాయమూర్తి సోమవారం ఉదయం తన నిర్ణయాన్ని వెలువరించారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ తుది జాబితా విడుదల

నేడు సర్వీస్ సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)ల్లో 14 ప్రిన్సిపల్ పోస్టుల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ తుది జాబితా, ప్యానెల్ జాబితా రూపొందించి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది జాబితాలో ఉన్న అభ్యర్థులు సర్వీస్ రిజిస్టర్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నంలోని ఏపీ మోడల్ స్కూల్స్ రాష్ట్ర కార్యాలయానికి రావాలని సూచించారు.

బాబుకు నో బెయిల్

ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

- టెరాసాఫ్ట్‌తో బాబుకున్న సాన్నిహిత్యంపై హైకోర్టుకు సీఐడీ ఆధారాలిచ్చింది
- ఆ సంస్థకు అనుకూలంగా ఆయన ఎలా వ్యవహరించారో వివరించింది
- దానిని బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించేందుకు ఏం చేశారో కూడా చెప్పింది
- అభ్యంతరం చెప్పిన అధికారిని బదిలీ చేసిన విషయం కూడా కోర్టు దృష్టికి..
- మొత్తం మీద ఆ సంస్థకు రూ.114.53 కోట్ల మేర లబ్ధి
- అంతిమంగా నిధులు ఎక్కడికెళ్లాయన్న దానిపై దర్యాప్తు జరగాలి
- అందువల్ల ఈ దశలో దర్యాప్తునకు ఎలాంటి భంగం కలగరాదు
- కాబట్టి ఈ దశలో ఆయనకు ముందస్తు బెయిల్ సాధ్యంకాదు
- తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి



సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సోమవారం తీవ్ర నిరాశ మిగిల్చింది. వివిధ కేసుల్లో బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న ఆశలు ఫలించలేదు. ఏపీ ఫైబర్‌గ్రిడ్, ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు, అంగళ్లు విధ్వంసం కేసులకు సంబంధించి ఆయనకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫైబర్‌గ్రిడ్ కేసులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను.. ఇన్నర్ రింగ్‌రోడ్డు, అంగళ్లు కేసుల్లో వేర్వేరుగా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. ఆ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం వేర్వేరుగా తీర్పులు వెలువరించారు. ఇదే సమయంలో ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం సైతం ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది.

ముందస్తు బెయిల్‌కు బాబు పిటిషన్..

ఏపీ ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును టెరాసాఫ్ట్ సంస్థకు కట్టబెట్టి రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారంటూ ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ సంస్థకు ప్రాజెక్టు దక్కడంలో కీలకపాత్ర పోషించిన చంద్రబాబు.. టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ సభ్యుడు వేమూరి హరికృష్ణ ప్రసాద్, టెరాసాఫ్ట్‌తో పాటు పలువురిని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సురేష్‌రెడ్డి సుదీర్ఘ విచారణ జరిపారు. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదించగా, సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విని ఈ నెల 5న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సోమవారం ఉదయం జస్టిస్ సురేష్‌రెడ్డి తన తీర్పును వెలువరించారు. ఆయన ఏమన్నారంటే..

అంతిమంగా నిధులెక్కడికి వెళ్లాయన్నది దర్యాప్తు చేయాలి..

'టెరాసాఫ్ట్‌తో చంద్రబాబుకున్న సంబంధం, ఆ కంపెనీకి టెండర్ కట్టబెట్టే విషయంలో చంద్రబాబు చూపిన శ్రద్ధ తదితర అంశాలకు సంబంధించి సీఐడీ పలు లిఖితపూర్వక ఆధారాలను కోర్టు ముందుంచింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేసి అప్పటి అధికారులను ప్రభావితం చేశారు. ఎలాంటి విధి విధానాలను పాటించకుండా, ఎలాంటి పరిశీలన చేయకుండానే సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)ను తయారుచేశారు. అలాగే, టెరాసాఫ్ట్‌కు అనుకూలంగా వ్యవహరించని అధికారులను మార్చడానికి సంబంధించిన ఆధారాలను.. టెరాసాఫ్ట్‌ను బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించడం, టెండర్ గడువు తేదీని పొడిగించడం వంటి వాటికి సంబంధించిన ఆధారాలను కూడా సమర్పించింది. రూ.330 కోట్ల విలువ చేసే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన నోట్‌ఫైళ్లలో ఎలాంటి అభ్యంతరాలను, ప్రతికూల అభిప్రాయాలను రాయవద్దని చంద్రబాబు తనకు సూచించారంటూ అప్పటి ఎనర్జీ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి నుంచి వాంగ్మూలాన్ని కూడా సీఐడీ సేకరించింది. అలాగే, టెరాసాఫ్ట్‌ను బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించేందుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు తనకు చెప్పారంటూ అప్పటి పౌర సరఫరాల శాఖ స్పెషల్ సెక్రటరీ ఇచ్చిన వాంగ్మూలాన్నీ సీఐడీ ఈ కోర్టు ముందుంచింది. అంతేకాక.. వేమూరి హరికృష్ణ ప్రసాద్, అప్పటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ (ఇన్‌క్యాప్) మాజీ ఎండీ కె. సాంబశివరావులతో కలిసి చంద్రబాబు కుట్రపూరితంగా వ్యవహరించారు. సాంబశివరావు చేసిన ప్రతిపాదన మేరకు హరికృష్ణ ప్రసాద్‌ను టెండర్ కమిటీ సభ్యునిగా నియమించారు. నిబంధనలకు, చట్ట విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలను చంద్రబాబు ఆమోదించారు. కానీ కేసు నమోదు చేసిన రెండేళ్లకు చంద్రబాబును నిందితునిగా చేర్చారని.. ఇప్పుడు నిందితునిగా చేర్చడం వెనుక దురుద్దేశాలున్నాయని సీనియర్ న్యాయవాదులు చంద్రబాబు తరఫున వాదించారు.

చంద్రబాబుకు బెయిల్ మంజూరు సాధ్యం కాదు..

ఇలాంటి కేసుల్లో దర్యాప్తునకు పట్టే సమయాన్ని, సీఐడీ సేకరించిన ప్రాథమిక ఆధారాలను, ఈ కేసుతో ముడిపడి ఉన్న పలువురు సాక్షులను గత నెల 14న విచారించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, ఇప్పుడు చంద్రబాబును నిందితునిగా చేర్చడం వెనుక దురుద్దేశాలున్నాయన్న వాదనలో ఎలాంటి బలం ఈ కోర్టుకు కనిపించడంలేదు. విస్తృత ప్రజా, రాష్ట్ర ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఈ కేసులో నేర తీవ్రతను, టెరాసాఫ్ట్‌కు చంద్రబాబు రూ.114.53 కోట్ల మేర ఆయాచిత లబ్ధిచేకూర్చారన్న ఆరోపణలను, తద్వారా ఖజానాకు నష్టం కలిగించిన విషయాన్ని కూడా ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటోంది. అందువల్ల ఈ దశలో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడం సాధ్యంకాదు. అంతిమంగా నిధులు ఎక్కడికి వెళ్లాయన్న విషయాన్ని ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉంది. కాబట్టి ఈ దశలో దర్యాప్తునకు ఎలాంటి భంగం కలగరాదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ చంద్రబాబు పిటిషన్‌ను కొట్టేస్తున్నా'.. అని జస్టిస్ సురేష్‌రెడ్డి తన తీర్పు చెప్పారు.

'ఇన్నర్'లోనూ చుక్కెదురు

బెయిల్ మంజూరు కోసం దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

- ఈ కేసులో డీమ్డ్ కస్టడీ ఉన్నట్లు భావించాలన్న ఏ–1 చంద్రబాబు వాదన తిరస్కృతి
- స్కిల్ స్కాం కేసు వేరు.. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు వేరు
- రెండింటిలో దర్యాప్తు అధికారులు కూడా వేర్వేరు
- విచారించిన సాక్షులు.. సేకరించిన సాక్ష్యాలు సైతం వేరు
- అందువల్ల డీమ్డ్ కస్టడీగా భావించడం సాధ్యంకాదు
- చంద్రబాబు ఇన్నేళ్లు నిద్రపోయి, ఇప్పుడు పోలీసులను నిందిస్తున్నారు
- సరెండర్ పిటిషన్‌గా భావించాలన్న అభ్యర్థనా తిరస్కృతి



సాక్షి, అమరావతి : ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రో కోకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఏ–1 నిందితుడైన మాజీ సీఎం చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా హైకోర్టు కొట్టేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో కూడా తాను కస్టడీలోనే ఉన్నట్లు (డీమ్డ్ కస్టడీ) భావించాలన్న చంద్రబాబు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు రెండూ వేర్వేరు కేసులని, రెండూ కూడా వేర్వేరు లావాదేవీలకు సంబంధించినవని, రెండు కేసుల్లో దర్యాప్తు అధికారులూ వేర్వేరని, విచారించిన సాక్షులు, సేకరించిన సాక్ష్యాలు కూడా వేర్వేరని హైకోర్టు స్పష్టంచేసింది. అందువల్ల ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీలో ఉన్నట్లు (డీమ్డ్) భావించడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. ఈ కేసులో చంద్రబాబు అరెస్టు కావడంగానీ, జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేయడంగానీ జరగలేదని, అందువల్ల ఆయన బెయిల్‌కు అర్హులుకాదని స్పష్టంచేసింది.

చంద్రబాబు వాదనలో బలంలేదు

2022లో నమోదు చేసిన ఈ కేసులో ఇప్పటివరకు తనను అరెస్టుచేయకపోవడంలో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, తనను మరింత కాలం జైలులో ఉంచేందుకే ఇలా చేస్తున్నారంటూ చంద్రబాబు వాదనలో ఎలాంటి బలంలేదని హైకోర్టు స్పష్టంచేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు నమోదైన విషయం చంద్రబాబుకు బాగా తెలుసునని, ఇదే కేసులో ఏ–2 నుంచి ఏ–5 వరకు నిందితులు ముందస్తు బెయిళ్లు కూడా పొందారని న్యాయస్థానం గుర్తుచేసింది. ముందస్తు బెయిల్ విషయంలో చంద్రబాబు ఇన్నేళ్లు నిద్రపోయి, ఇప్పుడు పోలీసులను నిందిస్తున్నారని హైకోర్టు ఆక్షేపించింది. స్కిల్ కేసులో అరెస్టుచేసిన మరుసటిరోజే చంద్రబాబును ఇన్నర్ కేసులో కూడా కోర్టు ముందు హాజరుపరచాలంటూ సీఐడీ సీఆర్పీసీ సెక్షన్–267 కింద సంబంధిత కోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని గుర్తుచేసింది. అలాగే, ఈ బెయిల్ పిటిషన్‌ను తన సరెండర్ పిటిషన్‌గా భావించి, తనకు బెయిల్ మంజూరు చేసే విషయాన్ని పరిశీలించాలన్న చంద్రబాబు అభ్యర్థనను సైతం హైకోర్టు తిరస్కరించింది. అలాగే, ఇన్నర్ కేసులో హైకోర్టు ముందు చంద్రబాబు భౌతిక హాజరుగానీ, వాస్తవిక లొంగుబాటుగానీ సాధ్యంకాదని, తన పిటిషన్‌లో చంద్రబాబు ఎక్కడా కూడా తాను హైకోర్టు ముందు లొంగిపోయేందుకు అనుమతినివ్వాలని కూడా కోరలేదని తెలిపింది. అలాంటి అభ్యర్థన ఏదీ లేనప్పుడు, ఈ పిటిషన్‌ను సరెండర్ పిటిషన్‌గా భావించలేమని తేల్చిచెప్పింది. అలాగే, బెయిల్ విషయంలో ఆ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోలేమని కూడా స్పష్టంచేసింది. అంతేకాక.. ఒకవేళ కోర్టు స్కిల్ కేసులో తన కస్టడీని ఇన్నర్ కేసులో డీమ్డ్ కస్టడీగా భావించని పక్షంలో, తాను దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా పరిగణించి, ముందస్తు బెయిల్ మంజూరు విషయాన్ని పరిశీలించాలన్న చంద్రబాబు వాదనను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు పూర్వాపరాల్లోకి ఏ మాత్రం వెళ్లడంలేదని, కేవలం డీమ్డ్ కస్టడీ అంశానికే పరిమితం అవుతున్నట్లు న్యాయస్థానం తెలిపింది. అన్నీ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ చంద్రబాబు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం 24 పేజీల తీర్పును వెలువరించారు.

క్విడ్ ప్రో కో పై ఎమ్మెల్యే ఆర్కే ఫిర్యాదు..

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఇందులో అప్పటి ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, అలాగే క్విడ్ ప్రో కో కూడా జరిగిందంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ప్రాథమిక విచారణ జరిపిన సీఐడీ.. లింగమనేని రమేష్, హెరిటేజ్ ఫుడ్స్, రామకృష్ణ హౌసింగ్ సంస్థలకు లబ్ధిచేకూర్చారని ఆరోపించింది. ఈ లబ్ధికి ప్రతిఫలంగా కరకట్ట వద్ద ఉన్న ఇంటిని లింగమనేని రమేష్ చంద్రబాబుకు ఇచ్చారని తెలిపింది. ఇక ఈ కేసులో చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, ప్రమోద్‌కుమార్ దూబే, సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించగా, సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు.

టీడీపీ నేత నారాయణకు మరో షాక్

- ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఆయన భార్య, బావమరుదులు
- ఏ–15గా పొంగూరి రమాదేవి
- ఏ–16గా రావూరి సాంబశివరావు
- ఏ–17గా ఆవుల మునిశంకర్
- ఏసీబీ కోర్టులో సీఐడీ ప్రత్యేక మెమో

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు పెంచింది. టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణ భార్య, బావమరుదులతో కలిపి మరో ఐదుగురిని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ఇప్పటికే ఏ–2గా నారాయణ ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన భార్య పొంగూరి రమాదేవితోపాటు ఆయన బావమరుదులు, కుటుంబ సభ్యులను నిందితులుగా చేరుస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం సీఐడీ ప్రత్యేక మెమో దాఖలు చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో ఏ–15గా పొంగూరి రమాదేవి, ఏ–16గా రావూరి సాంబశివరావు (రమాదేవి సోదరుడు), ఏ–17గా ఆవుల మునిశంకర్ (రమాదేవి సోదరుడు), ఏ–18గా ప్రమీల (నారాయణ విద్యా సంస్థల ఉద్యోగి), ఏ–19గా కొత్తాపు వరుణ్ కుమార్ (నారాయణ అల్లుడి సోదరుడు)లను సీఐడీ చేర్చింది. ఇప్పటికే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని న్యాయస్థానానికి నివేదించింది.

17ఏ.. నిందితులకు కాదేమో!

ఆ సెక్షన్ నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది • చంద్రబాబు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: 'అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ అనేది నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది కానీ నిందితులకు కాదేమో' అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చట్టం చేసిన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలే తప్ప, దానిని తప్పుగా అన్వయించుకోవడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. సవరణలు వచ్చినప్పుడల్లా కొత్తగా మార్పులు వస్తున్నాయని, సెక్షన్ 17ఏ చంద్రబాబు కేసుకు వర్తిస్తుందా అని న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతోకూడిన ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సోమవారం చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో 2021లో ఎఫ్ఐఆర్ నమోదైందని సీఐడీ పేర్కొందని, అందువల్ల ఈ కేసుకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందని ఆయన తెలిపారు. 2018కి ముందే విచారణ ప్రారంభమైందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదన సరికాదన్నారు. గతంలో కొంత విచారణ జరిగినట్లు కనిపిస్తున్నా, ఈ ఎఫ్ఐఆర్‌కు, దానికి సంబంధం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన తర్వాత వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకొని పెట్టే కేసులను నిరోధించడానికి సెక్షన్ 17ఏను తీసుకొచ్చారన్నారు. 2018 కన్నా ముందే దర్యాప్తు జరిగిందని రుజువు చేసే డాక్యుమెంట్లను ప్రభుత్వం సమర్పించలేదని, ఏసీబీ కోర్టు ముందు కూడా ఉంచలేదని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. మీరు రిమాండ్ రిపోర్టును సవాలు చేస్తున్నారా అని ప్రశ్నించగా.. అవునని సాల్వే బదులిచ్చారు. సీఐడీ సమర్పించిన డాక్యుమెంట్ ద్వారానే దర్యాప్తు మొదలైందని లేదా ఎఫ్ఐఆర్ నమోదైందని భావిస్తే ఆ డాక్యుమెంటును కోర్టు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పీసీ చట్టంలోని 17ఏ పై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి దశలోనూ గవర్నర్ అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఈ ఎస్ఓపీ కోర్టు సమీక్షకు లోబడి ఉండదని, సెక్షన్ 17ఏ ను అర్థం చేసుకోవడానికి సహకరిస్తుందన్నారు. ఈ దశలో జస్టిస్ బేలా ఎం త్రివేది జోక్యం చేసుకొని.. చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణలు కోర్టు స్వీకరించదని స్పష్టం చేశారు. ఎస్ఓపీని మూడేళ్ల కిందట ప్రకటించారని, అంతకు ముందు సంగతేమిటని, ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయ కక్ష అని ఎవరన్నారని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. కేసును పరిశీలిస్తే ఫిర్యాదులో అంశాలు చంద్రబాబుకు వర్తించవన్నారు. ఈ కేసు మొత్తం సీమెన్స్, డిజైన్‌టెక్‌లకు సంబంధించిందన్నారు. డిజైన్‌టెక్ కంపెనీ స్కిల్‌టెక్ కంపెనీ నుంచి జీఎస్టీ క్రెడిట్‌లు పొందిందని, దానికి సంబంధించిందే 2021 సెప్టెంబరులోని ఫిర్యాదు అని సాల్వే తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, డిజైన్‌టెక్ ఒప్పందం ఎవరితో చేసుకుందని ప్రశ్నించగా... అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో అని సాల్వే తెలిపారు. దర్యాప్తు ఎప్పుడు ప్రారంభమైందని ధర్మాసనం ప్రశ్నించగా.. 2021 సెప్టెంబరు 7న అని అన్నారు. ఏ ఆధారంతో చెబుతున్నారని ధర్మాసనం తిరిగి ప్రశ్నించింది. అవినీతిని నిరోధించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని, చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణ స్వీకరించలేమని జస్టిస్ బేలాఎం త్రివేది వ్యాఖ్యానించారు. వాదనలు అయ్యాక దీనికి సంబంధించి ఏవైనా డాక్యుమెంట్లు సమర్పిస్తే వాటిని కౌంటర్ చేసే అవకాశం ఉండదని, అప్పుడు మెరిట్స్ జోలికి వెళ్లకుండా తిప్పి పంపుతామని సాల్వేనుద్దేశించి జస్టిస్ త్రివేది అన్నారు. సెక్షన్ 17ఏ నేరం జరిగిన తేదీతో సంబంధమని హైకోర్టు న్యాయమూర్తి చెప్పినందున తిప్పి పంపటం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని సాల్వే తెలిపారు. హైకోర్టులో వాదనల తర్వాత ప్రభుత్వం డాక్యుమెంట్లు సమర్పించిందన్నదే పిటిషనర్ వాదన అని, అసలు ఏమీ వినకుండానే కేసు కొట్టేస్తారా అని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు.

హైకోర్టులో వాదనలు పూర్తయిన తర్వాత డాక్యుమెంటు సమర్పించామన్న సాల్వే వాదనలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తప్పుపట్టారు. కేసు రిమాండ్‌లోనే మొత్తం విషయం ఉందని తెలిపారు. ఈ కేసులో రెండు అంశాలు పరిశీలిస్తున్నామని.. ఒకటి హైకోర్టు ముందు సీఐడీ దాఖలు చేసిన డాక్యుమెంట్.. 2018 జులై 5న దర్యాప్తు ప్రారంభమైందని చెప్పే డాక్యుమెంట్ అని జస్టిస్ బోస్ పేర్కొన్నారు. ఇక రెండోది.. హైకోర్టు ముందు వాదన వినిపించడానికి పిటిషనర్ అవకాశం కోల్పోయారా అనే అంశమని జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. దర్యాప్తు పేరుతో ఒక వ్యక్తిని ఇబ్బంది పెట్టడం చట్టం ఉద్దేశం కాదని సాల్వే అన్నారు. సెక్షన్ 17ఏ సవరణను అవినీతి నిరోధక చట్టం ఉద్దేశంతో చూడాలని, దాని ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు అక్రమాలకు పాల్పడకూడదని జస్టిస్ త్రివేది చెప్పారు. చట్టం ప్రధాన ఉద్దేశాన్ని పక్కనపెట్టి ఓ వ్యక్తికి మేలు జరిగేలా చట్టాన్ని విశ్లేషించుకోవడం ద్వారా చట్టం లక్ష్యాన్నే దెబ్బతీస్తుందని జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు.

ఈ కేసులో చంద్రబాబు పేరు సెప్టెంబరు 2023న చేర్చారని, 37వ నిందితుడిగా ఉన్న చంద్రబాబును ఏ1 అంటున్నారని సాల్వే ఆరోపించారు. దర్యాప్తు అధికారి ప్రకారం ఏ 37 (చంద్రబాబు) సూచనల మేరకు ఏ 36 నేరానికి పాల్పడ్డారని, ఇది అవినీతి నిరోధక చట్టానికి వర్తిస్తుందని చెప్పారని, అదే సమయంలో గవర్నర్ అనుమతి తీసుకొని ఉండాల్సిందని సాల్వే తెలిపారు. సెక్షన్ 17 ఏ సవరణను ఎలాగైనా చూడొచ్చని, అంతకు ముందు జరిగిన నేరాల సంగతేమిటని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. 17ఏ అనేది నేరం జరిగిన తేదీకే కానీ నిందితులకు కాదు కదా అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. సెక్షన్ 6ఏ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుపై ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పిన అంశాలు చూడాలని, ఇది కూడా 17ఏ సవరణ తరహాలో ఉందని జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు. ఒక ప్రజాప్రతినిధి సైకిలు దొంగతనం చేస్తే దాంట్లో జరిగిన అక్రమం తనకు కేటాయించిన విధులకు సంబంధించినదై ఉండాలని, అవినీతి నిరోధక చట్టం వర్తించరాదని సాల్వే పేర్కొన్నారు. అంటే సెక్షన్ పూర్తిగా కాకుండా పైపైన వర్తిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. ఈ కేసులో పరిపాలన పరమైన అంశాలు ఉన్నాయని, అభియోగాలు చూస్తే పది శాతం అడ్వాన్స్ నిధులు ముందే విడుదల చేశారని ఉందని జస్టిస్ బోస్ పేర్కొన్నారు. అరెస్టు చేసిన విధానం సరికాదు కాబట్టే సెక్షన్ 17ఏ పైనే వాదన చేస్తున్నామని సాల్వే పేర్కొన్నారు. మంగళవారం సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించనున్నారు.

బాబుకు మళ్లీ భంగపాటు

- స్కిల్ స్కాంలో బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ఏసీబీ కోర్టు
- సీఐడీ కస్టడీ పిటిషన్ కూడా తిరస్కరణ
- పీటీ వారెంట్లపై నేడు విచారణ



సాక్షి, అమరావతి : చంద్రబాబుకు ఏసీబీ కోర్టులో మరోసారి చుక్కెదురైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం తిరస్కరించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను బెదిరించి దర్యాప్తును ప్రభావితం చేస్తారనే సీఐడీ వాదనతో న్యాయస్థానం ఏకీభవించిన ఏసీబీ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. సర్వత్రా తీవ్ర ఆసక్తి కలిగించిన ఈ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు. ఈ కేసులో చంద్రబాబు గత నెల 10 నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు.. ఆయన బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సీఐడీ తీవ్రంగా వ్యతిరేకించింది.

వాడీవేడిగా వాదనలు..

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వరుసగా మూడ్రోజులపాటు ఇరుపక్షాల న్యాయవాదులు వాడీవేడిగా వాదనలు వినిపించారు. చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అలాగే, సీఐడీ తరఫున వాదనలు వినిపించిన ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ మంజూరు చేయవద్దని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఇప్పటికే ఈ కేసులో చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ విదేశాలకు పరారైన విషయాన్ని పొన్నవోలు ప్రస్తావించారు. గతంలో న్యాయస్థానం ఎదుట 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం ఇచ్చిన ఆర్థిక శాఖ రిటైర్డ్ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ఇటీవల అందుకు విరుద్ధంగా పలు టీవీ ఛానళ్లలో మాట్లాడడాన్ని కూడా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబు బెదిరింపులు, ఒత్తిడితోనే వారిద్దరూ పరారయ్యారని, పీవీ రమేశ్ మాట మార్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో.. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే ఇతర సాక్షులను కూడా బెదిరించి దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని పొన్నవోలు వివరించారు. ఇరుపక్షాల వాదనలను విని తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. బెయిల్ కోసం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు 44 పేజీల తీర్పును వెలువరించారు.

పీటీ వారెంట్లపై విచారణ వాయిదా..

ఇక ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్‌నెట్ కేసుల్లో చంద్రబాబును అరెస్టుచేసి విచారించేందుకు పీటీ వారెంట్లను అనుమతించాలన్న సీఐడీ పిటిషన్లపై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం వాడీవేడిగా వాదనలు సాగాయి. పీటీ వారెంట్లపై రైట్ టు ఆడియన్స్ పిటిషన్ వేశాం కాబట్టి తమ వాదనలు వినాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు పట్టుబట్టారు. దీనిపై సీఐడీ తరఫు న్యాయవాది వివేకానంద అభ్యంతరం వ్యక్తంచేశారు. పీటీ వారెంట్లపై న్యాయస్థానం ఆదేశాలు సరిపోతాయన్నారు. ఈ అంశంపై న్యాయమూర్తి లేవనెత్తిన సందేహాలకు సీఐడీ తరఫు న్యాయవాది సమాధానాలు ఇస్తుండగా.. చంద్రబాబు తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ సీఐడీ న్యాయవాదులు న్యాయస్థానాన్ని శాసిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. న్యాయస్థానాన్ని ఎవరూ శాసించలేరని స్పష్టంచేస్తూ చంద్రబాబు న్యాయవాదులు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. ఇలా అయితే ఈ కేసులను విచారించలేనని.. స్పెషల్ కోర్టుకో వేరే వారికో బదిలీ చేయాలని రిజిస్ట్రీకి చెబుతానన్నారు. దీంతో చంద్రబాబు తరఫు న్యాయవాదులు వెనక్కి తగ్గారు. ఈ కేసులో ఇరుపక్షాల వాదనలకు అవకాశం ఇచ్చేందుకు కేసు విచారణను న్యాయమూర్తి మంగళవారానికి వాయిదా వేశారు.

మళ్లీ కస్టడీకి నిరాకరణ..

మరోవైపు.. చంద్రబాబును మరోసారి విచారించేందుకు కస్టడీకి అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి తిరస్కరించారు. గతంలో ఇచ్చిన రెండు రోజుల కస్టడీలో విచారణకు సహకరించలేదు కాబట్టి ఆయన్ని మరోసారి విచారించేందుకు మూడ్రోజుల కస్టడీకి అనుమతించాలని సీఐడీ కోరింది. జ్యుడీషియల్ కస్టడీ 15 రోజుల గడువు ముగిసినందున మరోసారి కస్టడీకి ఇవ్వొద్దని చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చంద్రబాబును కస్టడీకి అప్పగించాలన్న పిటిషన్‌ను తిరస్కరించింది.

ఆ నియామకాలతో మోడల్ స్కూల్స్‌కు సంబంధం లేదు

సాక్షి, అమరావతి: ఏపీ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగ భర్తీలు జరగడంలేదని ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఏపీలో పీపీపీ (ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య) మోడల్ స్కూల్స్‌లో వివిధ కాంట్రాక్టువల్ టీచర్స్ రిక్రూట్‌మెంట్' అంటూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న నోటిఫికేషన్‌కు ఏపీ మోడల్ స్కూళ్లకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉద్యోగాలు ఏపీ మోడల్ స్కూళ్లవని చెప్పి నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి అబద్ధపు, మోసపూరిత ప్రచారాలను నమ్మి నిరుద్యోగ అభ్యర్థులు డబ్బులు పోగొట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

అందమైన మనసులో ఇంత అలజడెందుకో

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

- మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కుగా ఈ ఏడాది ప్రచారం
- యాంత్రిక జీవనంలో పెరుగుతున్న మానసిక సమస్యలు
- సహచరుల కంటే ఫోన్లు, కంప్యూటర్లతోనే కాలం గడుపుతున్న జనం
- సమాజంలో స్వకీయంగా గడిపే వారి సంఖ్యే ఎక్కువ
- మానసిక ఉల్లాసంపై దృష్టి సారించాలంటున్న నిపుణులు
- సంతృప్తికర జీవనం సాగించాలంటున్న వైద్యులు





లబ్బీపేట (విజయవాడ తూర్పు): మనిషి యంత్రంలా మారాడు. నిద్ర లేచింది మొదలు ఉరుకులు.. పరుగుల జీవితానికి అలవాటు పడ్డాడు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చాకా సెల్‌ఫోన్లు, టీవీలు చూస్తూ కాలం గడిపేస్తున్నాడు. నలుగురు కలిసి కూర్చుని చెప్పుకునే ముచ్చట్లు లేవు. కుటుంబ సభ్యులంతా కలిసి ఒకేసారి భోజనం చేసే పరిస్థితులు అంతకంటే లేవు. భార్యాభర్తలిద్దరూ ఇంట్లో ఉన్నా చెరో వైపు కూర్చుని ఫోన్లు, లాప్‌టాప్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. మరోవైపు ఆశ, అత్యాశ పెరిగిపోయి జీవితంలో సంతృప్తి అనేది లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల కారణంగా ప్రజల్లో విపరీతంగా మానసిక సమస్యలు పెరిగిపోయాయి. ఒత్తిళ్లు, డిప్రెషన్ అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. ఈ ఏడాది ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కుగా ప్రకటించింది.

మానసిక ఆరోగ్యంపై దృష్టి ఏదీ

ఆర్థిక ఇబ్బందులతో కొందరు తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటుండగా, ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో విశ్రాంతి లేని జీవనం సాగిస్తూ అనేక మంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. ఆశ, అత్యాశలు బాగా పెరిగిపోయాయి. మనిషి జీవితంలో సంతృప్తి అనేది లేకుండా పోయింది. పిల్లల ఆకాంక్షలు తెలుసుకోకుండా డాక్టర్ కావాలి, ఐఏఎస్ కావాలని రూ.లక్షలు ఖర్చుచేసి ఆ కోర్సుల్లో చేర్పుతుంటే.. అక్కడ ఒత్తిళ్లు తట్టుకోలేక మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. వారంతా శారీరక అనారోగ్యాలకు తక్షణమే చికిత్స పొందుతున్నారు కానీ.. మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదు. మానసికంగా ఉల్లాసంగా ఉండాలనే ఆలోచనే చేయడం లేదు.

ఆత్మీయ, అనురాగాలేవి

ఒకప్పుడు గ్రామాల్లో, పట్టణాల్లో జనం సమూహాలుగా ఒకచోట చేరి పిచ్చాపాటీ మాట్లాడుకునే వారు. ఉమ్మడి కుటుంబాల్లో సాయంత్రం వేళ ఇంట్లోని వారంతా కలిసి కబుర్లు చెప్పుకునే వారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ఉదయం నుంచి నిద్రించే వరకూ స్మార్ట్ ఫోన్ లేనిదే నిమిషం గడవడం లేదు. ఏదైనా సమాచారం చెప్పాలన్నా.. తెలుసుకోవాలన్నా చాటింగ్‌లోనే. కనీసం కలిసి మాట్లాడుకునే పరిస్థితి లేదు. బంధువులు, ఆత్మీయుల కలయికలు కూడా చాలా తక్కువగానే ఉంటున్నాయి. వివాహాలు, ఇతర ఫంక్షన్లకు ఒకప్పుడు రెండు మూడు రోజుల ముందే వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కల్యాణ మండపం వద్దకు రావడం.. కొద్దిసేపు ఉండి వెళ్లిపోవడం జరుగుతోంది. ఇలా ఆత్మీయ , అనుబంధాలు అంతరించి పోవడం కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

మానసిక ప్రశాంతతోనే ఆరోగ్యం

ప్రస్తుతం రక్తపోటు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు పెరిగిపోతున్నాయి. మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న వారిలో ఈ సమస్యలు మరింత అధికమయ్యే అవకాశం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొనే వారిలో రక్తపోటు, మధుమేహం అదుపులో ఉండదని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా నిద్రలేమి వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని.. ఫలితంగా గుండెపోటు, మెదడు పోటుకు దారి తీయవచ్చునంటున్నారు. మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలుగుతాడని వైద్యులు అంటున్నారు.

పాజిటివ్‌గా ముందుకు సాగాలి



ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ప్రతి ఒక్కరూ మానసిక ఉల్లాసంపై దృష్టి సారించాలి. సెల్‌ఫోన్లు, టెక్నాలజీని అవసరం మేరకే వాడాలి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా దృష్టి సారించాలి. ఆత్మీయులు, సన్నిహితులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ప్రతిరోజూ కొంత సమయం గడపటం ద్వారా ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చు. యోగా, మెడిటేషన్, వ్యాయామంపై దృష్టి పెట్టాలి.

– డాక్టర్ వి.రాధికారెడ్డి,
మానసిక వైద్యురాలు, రిజిస్ట్రార్, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ

ఆ ధర్నాలతో వీవోఏలకు ఎలాంటి సంబంధం లేదు

- వీవోఏలతో ప్రత్యక్షంగా సంబంధం లేని కొన్ని సంఘాల కుట్ర ఇది
- జగన్ ప్రభుత్వం వీవోఏల అన్ని సమస్యలనూ పరిష్కరిస్తోంది..
- ఆ ధర్నాల్లో వీవోఏలు పాల్గొన వద్దు : ఏపీ వైఎస్సార్ క్రాంతి పథకం వీవోఏల సంఘం

సాక్షి, అమరావతి : వీవోఏల అనేక సమస్యలపై గతంలో మరే ప్రభుత్వమూ స్పందించనంత సానుకూలంగా జగన్ ప్రభుత్వం స్పందించి, వాటిని పరిష్కరించిందని ఏపీ వైఎస్సార్ క్రాంతి పథకం వీవోఏల సంఘం ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే వారితో ప్రత్యక్షంగా సంబంధం లేని కొన్ని సంఘాలు తమ స్వార్థం కోసం వీవోఏల పేరుతో ధర్నాలు చేసేందుకు సిద్ధమయ్యాయని.. వాటిని వైఎస్సార్ క్రాంతి పథకంలోని వీవోఏలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు వై.ప్రభుదాసు, యూనియన్ సభ్యులు నాని, బసవరాజు, ఏసురత్నం, చంద్రశేఖర్, వనజ, రవికుమార్, పద్మ తదితరులు సోమవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. వీవోఏలకు గతంలో కేవలం రూ.3 వేలు మాత్రమే వేతనం అని, అదీ సక్రమంగా వచ్చేది కాదని.. సీఎంగా జగన్ వచ్చాక రూ.10 వేలకు పెంచారని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను జగన్ ప్రభుత్వంలో మన సంఘం ద్వారా పరిష్కరించుకోగలిగామని గుర్తుచేశారు. మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ అమలు కాకుండా ఆపివేయించుకున్నామని, గ్రామ సమాఖ్యల విలీనం సర్క్యులర్‌ను నిలుపుదల చేయించుకున్నామని, 15 సంఘాలున్నా గ్రామ సమాఖ్యలో పనిచేసే వీవోఏలకు వేతనాలు అందజేసేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించుకున్నామని, గతంలోలా కాకుండా వేతనాలు నెల నెలా వచ్చేలా చేసుకున్నామని గుర్తుచేశారు. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయా.. లేదా.. అనేది ప్రతి ఒక్క వీవోఏ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. వీవోఏల సమస్యలన్నీ సీఎం జగన్ పరిష్కరిస్తుంటే.. కొన్ని యూనియన్‌లు ప్రభుత్వం – వీవోఏల మధ్య విద్వేషాలు సృష్టించేలా, వీవోఏల మీద చెడు అభిప్రాయం కలిగించేలా కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. వీవోఏలకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని, మిగిలిపోయిన ఇతర సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామంటూ వీవోఏలకు ఆయన పిలుపునిచ్చారు. మంగళ, బుధవారాల్లో ఆయా సంఘాలు చేపట్టిన ధర్నాల్లో వీవోఏలు పాల్గొనవద్దని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంలో ఏపీ దిక్సూచి

- దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధుల బృందంతో సీఎస్ జవహర్‌రెడ్డి
- రాష్ట్రంలో ప్రకృతి సాగుపై విదేశాల బృందం సంతృప్తి
- అగ్రో ఎకో 2050 స్టడీ నివేదిక ముఖ్యాంశాలు సీఎస్ దృష్టికి



అమరావతి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 2050 నాటికి పారిశ్రామిక, వ్యవసాయ, అగ్రో ఎకాలజీ విధానాల్లో కలిగే వ్యత్యాసాలను పరిశీలించేందుకు దక్షిణాఫ్రికా దేశాలకు చెందిన ప్రతినిధి బృందం నాలుగు సంవత్సరాల పాటు రాష్ట్రంలో అంతర్జాతీయ స్టడీ నిర్వహించింది. ఈ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి అధ్యయన నివేదికలోని ముఖ్యాంశాలను వివరించింది. ఈ నివేదికను ఈ నెల 11న ఢిల్లీలో నీతి ఆయోగ్ వ్యవసాయ సభ్యుడు ప్రొఫెసర్ రమేశ్‌చంద్ర విడుదల చేస్తారు. రాష్ట్రంలో మూడు రోజులు పర్యటించిన దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధుల బృందం ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతపురం జిల్లాలోని యగ్నిషెట్టిపల్లి, గంటాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్, కూరగాయల మోడల్ తదితర వ్యవసాయ పద్ధతుల్ని పరిశీలించిన రువాండా, సెనెగల్, మలావి, బెన్నిస్, ట్యునీషియా, మడగాస్కర్, జాంబియా దేశాలకు చెందిన ప్రతినిధులు సీఎస్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కొంతమేర నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఆహార ఉత్పత్తి విధానాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి దిక్సూచి కానుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సమగ్ర సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని చెప్పారు. వివిధ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని అంతర్జాతీయ స్టడీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. విభిన్న పరిస్థితుల్లో 2050 నాటికి వ్యవసాయం, ఆహారం, పర్యావరణం, ఉపాధి అవకాశాలు, సంక్షేమం తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ఎలా ఉంటుందనేది ఈ నివేదిక వివరిస్తోందని చెప్పారు. పారిశ్రామిక వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం.. రెండింటిలో ఎలాంటి ప్రయోజనాలు, ఇబ్బందులు ఎదురవుతాయనే విషయాన్ని ఈ నివేదిక తెలుపుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రైతు సాధికారసంస్థ ఉపాధ్యక్షుడు టి.విజయకుమార్ మాట్లాడుతూ ఈ అధ్యయనం 2019లో మొదలైందని చెప్పారు. ఇప్పటివరకు ఏడు వర్చువల్ వర్క్‌షాపులు నిర్వహించారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఈ విధమైన అధ్యయనం జరగడం ఇదే మొదటిసారి అని ఆయన చెప్పారు.

ఈనాడు ఆరోపణలు అవాస్తవం

- ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల ఎంపానల్‌మెంట్ పూర్తి పారదర్శకం
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో



ముడుపులు అందితేనే ఆసుపత్రులకు 'ఆరోగ్యశ్రీ'

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆస్పత్రుల ఎంపానల్‌మెంట్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ముడుపులు అందితేనే ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ అంటూ ఈనాడులో సోమవారం ప్రచురించిన కథనంలో చేసిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. ఎంపానల్‌మెంట్ అవడానికి నిర్దేశించిన సదుపాయాలున్న ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పోర్టల్ అందుబాటులో ఉండే ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆ దరఖాస్తుల్ని నిర్ణీత సమయపాలనతో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎంపానల్‌మెంట్ ప్రక్రియలో మాన్యువల్ ప్రమేయం ఏమీ ఉండదని పేర్కొన్నారు. ఏవైనా లోపాలుంటే ఆ వివరణలతో ఆన్‌లైన్‌లోనే ఆస్పత్రులకు నోటీసులు వెళతాయని తెలిపారు. ఇక రోగులకు వైద్య సేవల కోసం ముందస్తు అనుమతులు (ప్రీ ఆథరైజేషన్), క్లెయిమ్‌లు ఆన్‌లైన్‌లో వివిధ స్థాయిల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి ఆస్పత్రులను, వైద్యసేవలకు సంబంధించి ప్రజలను ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే నేరుగా 104 (ఆరోగ్యశ్రీ ఫిర్యాదుల నంబరు), 14400 (అవినీతి నిరోధక విభాగం) నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఆస్పత్రుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పరిష్కార సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల యాజమాన్యాలు సమస్యలను cgro@aarogyasri.ap.gov.in కు మెయిల్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచంతో పోటీ పడండి

పెద్ద పెద్ద కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. దీనికి చదువు ఒక్కటే మార్గం

- ప్రపంచంలో 350 టాప్ కాలేజీల్లో సీటు తెచ్చుకోండి
- ప్రభుత్వమే మిమ్మల్ని చదివిస్తుంది
- రూ.1.25 కోట్ల వరకు ఫీజును చెల్లిస్తాం
- అమెరికా వెళ్లొచ్చిన ప్రభుత్వ విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్
- జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా ఉచిత శిక్షణ ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- మీ గొప్ప విజన్ వల్లే అమెరికా వెళ్లగలిగామని కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



అమెరికా వెళ్లి వచ్చిన విద్యార్థులతో సమావేశమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రపంచంతో పోటీపడితేనే మన బతుకులు మారతాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. పేదరికం సమసిపోవాలంటే దానికి విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సదస్సులో పాల్గొనడానికి 10 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గతనెలలో 15 రోజులపాటు అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతా సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అమెరికా పర్యటన ద్వారా గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లడానికి మీకు ఆ అనుభవాలు ఉపయోగపడతాయి. ప్రపంచస్థాయికి ఎదగాలన్న కోరిక మీకు మరింత గట్టిపడుతుంది. ఈ పర్యటన మీ మనసులో ఒక ముద్ర వేస్తుంది. ప్రపంచం ఎలా ఉంది? మనం ఎక్కడ ఉన్నాం? ఎంత వెనుకబడి ఉన్నాం? అనేది అర్థమవుతుంది. ప్రపంచం వేగంగా పరుగులు తీస్తోంది. మనం చాలా వెనుకబడి ఉన్నాం.. ప్రపంచంతో మనం పోటీ పడి నిలబడాలి. అప్పుడే మన బతుకులు మారతాయి. ఇందుకు చదువు ఒక్కటే సాధనం' అని విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. విద్య అనే సాధనం ద్వారా పెద్ద పెద్ద కలలను కనాలని సూచించారు. ఆ కలల నుంచే వాస్తవాలు సాకారం అవుతాయన్నారు.

ఇప్పటి నుంచే తెలుసుకోవాలి..

విద్యార్థులు చూసిన కొలంబియా యూనివర్సిటీ లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 350 కాలేజీల్లో 21 కోర్సుల్లో సీటు సాధిస్తే ప్రభుత్వమే చదివిస్తుందని సీఎం జగన్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సంబంధిత కాలేజీల్లో ఫీజులు రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి వరకూ ఉంటాయన్నారు. వీటిలో సీటు తెచ్చుకుంటే జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా రూ.1.25 కోట్ల వరకు ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 'సీఈవో వంటి స్థాయికి వెళ్లాలంటే ప్రతిభ, నైపుణ్యం ఉండాలి. మనం చదివే చదువులవల్లే ఇవి వస్తాయి. ప్రపంచ అత్యుత్తమ కాలేజీల్లో చదువుకోవడం ద్వారా మీ నైపుణ్యానికి మంచి గుర్తింపు లభిస్తుంది. అప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీలు మీకు మంచిస్థానాల్లో ఉద్యోగాలు కల్పిస్తాయి. తద్వారా మీ జీవితాలు మారతాయి. అలాంటి కాలేజీల్లో విద్యాభ్యాసం కోసం, సీటు సాధించేందుకు మీరు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి' అని సీఎం జగన్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 'మీకు ఆసక్తి ఉన్న కోర్సు ఏంటి? ప్రపంచంలో ఈ కోర్సును అందిస్తున్న అత్యుత్తమ కాలేజీలు ఎక్కడ ఉన్నాయి?' అనేది ఇప్పటి నుంచే తెలుసుకోవాలని సూచించారు. ఆ కాలేజీల్లో సీటు రావాలంటేం ఏయే పరీక్షల్లో ఎన్ని మార్కులు రావాలో కూడా తెలుసుకోవాలన్నారు. జీమ్యాట్, జీఆర్ఈ, టోఫెల్ వంటి పరీక్షలు ఏమున్నాయో.. వాటికి ఎలా సన్నద్ధం కావాలో తెలియాలన్నారు.

జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా ఉచిత శిక్షణ

టోఫెల్‌కు ఎలా తీసుకువచ్చామో.. అలాగే జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా మెటీరియల్, ఉచిత శిక్షణను విద్యార్థులకు అందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. విదేశీ విద్యాదీవెన ద్వారా సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. కొలంబియా యూనివర్సిటీ, వార్టన్, ఎల్ఎస్ఈ, ఇన్‌సీడ్.. ఇలాంటి యూనివర్సిటీలు, కాలేజీలు 350 ఉన్నాయని.. వీటిలో సీటు సాధించాలని హితబోధ చేశారు. ఆ కాలేజీల్లో కోర్సులు పూర్తి చేశాక విద్యార్థుల జీవితాల్లో మంచి మార్పులు వస్తాయన్నారు. ఇది సాకారమైతే మీ, మీ కుటుంబాల బతుకులు మారడమే కాకుండా రాష్ట్ర ప్రతిష్టను కూడా పెంచినవారవుతారన్నారు. అంతేకాకుండా మీ స్థాయిలో మరో పది మందికి సహాయపడొచ్చని విద్యార్థులకు సీఎం హితబోధ చేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు ఓ ఐఏఎస్ అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. 'ఇక్కడున్న ఈ పిల్లలు చిన్నప్పుడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని కలలు కని ఉంటారు.. చాలా మందికి సీట్లు వచ్చాయి. ఆ విజన్ అక్కడితో పూర్తయ్యింది. ఇప్పుడు ట్రిపుల్ ఐటీ నుంచి తర్వాత ఎక్కడికి అనేది విజన్ కావాలి' అని సీఎం పేర్కొన్నారు.

పాఠ్య ప్రణాళికలోకి 1,800 సబ్జెక్టులు

మన పాఠ్యప్రణాళికలో లేని 1,800 సబ్జెక్టులను పాఠ్యప్రణాళికలోకి తెస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఎంఐటీ, హార్వర్డ్ వంటి యూనివర్సిటీ నిపుణులతో తయారు చేయించిన సబ్జెక్టులను మన విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎడెక్స్‌తో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. ఈ కోర్సులు చేసిన వారికి జాయింట్ సర్టిఫికేషన్ కూడా లభిస్తుందన్నారు. ఈ కోర్సులు నేర్చుకోవాలని.. దీనివల్ల ఉపయోగం ఉంటుందని విద్యార్థులకు సూచించారు. 'మీరు ఇలా విదేశాలకు వెళ్లి బయటి ప్రపంచం చూసినప్పుడు మరింత కష్టపడాలన్న స్ఫూర్తి మీలో కలుగుతుంది. ఈ పర్యటన మీకు మాత్రమే కాకుండా, మీ వల్ల ఇతరులకు కూడా స్ఫూర్తి కలిగిస్తుంది. ఒక స్థాయిలో ఉన్న మనం బాగా కష్టపడటం ద్వారా మరో స్థాయికి చేరుకుంటాం. మన కష్టమే మనల్ని పై స్థానాలకు తీసుకెళుతుంది. మీ అందరికీ అభినందనలు' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

పర్యటన ఎలా జరిగింది?

అమెరికాలో పర్యటించిన విద్యార్థులు శివలింగమ్మ, చంద్రలేఖ, గణేశ్, జ్యోత్స్న, రాజేశ్వరి, గాయత్రి, రిషితారెడ్డి, యోగీశ్వర్, షేక్ అమ్మాజాన్, మనస్వినిలతోపాటు వారి తల్లిదండ్రులను అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. ఐక్యరాజ్యసమితి, వరల్డ్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), కొలంబియా యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. 'ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 126 మంది విద్యార్థులను గుర్తించి వారికి పోటీపరీక్ష నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల భాషా పరిజ్ఞానాన్ని పరిశీలించి అమెరికా పర్యటనకు 10 మందిని ఎంపిక చేశామని సీఎంకు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం.. అమెరికా పర్యటన ఎలా జరిగిందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్, పాఠశాలల మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజనం డైరెక్టర్ నిధి మీనా, ఉత్తర అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్, ఐక్యరాజ్యసమితి సభ్యులు ఉన్నవ షకిన్ కుమార్, మంగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



ఇంత చిన్న వయసులో అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. నేను మహిళా సాధికారత, బాలికా విద్యపై ప్రసంగించాను. మీ విజన్ వల్ల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మాకు చక్కటి అవకాశం కల్పించారు.. థ్యాంక్యూ సార్.

– రాజేశ్వరి, విద్యార్థిని

అంతర్జాతీయ వేదికలపై మాట్లాడే అవకాశమిచ్చారు..



మాకు అంతర్జాతీయ వేదికలపై మాట్లాడే అవకాశం కల్పించారు. విద్యా వ్యవస్థలో మీరు తీసుకొచ్చిన మార్పులన్నీ వివరించాం. మేం విమానం ఎక్కుతామని కలలో కూడా అనుకోలేదు.. కానీ మీరు సాధ్యం చేశారు. మీరు చెప్పిన 'వన్ చైల్డ్.. వన్ టీచర్.. వన్ పెన్.. వన్ బుక్.. కెన్ చేంజ్ ద వరల్డ్' మాటకు తిరుగులేదు.. మీ నమ్మకాన్ని నిలబెడతాం సార్.

– అల్లం రిషితారెడ్డి, విద్యార్థిని

యూఎన్‌వోను మీ వల్ల నిజంగా చూడగలిగా..



నేను యూఎన్‌వో గురించి సోషల్ బుక్స్‌లో చదువుకున్నాను. దాన్ని మీ వల్ల నిజంగా చూడగలిగాను. థ్యాంక్యూ సార్. ఏపీలో క్వాలిటీ ఎడ్యుకేషన్ ఎలా అందుతుందనేది నేను అమెరికాలో వివరించాను.

– వంజివాకు యోగీశ్వర్, విద్యార్థి

ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిలబెట్టారు..



కొలంబియా యూనివర్సిటీలో జరిగిన ఎకో అంబాసిడర్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నా. డిజిటల్ ఎడ్యుకేషన్ వంటి అనేక అంశాలపై మాట్లాడాను. అక్కడంతా ఆశ్చర్యపోయారు. మేం ఈ రోజు ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నిలబెట్టారు.

– సామల మనస్విని, విద్యార్థిని

మీ గొప్ప ఆలోచన వల్లే..



విద్యావ్యవస్థలో చాలా మంచి మార్పులు తెచ్చారు. మీ గొప్ప ఆలోచన వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ రోజు మన రాష్ట్రం గొప్ప స్థాయిలో ఉందంటే అది మీ వల్లే. థ్యాంక్యూ సీఎం సార్.

– షేక్ అమ్మాజాన్, విద్యార్థిని

వేసవిలో 'ఉపాధి'కి కసరత్తు

- 2024–25లో ఉపాధి పనుల కోసం లేబర్ బడ్జెట్ అంచనాల తయారీ మొదలు
- అక్టోబరు 2 నుంచి డిసెంబర్ 31 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- సిద్ధం చేసిన లేబర్ బడ్జెట్‌ను అనుమతి కోసం కేంద్రానికి పంపనున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: పేదలకు వచ్చే వేసవిలో కూడా సొంత ఊళ్లలోనే పెద్ద ఎత్తున పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులను గుర్తించే ప్రక్రియను చేపట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌పై అన్ని గ్రామాల్లో కసరత్తు మొదలైంది. గత మూడేళ్లుగా గ్రామాల వారీగా ఉపాధి పథకం పనులకు వచ్చిన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంత మందికి ఈ పథకం ద్వారా పనులు కల్పించాలన్న అంచనాలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఇప్పటికే కలెక్టర్లతో పాటు డ్వామా పీడీలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో అక్టోబర్ 2 నుంచి ఈ ప్రక్రియ మొదలయ్యింది. గతంలో చేపట్టి ఇప్పటికీ పూర్తి కాని పనులను 20వ తేదీ కల్లా ఉపాధి హామీ పథకం సిబ్బంది సందర్శించి సమీక్షిస్తారు. నవంబర్ 10కల్లా గ్రామాల్లో అదనంగా చేపట్టే కొత్త పనులను గుర్తిస్తారు. నవంబర్ 15కల్లా ఆయా గ్రామాల్లో ఎంత మందికి ఎన్ని పనిదినాలు కల్పించాలన్న వివరాలతో లేబర్ బడ్జెట్‌ను రూపొందించి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 మధ్య.. కొత్తగా గుర్తించిన పనులకు సంబంధించి గ్రామ సభలో చర్చించి అనుమతి తీసుకుంటారు. అవసరమైతే మండల, జిల్లా స్థాయిలో కూడా అనుమతులు తీసుకునే ప్రక్రియను చేపడతారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంత మందికి పనులు కల్పించాలనే వివరాలను గుర్తించి.. అందుకు అవసరమయ్యే పనులకు కలెక్టర్ల ద్వారా అనుమతి తీసుకునే ప్రక్రియను డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తారు. గ్రామాల వారీగా తయారు చేసిన ఈ అంచనాలతో రాష్ట్ర స్థాయిలో ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌ను రూపొందించి.. దానిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అనుమతికి పంపిస్తామని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, కొత్త పనుల గుర్తింపులో కనీసం 60 శాతం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల పనులకు ప్రాధాన్యత ఉంటుందని అధికారులు తెలిపారు.

గ్రామాల వారీగా కమిటీలు..

2024–25 ఆర్థిక ఏడాదికి సంబంధించిన లేబర్ బడ్జెట్ అంచనాల తయారీ, కొత్త పనుల గుర్తింపు కోసం గ్రామాల స్థాయిలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, వ్యవసాయ, ఉద్యానవన, సెరీకల్చర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు, పొదుపు సంఘాల గ్రామ స్థాయి లీడర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లను ఈ కమిటీల్లో సభ్యులుగా నియమించారు. మండల స్థాయి అధికారులు ఈ గ్రామ కమిటీలకు తగిన సహకారం అందజేస్తారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
10-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
483	141
65,512	19,512

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,469	△	36
డోజోన్స్	33,561	△	154
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,492	▽	2
డాక్స్	15,128	▽	102
షాంఘై	3,097	▽	14
నికాయ్ (శుక్రవారం ముగింపు)	30,995	▽	81

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	57,332
బంగారం (22 క్యారట్)	57,102
వెండి (కేజీ)	68,493

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.98	103.31
€	యూరో	ఒకటి	86.38	89.46
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.00	56.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.87	54.16
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.95	61.88
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.77	23.57
¥	చైనా యువాన్	ఒకటి	10.30	12.37

మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు విదేశీ శక్తుల కుట్ర

అదానీ గ్రూప్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: సుప్రీం కోర్టులో తమ కేసు వచ్చే వారం విచారణకు రానున్న నేపథ్యంలో తమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొన్ని విదేశీ శక్తులు కుట్రలను కొనసాగిస్తున్నాయని అదానీ గ్రూప్ ఆరోపించింది. బొగ్గు దిగుమతులకు సంబంధించిన పాత, నిరాధార ఓవర్-ఇన్వాయిసింగ్ ఆరోపణలను పదే పదే ప్రచారం చేసి గ్రూప్‌ను ఆర్థికంగా అస్థిరపర్చేందుకు ఒక విదేశీ ప్రచురణ సంస్థ ప్రయత్నిస్తోందని ఒక ప్రకటనలో పేర్కొంది. 2016లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) జారీ చేసిన ఒక సర్క్యులర్ ఆధారంగా తమపై కథనాన్ని ప్రచురించబోతోందని అదానీ గ్రూప్ వివరించింది. అప్పటి డీఆర్‌ఐ సర్క్యులర్‌లో 40 పైచిలుకు దిగుమతిదార్ల పేర్లు ఉండగా కేవలం తమ కంపెనీని మాత్రమే లక్ష్యంగా ఎంచుకుందని పేర్కొంది. ఇన్వాయిస్‌ను పెంచి చూపిన కేసులో డీఆర్‌ఐ సుప్రీం కోర్టుకు వెళ్లగా.. అక్కడా తమకు అనుకూలంగానే తీర్పు వచ్చిందని వివరించింది. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్ల ధరల్లో అవకతవకలపై సెబీ నిర్వహించిన దర్యాప్తుపై సుప్రీం కోర్టు ఈ వారంలో విచారణ చేపట్టనున్న నేపథ్యంలో గ్రూప్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

రిలయన్స్ జువెల్స్ నుంచి 'స్వర్ణ బంగా' కలెక్షన్



న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా రిలయన్స్ జువెల్స్ 'స్వర్ణ బంగా' కలెక్షన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రిలయన్స్ ఆభరణాల శ్రేణిలో ఈ ఎనిమిదో కలెక్షన్‌ను బాలీవుడ్ నటి కరిష్మ కపూర్ ఆవిష్కరించారు. 'బెంగాలీలకు ఒక కావ్యాత్మక బహుమతి ఈ స్వర్ణ బంగా కలెక్షన్. టెర్రకోట సూక్ష్మత్వం, శాంతినికేతన్ నిర్మలత్వం, దుర్గాదేవీ పూజ సంబరం ప్రేరణలతో వీటిని రూపొందించాము. తప్పక కస్టమర్ల ఆదరణ పొందుతుంది' అని సంస్థ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు. సాంస్కృతిక సంపద, ఆత్మ సౌందర్యం, శోభను కోరుకునే ప్రతి ఒక్కరికి ఈ కలెక్షన్‌ను సిఫార్సు చేస్తానని కరిష్మా కపూర్ అన్నారు. స్వర్ణ బంగా కలెక్షన్ అన్ని రిలయన్స్ జువెల్స్ స్టోర్లలో లభ్యమవుతుంది.

రత్నాలు-ఆభరణాల వాణిజ్యంపై ఎఫెక్ట్

- ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణలపై నిపుణుల అంచనా
- మొత్తం వాణిజ్య విలువ దాదాపు 12 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ వివాదం భారత్-ఇజ్రాయెల్ మధ్య రత్నాలు, ఆభరణాల వ్యాపారంపై ప్రభావం చూపుతుందని ఎగుమతిదారులు సోమవారం తెలిపారు. 2021-22లో భారత్ రెండు దేశాల మధ్య రత్నాలు, ఆభరణాల వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లు. 2022-23లో ఈ విలువ 2.04 బిలియన్ డాలర్లుగా ఉంది. కట్, పాలిష్డ్ వజ్రాలు భారతదేశం నుండి ఇజ్రాయెల్‌కు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. తర్వాతి స్థానంలో ల్యాబ్‌లో రూపొందించిన వజ్రాల వాటా ఉంది. ఇక ఇజ్రాయెల్ నుంచి భారత్ ప్రధానంగా కఠిన (రఫ్) వజ్రాలను దిగుమతి చేసుకుంటోంది. 2022-23లో సరుకులు, సేవల రంగాలలో మొత్తం భారతదేశం-ఇజ్రాయెల్ వాణిజ్యం దాదాపు 12 బిలియన్ డాలర్లుగా అంచనా. 2022-23లో ఇజ్రాయెల్ నుండి భారత్‌కు జరిగిన ఒక్క సరుకు ఎగుమతుల విలువ 8.4 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ 2.3 బిలియన్ డాలర్లు. వెరసి ఇది 6.1 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులుకు దారితీసింది. ఇజ్రాయెల్‌కు భారత్ ఎగుమతుల్లో డీజిల్, కట్, పాలిష్డ్ వజ్రాలు ఉన్నాయి. దిగుమతుల్లో రఫ్ డైమండ్స్, కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్, ఎలక్ట్రానిక్స్, టెలికం పరికరాలు, పొటాషియమ్ క్లోరైడ్, హెర్బిసైడ్‌లు ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో భారత్ వాణిజ్యం ఎక్కువగా ఎర్ర సముద్రంలో ఉన్న ఈలాట్ నౌకాశ్రయం ద్వారా జరుగుతోంది.

నిపుణులు ఏమన్నారంటే...



ఇజ్రాయెల్‌కు భారత ఎగుమతులపై తాజా పరిణామాల ప్రతికూల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ తీవ్ర ప్రతికూల ప్రభావానికి గురికావచ్చు. రఫ్ వజ్రాలకు దేశంలో కొరత ఏర్పడే వీలుంది.

– కొలిన్ షా, కామా జ్యువెలరీ ఎండీ



ఇజ్రాయెల్‌లోని మూడు అతిపెద్ద నౌకాశ్రయాలు - హైఫా, అష్డోడ్, ఈలత్‌లలో కార్యకలాపాలు అంతరాయం కలిగితే ఆ దేశంతో భారత్ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎగుమతులకు ప్రతికూల పరిణామం ఇది.

– అజయ్ శ్రీవాస్తవ, జీటీఆర్‌ఐ సహ వ్యవస్థాపకులు



ఈ వివాదం స్వల్పకాలంలో భారతీయ ఎగుమతిదారులపై ప్రభావం చూపుతుంది. యుద్ధం తీవ్రతరం అయితే, ఆ ప్రాంతానికి ఎగుమతులు జరిపే ఎగుమతిదారులకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకావచ్చు.

– శరద్ కుమార్ సరాఫ్, టెక్నోక్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్

ఫార్మాపై ప్రభావం తక్కువే!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పాలస్తీనా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావం భారత ఫార్మాపై పడే అవకాశం లేదని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అభిప్రాయపడింది. దేశం నుంచి ఇజ్రాయెల్‌కు 2022-23లో ఎగుమతైన ఔషధాల విలువ రూ.766 కోట్లు. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 50 శాతం కంటే అధికం. దేశీయ మార్కెట్ నుంచి బల్క్ డ్రగ్స్ (ఏపీఐ), డ్రగ్ ఫార్ములేషన్స్, బయాలాజిక్స్ ఆ దేశానికి సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ముఖ్యంగా ఫార్మా రంగంలో వాణిజ్యం తక్కువగా ఉన్నందున.. ఫార్మాస్యూటికల్ వ్యాపారంపై పెద్దగా ప్రభావం కనిపించడం లేదని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. 'ఔషధ తయారీ రంగంలో ఇజ్రాయెల్ బలంగా ఉంది. అలాగే అధిక నియంత్రణ కలిగిన ఫార్మా మార్కెట్ ఆ దేశం ప్రత్యేకత. సహజంగానే యుద్ధం కారణంగా సరఫరా అంతరాయాలు ఉంటాయి' అని అభిప్రాయపడ్డారు.

దలాల్ స్ట్రీట్‌పైనా 'యుద్ధ' సెగలు

- ఇజ్రాయెల్ -పాలస్తీనా పరస్పర దాడుల ప్రభావం
- ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 483 పాయింట్లు
- నిఫ్టీ 141 పాయింట్లు పతనం



ముంబై: ఇజ్రాయెల్ – పాలస్తీనా పరస్పర దాడుల ప్రభావం దలాల్ స్ట్రీట్‌పైనా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. పశ్చిమాసియాలో ఉద్భవించిన యుద్ధ ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. అమెరికా సెప్టెంబర్ ఉద్యోగ గణాంకాలు అంచనాలకు మించి నమోదవడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. అలాగే దేశీయ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు, స్థూల ఆర్థిక డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ 12% శాతానికి పైగా పెరిగి 11.40 స్థాయికి చేరింది. ఫలితంగా ఇన్వెస్టర్లు ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో తలెత్తిన అమ్మకాలతో 483 పాయింట్లు పతనమై 65,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141 పాయింట్లు నష్టపోయి 19,512 వద్ద నిలిచాయి. ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 561 పాయింట్లు క్షీణించి 65,435 వద్ద, నిఫ్టీ 173 పాయింట్లు పతనమై 19,480 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.998 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2661 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కె ట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ 30 షేర్లలో హెచ్‌సీఎల్ టెక్ 1%, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు 0.50% మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన 27 షేర్లూ నష్టపోయాయి. ఈ సూచీ 0.75% క్షీణించడంతో బీఎస్ఈలో రూ.4 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది.
- వెబ్ ఆధారిత కొత్త కమోడిటీ డెరివేటివ్స్ ప్లాట్‌ఫాం ప్రారంభించేందుకు సెబీ నుంచి అనుమతులు లభించడంతో బీఎస్ఈలో ఎంసీఎక్స్ షేరు 2% లాభపడి రూ.2,078 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 5.50% ర్యాలీ చేసి రూ.2149.50 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- అంతర్జాతీయంగా చమురు ధరలు వేడక్కడం దేశీయ ఇంధన రంగ షేర్లపై మిశ్రమ ప్రభావం పడింది. ధరలు పెరగడంతో ఆయిల్ ఇండి యా, ఓఎన్‌జీసీ షేర్లు 5%, 1% చొప్పున లాభపడ్డాయి. ఆయిల్ మార్కెటింగ్ దిగ్గజాలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ షేర్లు 2% చొప్పున నష్టపోయాయి.
- సెప్టెంబర్ క్వార్టర్‌లో అమ్మకాలు రెండు రెట్లు వృద్ధి చెంది రూ. 7,092 కోట్లకు చేరడంతో ప్రెస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ షేరు అరశాతానికి పైగా లాభపడి రూ.664 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 5% పెరిగి రూ.699 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

టాప్ గేర్‌లో వాహన విక్రయాలు

- సెప్టెంబర్‌లో 20 శాతం అప్
- 15.63 లక్షల నుంచి 18.82 లక్షలకు పెరిగిన రిజిస్ట్రేషన్లు



న్యూఢిల్లీ: పండుగల సీజన్ నేపథ్యంలో దేశీయంగా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగాయి. 18,82,071 వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. 2022 సెప్టెంబర్‌లో నమోదైన 15,63,735 యూనిట్లతో పోలిస్తే ఇది 20 శాతం అధికం. ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ల సమాఖ్య ఫాడా ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం సెప్టెంబర్‌లో ద్విచక్ర వాహనాల విక్రయాలు 22 శాతం, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 49 శాతం, ప్యాసింజర్ వాహనాలు 19%, వాణిజ్య వాహనాల అమ్మకాలు 5 శాతం పెరిగాయి. అయితే, ట్రాక్టర్ల రిటైల్ అమ్మకాలు మాత్రం 10 శాతం తగ్గాయని ఎఫ్‌ఏడీఏ ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా తెలిపారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, ఆకర్షణీయమైన ప్రమోషనల్ ఆఫర్లు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరగడం తదితర అంశాలు మార్కెట్ సెంటిమెంటు మెరుగుపడటానికి దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. సానుకూల పరిస్థితులతో ఈ పండుగ సీజన్ ఆటోమొబైల్ రంగానికి మెరుగ్గా ఉండగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాడా నివేదికలో మరిన్ని వివరాలు ..

- సెప్టెంబర్‌లో వాహనాల లభ్యత మెరుగుపడటంతో కార్ల అమ్మకాలు 19 శాతం పెరిగి 2,79,137 నుంచి 3,32,248 యూనిట్లకు పెరిగాయి.
- ద్విచక్ర వాహనాల అమ్మకాలు 10,78,286 యూనిట్ల నుంచి 13,12,101కు చేరాయి.
- వాణిజ్య వాహనాల విక్రయాలు 5 శాతం వృద్ధి చెంది 80,804 యూనిట్లకు పెరిగాయి.
- త్రిచక్ర వాహనాలు విక్రయాలు 68,937 యూనిట్ల నుంచి 49 శాతం పెరిగి 1,02,426 యూనిట్లకు ఎగిశాయి.
- ట్రాక్టర్ అమ్మకాలు 60,321 యూనిట్ల నుంచి 54,492 యూనిట్లకు తగ్గాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ జెన్‌కోలో 60 కెమిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్వహణతో పాటు ఇప్పటికే ఉన్న పాత విద్యుత్ కేంద్రాల అవసరాల కోసం కెమిస్ట్ పోస్టులను భర్తీ చేయనుంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 60 (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-03, జనరల్ రిక్రూట్‌మెంట్-57).
- » **అర్హత:** బీఎస్సీ(కెమిస్ట్రీ), మొదటి శ్రేణిలో ఎంఎస్సీ(కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.65,600 నుంచి రూ.1,31,220.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.10.2023
- » **రాతపరీక్ష తేది:** 03.12.2023.
- » **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

తెలంగాణ జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో).. ప్రత్యక్ష, రెగ్యులర్ నియామకాల పద్ధతిలో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 339
- » **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.
- » **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్/సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.65,600 నుంచి రూ.1,31,220.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.10.2023
- » **రాతపరీక్ష తేది:** 03.12.2023.
- » **వెబ్‌సైట్:** https://tsgenco.co.in

బీఈఎల్‌లో 232 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) దేశవ్యాప్తంగా ఉన్న బీఈఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో.. ప్రొబేషనరీ ఇంజనీర్, ప్రొబేషనరీ ఆఫీసర్, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 232
- » **పోస్టుల వివరాలు:** ప్రొబేషనరీ ఆఫీసర్-205, ప్రొబేషనరీ ఆఫీసర్(హెచ్ఆర్)-12, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్-15.
- » **అర్హత:** పోస్టును అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/మెకానికల్/కంప్యూటర్ సైన్స్), ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ/పీజీ/పీజీ డిప్లొమా(హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/పర్సనల్ మేనేజ్‌మెంట్), సీఏ/సీఎంఏ ఫైనల్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.09.2023 నాటికి ప్రొబేషనరీ ఇంజనీర్‌కు 25 ఏళ్లు, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు మించకూడదు.
- » **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పోస్టింగ్ ప్రదేశం:** బెంగళూరు, ఘజియాబాద్, పుణె, హైదరాబాద్, చెన్నై, మచిలీపట్నం, పంచకుల, కోట్‌ద్వారా, నవీ ముంబై.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023
- » **పరీక్ష తేది:** డిసెంబర్ 2023.
- » **వెబ్‌సైట్:** https://bel-india.in

ఆర్ఈసీఐపీఎంటీ, హైదరాబాద్‌లో ఫ్యాకల్టీ పోస్టులు


హైదరాబాద్‌లోని ఆర్ఈసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పవర్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఆర్ఈసీఐపీఎంటీ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- » **అర్హత:** బీఈ, బీటెక్, పీజీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** recipmt@gmail.com
- » **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
- » **వెబ్‌సైట్:** www.recipmt.com

జనవరిలో.. జేఈఈ మెయిన్

- » జేఈఈ-మెయిన్-2024 తేదీలు ఖరారు
- » జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు తొలి సెషన్
- » ఏప్రిల్ 1 నుంచి 15 వరకు రెండో సెషన్ పరీక్షలు
- » తెలుగు రాష్ట్రాల నుంచి లక్షకు పైగా విద్యార్థుల హాజరు

జేఈఈ-మెయిన్.. ప్రతిష్టాత్మక ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దీంతోపాటు ఐఐటీల్లో అడ్మిషన్స్ కోసం జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పరీక్ష కూడా ఇదే!! ఇంతటి కీలకమైన పరీక్ష కోసం విద్యార్థులు ఇంటర్ ఎంపీసీలో చేరిన మొదటి రోజునుంచే అహర్నిశలు కృషి చేస్తారనేది నిస్సందేహం! వచ్చే ఏడాది జనవరి 24 నుంచి తొలి సెషన్‌ను, ఏప్రిల్ 1 నుంచి రెండో సెషన్‌ను నిర్వహిస్తామని ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ మెయిన్ పరీక్ష విధానం, ఇందులో విజయం సాధించేందుకు మార్గాలు..



జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్.. మెయిన్.. సంక్షిప్తంగా జేఈఈ-మెయిన్. దేశంలోని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది. ఏటా లక్షల మంది పోటీ పడుతుంటారు. ఈ ఏడాది ఎన్‌టీఏ ముందుగానే పరీక్ష తేదీలను ప్రకటించింది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. జేఈఈ-మెయిన్‌లో మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

పది లక్షలకు పైగా పోటీ

జేఈఈ-మెయిన్ పరీక్షకు జాతీయ స్థాయిలో ఏటా పది లక్షల మందికిపైగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. గత ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ రెండు సెషన్లలో కలిపి 11,13,325 మంది పరీక్షకు హాజరయ్యారు. జనవరి సెషన్‌లో 8,23,967 మంది; ఏప్రిల్ సెషన్‌లో 8,83,367మంది పరీక్ష రాసారు. వీరిలో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల సంఖ్య 1.10 లక్షల మంది.

2024 తేదీలు ఖరారు

జేఈఈ-మెయిన్ 2024 తేదీలను ఎన్‌టీఏ ప్రకటించింది. తొలి సెషన్‌ను 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వరకు; రెండో సెషన్‌ను ఏప్రిల్ 1 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. అంటే.. తొలి సెషన్‌కు మూడు నెలలు.. రెండో సెషన్ ఏడు నెలల సమయం అందుబాటులో ఉంది. కాబట్టి విద్యార్థులు సరైన టైమ్ ప్లాన్ రూపొందించుకొని జేఈఈ-మెయిన్‌కు సన్నద్ధమయ్యే అవకాశం ఉంది.

300 మార్కులకు

బీఈ, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి మొత్తం 300 మార్కులకు జేఈఈ మెయిన్(పేపర్ 1) పరీక్ష నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 90 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో సెక్షన్ ఏ, సెక్షన్ బీ ఉంటాయి. సెక్షన్-ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో (ఎంసీక్యూలతో) ఉంటుంది. సెక్షన్-బిలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి. ఛాయిస్ విధానం కారణంగా సెక్షన్-బిలో 10 ప్రశ్నల్లో అయిదింటికి సమాధానం ఇస్తే సరిపోతుంది. సెక్షన్-ఎలో 0.25 శాతం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

బోర్డ్+జేఈఈ మెయిన్

ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డిసెంబర్ రెండో వారం నాటికి ఇంటర్మీడియెట్ సిలబస్‌ను పూర్తి చేసుకుంటారు. వీరు జేఈఈ-మెయిన్ జనవరి సెషన్ పరీక్షలో రాణించేలా ఇప్పటి నుంచి ఉమ్మడి అంశాలపై దృష్టిపెట్టాలి. ఇంటర్మీడియెట్, జేఈఈ-మెయిన్‌లో ఉన్న ఉమ్మడి టాపిక్స్ పునశ్చరణకు అధిక సమయం కేటాయించాలి. తద్వారా జేఈఈ-మెయిన్ జనవరి సెషన్‌లో మంచి ప్రతిభ కనబర్చడానికి అవకాశం ఉంటుంది.

అప్లికేషన్స్, కాన్సెప్ట్స్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జేఈఈ-మెయిన్ పరీక్ష ప్రశ్నల తీరుపై అవగాహన పెంచుకోవాలి. ఆ దిశగా ఆయా సబ్జెక్ట్‌లను అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో అధ్యయనం చేయాలి. ముఖ్యంగా ఆయా సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. ఫలితంగా ఇంటర్ సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి పట్టుతోపాటు జేఈఈ-మెయిన్‌లోనూ రాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా చదివేటప్పుడే ముఖ్యమైన ఫార్ములాలు, కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకుంటే.. పరీక్ష సమయంలో రివిజన్‌కు ఎంతో కలిసొస్తుంది.

సిలబస్ అనుసంధానం

జేఈఈ-మెయిన్ విద్యార్థులు..మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. మొదటి సంవత్సరం అంశాలను, రెండో సంవత్సరం అంశాలతో అనుసంధానం చేసుకుంటూ అభ్యసనం సాగిస్తే.. సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన లభించడంతోపాటు ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. జేఈఈ-మెయిన్ సిలబస్‌లో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ అంశాలకు సమ ప్రాధాన్యం ఉంటోంది. కాబట్టి రెండు సంవత్సరాల సిలబస్‌పై పట్టు సాధించేలా కృషి చేయాలి.

న్యూమరికల్ ప్రశ్నలకు

జేఈఈ-మెయిన్ అభ్యర్థులు న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జేఈఈ-మెయిన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్..ఈ మూడు సబ్జెక్ట్‌ల నుంచీ అయిదు ప్రశ్నలు చొప్పున న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు అడుగుతున్నారు. ఇంటర్ విద్యార్థులు అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్‌కు, ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఇంటర్, జేఈఈ-మెయిన్ రెండు పరీక్షలకూ ప్రాక్టీస్ చాలా ముఖ్యం. కాబట్టి ప్రతిరోజు తాము చదివిన సబ్జెక్ట్‌కు సంబంధించి..అందులోంచి ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న అంశాలను గుర్తించి ప్రాక్టీస్ చేయాలి. విద్యార్థులు మెయిన్ మాక్ టెస్ట్‌లకు, ఇంటర్ ప్రీ-ఫైనల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా పరీక్షలో రాణించేందుకు దోహదం చేస్తుంది. జనవరి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ప్రస్తుతం దాదాపు నెలరోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో వీరు అధిక సమయాన్ని పునశ్చరణకు, వీక్లీ టెస్ట్‌లకు, మాక్ టెస్ట్‌లకు కేటాయించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్ట్‌కు కనీసం రెండు గంటల సమయం కేటాయించాలి. తమకు బాగా సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే సబ్జెక్ట్‌లకు కొంత ఎక్కువ సమయం కేటాయించడం మేలు. క్లిష్టంగా భావించిన సబ్జెక్ట్‌లు,అంశాల విషయంలోనూ కనీసం బేసిక్ ఫార్ములాలు తెలుసుకోవాలి. అంతకుముందు రోజు చదివిన అంశాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకునే విధంగా కనీసం పది నిమిషాలు కేటాయించాలి.

ఏప్రిల్ సెషన్‌కు ఇలా

ఏప్రిల్ సెషన్‌పైనే దృష్టి పెట్టిన విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట వ్యూహంతో ప్రిపరేషన్ సాగించడం ద్వారా మంచి మార్కులు సాధించే అవకాశముంది. డిసెంబర్‌లో ఇంటర్ సిలబస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆ తర్వాత జేఈఈ-మెయిన్ పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా ఫిబ్రవరి చివరి వారం వరకు ప్రిపరేషన్ సాగించాలి. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత ఏప్రిల్ సెషన్ తేదీకి మధ్య ఉన్న వ్యవధిని పూర్తిగా రివిజన్, మాక్ టెస్ట్‌ల ప్రాక్టీస్‌కు కేటాయించాలి.

సబ్జెక్ట్ వారీగా ముఖ్యమైన టాపిక్స్

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్. వీటితోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలను కనీసం ఒక్కసారైనా పూర్తిచేసే విధంగా ప్రిపరేషన్ సాగించాలి.

ఫిజిక్స్

ఫిజిక్స్‌లో న్యూమరికల్ అప్లికేషన్ అప్రోచ్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్,వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

కెమిస్ట్రీ

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్ కెమిస్ట్రీ. ఈ విభాగంలో అడిగే ప్రశ్నలు కెమికల్ బాండింగ్, పీరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై నైపుణ్యాలను తెలుసుకునే విధంగా ఉంటాయి. కాబట్టి మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అడ్వాన్స్‌డ్‌కు అర్హతగా

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు జేఈఈ-మెయిన్ నుంచి 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు. కాబట్టి జేఈఈ-మెయిన్‌లో మంచి స్కోర్ సాధించేలా కృషి చేస్తే.. అడ్వాన్స్‌డ్‌కు అర్హుల జాబితాలో నిలిచే అవకాశం లభిస్తుంది.

క్లుప్తంగా...

సింహాద్రిలో విద్యుదుత్పత్తి నిలిపివేత

పరవాడ(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఆదివారం అర్ధరాత్రి విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం పడింది. గుర్తించిన అధికారులు ఆదివారం అర్ధరాత్రి నుంచి విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. సమస్యను సరిచేయడానికి సాంకేతిక నిపుణులు రంగంలో దిగారు. రెండు రోజుల వ్యవధిలో సమస్యను సరిచేసి బుధవారం ఉదయానికల్లా యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 2, 3, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికార వర్గాలు వెల్లడించాయి.

అనుక్షణం అప్రమత్తం

తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్



ఆపరేషనల్ రెడీనెస్‌లో భాగంగా యుద్ధ విన్యాసాల్ని సమీక్షిస్తున్న ఈఎన్‌సీ చీఫ్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల్లో నలువైపులా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ దేశ రక్షణకు నిరంతరం శ్రమిస్తున్నామని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అన్నారు. ఏటా నిర్వహించే ఆపరేషనల్ రెడీనెస్‌లో భాగంగా విశాఖ కేంద్రంగా ఉన్న ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో కార్యాచరణ సంసిద్ధతపై ఈఎన్‌సీ చీఫ్ సమీక్షించారు. తూర్పు నౌకాదళ పరిధిలో ఉన్న యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఆయుధ సంపత్తిని పరిశీలించారు. హఠాత్పరిణామాలు ఎదురైతే ఎలా దూకుడుగా వ్యవహరించాలన్న అంశాన్ని ఆయా యుద్ధ నౌకల సిబ్బందికి వివరించారు. అనంతరం.. ఉపరితలంలోనూ, వాయుమార్గంలోనూ, జలాంతర్గాముల ద్వారా చేపట్టిన యుద్ధ విన్యాసాల్ని సమీక్షించారు. యుద్ధ నౌకల నుంచి ఫైరింగ్ నిర్వహణ, శత్రు నౌకలు, సబ్‌మెరైన్ల జాడని ట్రాకింగ్ చేయడం తదితర అంశాలపై డ్రిల్ నిర్వహించారు. యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లలో నిర్వహించిన విన్యాసాల్లో పురుషులతో సమానంగా మహిళా సిబ్బంది సత్తా చాటడంపై తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ పెంధాల్కర్ ప్రశంసించారు.

ఇక గర్భిణులకు నిశ్చింత

ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా టిఫా, అల్ట్రా సౌండ్ స్కాన్

- గ్రహణం మొర్రి, గుండెలో రంధ్రం, కాళ్లు, చేతుల వంకరలు గుర్తించే వీలు
- కడుపులోని బిడ్డ ఎదుగుదలను తెలుసుకునే అవకాశం
- లోపాలుంటే సరిదిద్దుకునే వెసులుబాటు



సాక్షి, అమరావతి: నవ మాసాలు మోసి కన్న బిడ్డకు గ్రహణం మొర్రి, గుండెలో రంధ్రం, కాళ్లు, చేతులు వంకరగా ఉండటం, నయంకాని వ్యాధులుంటే ఆ తల్లి పడే బాధ వర్ణనాతీతం. ఇలా ఏ తల్లి క్షోభకు గురికాకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా అత్యాధునిక 'టిఫా' స్కానింగ్ సేవలను ఉచితంగా సీఎం జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గర్భంలో ఉండగానే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని, పిండం ఎదుగుదలలో లోపాలను గుర్తించేందుకు టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనామలీస్(టిఫా) స్కాన్ దోహదపడుతుంది. ఖరీదైన ఈ స్కాన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులకు ఉచితంగా చేస్తోంది. ఈ ఏడాది మే నుంచి ఆరోగ్యశ్రీ కింద గర్భిణులకు ఒక టిఫా, రెండు అల్ట్రాసౌండ్ స్కాన్‌లు/మూడు అల్ట్రా సౌండ్ స్కాన్ సేవలను ప్రభుత్వం ప్రారంభించింది. మేనరికం వివాహాలు చేసుకున్న వారికి, బ్యాడ్ అబ్‌స్ట్రెటిక్ హిస్టరీ(గర్భం దాల్చిన రోజు నుంచే వివిధ సమస్యలుండటం), క్రోమోజోమ్స్, మానసిక లోపాలు (మెంటల్ డిజబిలిటీ), సింగిల్ జీన్ డిజార్డర్స్, 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చిన వారికి, ఇతర సమస్యలున్న గర్భిణులకు వైద్యుడి సూచన మేరకు టిఫా స్కాన్ చేస్తున్నారు. పైసమస్యలేవీ లేని గర్భిణులకు మూడు అల్ట్రాసోనోగ్రామ్ స్కాన్‌లు చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ 1500 మందికి పైగా గర్భిణులు ఉచిత టిఫా, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు పొందారు. టిఫా స్కానింగ్‌కు ప్రైవేట్‌గా అయితే రూ.1,500 నుంచి రూ.2,500 వరకూ ఖర్చవుతుంది. గర్భం దాల్చిన నాటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లే వరకూ మహిళలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ఆరోగ్యశ్రీ కింద ప్రసవించిన మహిళలకు విశ్రాంత సమయానికి భృతిగా రూ.5 వేల చొప్పున వైఎస్సార్ ఆసరా సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇక 108 అంబులెన్స్‌ల ద్వారా ఉచితంగా ఆస్పత్రులకు తరలించడం, ప్రసవానంతరం వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా వారిని ఇంటికి చేరుస్తుండటం తెలిసిందే.

ముందే గుర్తిస్తే నయమయ్యే అవకాశం



మేనరికం వివాహాలు, జన్యు సంబంధిత లోపాలు, ఆలస్యంగా గర్భం దాల్చడం వంటి వివిధ కారణాలతో శిశువుల్లో లోపాలు తలెత్తుతుంటాయి. ఈ సమస్యలను ముందే గుర్తిస్తే అత్యధిక శాతం నయం చేయడానికి వీలుంటుంది. ఇలాంటి లోపాలను టిఫా స్కాన్‌తో గుర్తించే అవకాశముంటుంది.

– డాక్టర్ అనిల్‌కుమార్, అదనపు సంచాలకులు, వైద్య, ఆరోగ్య శాఖ

ఏఎన్‌యూలో కొత్త కోర్సులు ప్రారంభం

ఏఎన్‌యూ: విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కొత్త కోర్సులను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన కోర్సుల్లో ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్, ఎంఎస్సీ డేటా సైన్స్, ఎంఎస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎంఏ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ కోర్సులు ఉన్నాయని చెప్పారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు నూతన కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యార్థులు కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన కోర్సులలో ఫ్యాకల్టీ నియామకం, మౌలిక సదుపాయాలు కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం వీసీ ఆచార్య రాజశేఖర్ విడుదల చేశారు. యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు పొందవచ్చు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో 61శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఏసీఈ ఆర్.ప్రకాష్‌రావు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24 ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు. ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.1,240 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.



కొత్త కోర్సులను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య పి. రాజశేఖర్, పక్కన రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ తదితరులు

ఒక్కో పోస్టుకు 15 మంది పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలన అనంతరం ప్రాథమిక మెరిట్ జాబితాను ఇప్పటికే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ప్రకటించింది. బుధవారంతో ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియనుంది. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను ప్రకటించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఇన్-సర్వీస్ కోటాలో 2023-24 విద్యా సంవత్సరానికి పీజీ చదివేందుకు వెళ్లే వైద్యుల స్థానాలను భర్తీ చేయడం కోసం ప్రభుత్వం పోస్టుల భర్తీ చేపడుతోంది. ఖాళీ అయ్యే పోస్టులను అంచనా వేసి వైద్యులు రిలీవ్ అయి వెళ్లే సమయానికి కొత్తవారిని అందుబాటులోకి తెచ్చి ఫ్యామిలీ డాక్టర్, ఇతర పీహెచ్‌సీ సేవలకు అంతరాయం కలగకుండా ముందు చూపుతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2019 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టింది.

తిరుమలలో 13 కాటేజీల పునర్నిర్మాణం

వరాహస్వామి కాటేజీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రహదారి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేసే కార్మికులకు లబ్ధి కలిగించేందుకు టీటీడీ ధర్మకర్తల మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో మండలి సమావేశం జరిగింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి టీటీడీ చైర్మన్ భూమన మీడియాకు వివరించారు.



టీటీడీ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపు

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కింద ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, ఎఫ్ఎంఎస్ పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ.12 వేల నుంచి రూ.17 వేలకు పైగా పెంచేందుకు ఆమోదం.
- శ్రీ లక్ష్మీ శ్రీనివాసా మ్యాన్ పవర్ కార్పొరేషన్ ద్వారా పనిచేస్తున్న దాదాపు 6,600 మంది ఉద్యోగులకు ఇకపై ఏటా 3 శాతం వేతనం పెంపుదల.
- టీటీడీలో వివిధ సొసైటీల ద్వారా పనిచేస్తూ ఇప్పుడు కార్పొరేషన్‌లోకి మారిన ఉద్యోగులకు గత సేవల్ని గుర్తించి ప్రతి రెండేళ్లకు 3 శాతం ప్రోత్సాహకం ఇచ్చేందుకు నిర్ణయం.
- కార్పొరేషన్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరైనా అకాల మరణం పొందితే రూ.2 లక్షల నష్టపరిహారం వారి కుటుంబ సభ్యులకు అందించేందుకు ఆమోదం.
- శ్రీలక్ష్మీ శ్రీనివాసా మ్యాన్‌పవర్ కార్పొరేషన్ ఉద్యోగులు దాదాపు 1500 మందికి హెల్త్ స్కీమ్ వర్తింప చేసేందుకు ఆమోదం.

కీలక నిర్ణయాలివీ

- తిరుమలలో 63 ఏళ్ల క్రితం నిర్మించిన గాయత్రీ సదన్, శ్రీవారి కుటీర్, టీబీసీ–53, టీబీసీ–64 తదితర 13 విశ్రాంతి గృహాలను కాటేజీ డొనేషన్ స్కీమ్ కింద పునర్నిర్మాణం.
- రూ.10.80 కోట్లతో వరాహస్వామి విశ్రాంతి గృహం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రోడ్డు, ఫుట్‌పాత్, డ్రెయిన్లు నిర్మాణం.
- శ్రీకాళహస్తి రాజగోపురం కూలడం, శ్రీరంగంలోని మహా రాజగోపురానికి బీటలు వారడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఐఐటీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి టీటీడీలోని అన్ని ఆలయాలు, గోపురాల పటిష్టతను పరిశీలన. కమిటీ నివేదిక ఆధారంగా మరమ్మతులు.
- తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మోకాలి మెట్టు వరకు రోడ్డు పక్కన నడిచే భక్తులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు కలగకుండా రూ.2.81 కోట్లతో నడక దారి షెల్టర్లు నిర్మాణానికి టెండర్లు ఆమోదం.
- టీటీడీ కల్యాణ మండపాల్లో వివాహాలు జరిపే సమయంలో భక్తి గీతాలతో మాత్రమే సంగీత విభావరి నిర్వహించుకోవాలని నిబంధన విధింపు.
- అన్నమయ్య భవనం, నారాయణగిరి క్యాంటీన్లలో భక్తులకు భోజనం తక్కువ ధరకే ఇచ్చేందుకు రూ.2.93 కోట్లతో నారాయణగిరి క్యాంటీన్‌లో మూడో అంతస్తు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయడానికి టెండర్ ఆమోదం.
- గోగర్భం డ్యామ్ సర్కిల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుపై తాత్కాలిక క్యూలైన్లలో భక్తుల సౌకర్యార్థం రూ.18 కోట్లతో శాశ్వత క్యూలు, ఫుడ్ కౌంటర్లు, టాయ్‌లెట్లు. నారాయణగిరి విశ్రాంతి గృహం సర్కిల్, ఆళ్వార్ ట్యాంకు రోడ్డు సర్కిల్ వద్ద రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు పరిపాలన ఆమోదం.
- అలిపిరి వద్ద సప్త గోప్రదక్షిణ మందిరంలో నిత్యం విశేష హోమం నిర్వహించాలని నిర్ణయం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



దుర్గమ్మ సేవలో ఉషశ్రీచరణ్

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీ చరణ్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



15న కూచిపూడి నాట్య దినోత్సవం

నాలుగో ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జున రావు తెలిపారు. -IIలో▸



భక్తుల భద్రతకు పెద్దపీట

ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా ఉత్సవాల్లో భక్తుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నారు. కొండ చరియలు విరిగి పడకుండా ఇనుప గడ్డర్లతో భారీ వాల్‌ను నిర్మిస్తున్నారు. -IIలో▸

సమరోత్సాహం

- వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సదస్సుతో పార్టీ శ్రేణుల్లో నయా జోష్
- రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన పార్టీ ప్రతినిధులు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగంతో రెట్టించిన ఉత్సాహం
- జై జగన్ నినాదంతో మారుమోగిన సభా ప్రాంగణం
- వై నాట్ 175 అంటూ ప్లకార్డులు ప్రదర్శించిన ప్రతినిధులు





సీఎం ప్రసంగానికి హర్షం వ్యక్తంచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రతినిధులు. (ఇన్‌సెట్) సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి జోగి రమేష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం పార్టీ శ్రేణుల్లో ఎన్నికల సమరోత్సాహం నింపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం సరికొత్త స్ఫూర్తిని రగిల్చింది. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేసే లక్ష్యంతో ఈ సదస్సు జరిగింది. 99 శాతం హామీలను అమలు చేయడంతోపాటు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతృప్తికర పాలన అందిస్తున్న విషయం తెలిసిందే. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని ఇంటింటికీ చేరవేయాల్సిన బాధ్యత పార్టీ ప్రతినిధులపై ఉందంటూ ముఖ్యమంత్రి చెప్పిన తీరు ఆకట్టుకుంది. సీఎం చెప్పిన రీతిలో అడుగులు ముందుకు వేస్తే 175కు 175 నియోజకవర్గాల్లోనూ పార్టీ అభ్యర్థులు గెలుపు ఖాయమన్న నమ్మకాన్ని పార్టీ శ్రేణుల్లో నింపింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ ప్రతినిధులతో కార్యక్రమం జరిగే ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం లోపల, బయట కోలాహలం నెలకొంది.

సీఎం ప్రసంగానికి విశేష స్పందన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి పార్టీ ప్రతినిధుల నుంచి విశేష స్పందన లభించింది. ఆయన ప్రసంగం ఆద్యంతం పార్టీ శ్రేణుల కరతాళధ్వనుల మధ్య సాగింది. తమలో స్ఫూర్తి నింపేలా సీఎం ప్రసంగించడంతో జై జగన్ అంటూ పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. 'జగనన్నా మా నమ్మకం నువ్వే', 'వై నాట్ 175' అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు చూపుతూ నేతలు, పార్టీ శ్రేణులు స్పందించారు. నాలుగు కార్యక్రమాల ద్వారా ప్రజల ముందుకు వెళ్లాలంటూ ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయడంతో పార్టీ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. సరైన సమయంలో సరైన నిర్ణయం అంటూ ప్రశంసించారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపూ ఆనందంతో కేరింతలు కొడుతూ తమ మద్దతు తెలిపారు. 'చెప్పారంటే, చేస్తారు' అన్న మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడని, ఎంత కష్టమైనా, నష్టమైనా ఈ నాలుగున్నరేళ్లూ ప్రజలకు అండగా నిలిచారని పలువురు ప్రతినిధులు గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏమి చెబుతారా అన్న ఆసక్తితో ఎంతో దూరం నుంచి వచ్చామని, సరైన సమయంలో చక్కని సందేశంతో దిశానిర్దేశం చేశారని అనంతపురం జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. సీఎం చెప్పిన విషయాలను తమ ప్రాంత ప్రజలకు పూసగుచ్చినట్లు వివరిస్తామని, 175 సీట్లు కచ్చితంగా వస్తాయని ధీమా వ్యక్తంచేశారు.



'వై ఏపీ నీడ్స్ జగన్'

ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సీఎం వైఎస్ జగన్ పిలుపు ఇవ్వడంతో పార్టీ ప్రతినిధులు స్పందించారు. ఓట్ల రూపంతో ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెబుతామని హామీ ఇచ్చారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' అంటూ ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వైఎస్సార్ సీపీ పాలన కావాలి అన్న అంశంపై ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. తప్పకుండా 'మీరే సీఎంగా ఉండాలన్నా' అంటూ ప్రతినిధులు నినదించారు. దేశ క్రీడల్లో వై నాట్ ఏపీ అనే పరిస్థితి రావాలన్నప్పుడు, సిక్సర్ కొడతామన్నా అంటూ మద్దతు తెలిపారు. చంద్రబాబును ఎవరూ కక్షసాధింపుతో అరెస్టు చేయలేదని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. పొత్తులపై మాట్లాడుతూ.. చంద్రబాబు, దత్తపుత్రుడు కలిసినా సున్నాయేనని, ప్రజలతోనే మనపొత్తు అన్నప్పుడు, 100 శాతం కరెక్టు అన్నా అని ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఈ సభ దిగ్విజయం కావడంతో పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహం నింపింది. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచే కాకుండా, రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మంత్రి జోగి రమేష్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పార్టీ అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావు, పేర్ని నాని, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తదితరులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పసందైన వంటకాలతో విందు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు వచ్చిన అతిథులకు పసందైన వంటకాలతో భోజనం అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేల మంది ప్రతినిధులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా 90 స్టాళ్లు ఏర్పాటు చేసి 30 రకాల వంటకాలతో పసందైన భోజనం వడ్డించారు. ఆదివారం రాత్రికే విజయవాడ చేరుకున్న ప్రతినిధులకు సోమవారం ఉదయం అల్పాహారం అందించారు. మధ్యాహ్నం మటన్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, రొయ్యల కూర, పీతల వేపుడు, రసం, కుండ పెరుగుతో రుచికరమైన భోజనం వడ్డించారు. భోజన ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి పర్యవేక్షించారు. భోజన ఏర్పాట్లపై పార్టీ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. బస్సుల్లో దూర ప్రాంతాలు వెళ్లేవారికి భోజనం పార్శిళ్లు అందజేశారు.



న్యూస్‌రీల్

మత్స్య వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తారకప్రసాద్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో ఈ నెల 6,7,8 తేదీల్లో జరిగిన మత్తు వైద్యుల 32వ వార్షిక సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వెయ్యి మందికి పైగా మత్తు వైద్యులు పాల్గొనగా, నూతన అధ్యక్షుడిగా డాక్టర్ తారకప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విజయనగరానికి చెందిన డాక్టర్ రామారావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్(తిరుపతి), జనరల్ సెక్రటరీగా డాక్టర్ అచ్యుతరామయ్య (కాకినాడ), కోశాధికారిగా డాక్టర్ వి.శ్రీనివాస్ (అమలాపురం) ఎన్నికయ్యారని మత్తు వైద్యుల సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ వంకినేని కుచేలబాబు తెలిపారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియా జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ కె.ఆర్.ఎస్.రాగూర్, డాక్టర్ ఎ.కామేశ్వరరావు, ఐఆర్ సీఏఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఎస్.సి.చక్రరావు, డాక్టర్ ఆళ్ల ప్రశాంతి, విశాఖ బ్రాంచి అధ్యక్షులు డాక్టర్ అల్లు పద్మజ, జాతీయ జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ జి.కిరణ్‌కుమార్, సిద్ధార్థ వైద్య కళాశాల ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ సొంగా వినయ్‌కుమార్ తదితరులు డాక్టర్ తారకప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీ శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఈఓ, ఫెస్టివల్ ఆఫీసర్ సోమవారం పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల చెంత ఏర్పాటు చేస్తున్న కేశఖండన శాల, టికెట్లు క్యూలైన్ ఇతర పనులను తనిఖీచేశారు. ఉత్సవాలకు రెండు రోజులకు ముందుగానే పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లు, ప్రసాదం కౌంటర్లు, స్నాన ఘాట్లు, షవర్లు, క్యూలైన్లతో పాటు పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ ఈఈ ఎల్.రమాదేవి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. కనకదుర్గనగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ప్రసాదం కౌంటర్లను చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. దసరా ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను త్వరితిగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలతో పాటు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.శివరామప్రసాద్‌ను కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. రవాణా శాఖలో రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివరామప్రసాద్ సోమవారం కలెక్టర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, నగర పాలక సంస్థ తదితర శాఖల సమన్వయంతో బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. ప్రమాదాలు నివారించి జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో 12 సెంట్లలో కూరగాయలు, దుంప, తీగజాతి రకానికి చెందిన నిరంతర పంటలను పండించే ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) మోడల్‌ను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ సోమవారం మొక్కలను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా రైతులు వివిధ పంటలను సాగు చేయాలని సూచించారు. జిల్లాలో 20 వేల మంది రైతులు, ప్రజల భాగస్వామ్యంతో 34 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. రసాయన ఎరువులకు స్వస్తి పలికి రైతులు ప్రకృతి వ్యవసాయం బాట పట్టేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే దిశగా ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అవలంబించాలన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులో ఉంచామన్నారు. తక్కువ నీటి వనరులతో చీడ పీడలను తట్టుకునేలా ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. తన ఎకరం పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గంపలగూడేనికి చెందిన రైతు కోటేశ్వరమ్మ తన అనుభవాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం విజయకుమారి, వ్యవసాయాధికారి ఎస్.నాగమణెమ్మ, సంబంధిత శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

'జగనన్నకు చెబుదాం..' సద్వినియోగం చేసుకుందాం

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేందేందుకు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సంతృప్తిస్థాయి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు సోమవారం తెలిపారు. గత నెల నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో జిల్లాలోని మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్‌లో 13న అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లి, 18న పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు, 25న పెడన నియోజకవర్గం కృత్తివెన్నులో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అనంతరం అర్జీలను శాఖలవారీగా విభజించి వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన పరిష్కారం చూపుతామన్నారు. ఆయా మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఇప్పటి వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 235 అర్జీలు నమోదు కాగా వీటిలో 84 అర్జీలు పరిష్కరించామన్నారు. 149 అర్జీలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రెండు అర్జీలు రీ–ఓపెన్ అయ్యాయని కలెక్టర్ వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికే స్పందన

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదిక అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు ఆశించిన స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో జి.వెంకటేశ్వర్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించి, కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందనలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ తిరిగి నమోదు కాకూడదని స్పష్టంచేశారు. సమస్యల పరిష్కారానికి స్పందన మాత్రమే ఏకైక మార్గమన్నారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో ప్రజలు స్పందనకు వస్తారని పేర్కొన్నారు. వారి ఆశలను అడియాసలు చేయకుండా ప్రతి సమస్యకూ చక్కని పరిష్కారం చూపాలని ఆదేశించారు. అన్ని సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ ఉద్దేశాన్ని నెరవేర్చాలన్నారు. స్పందనలో స్వీకరించిన ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా అందజేయాలన్నారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

స్పందనలో 161 అర్జీలు

స్పందనలో ప్రజల నుంచి 161 అర్జీలు అందాయన్నారు. అత్యధికంగా రెవెన్యూ పరిధిలో 94 అర్జీలు వచ్చాయి.శాఖల వారీగా.. పోలీస్ 21, మునిసిపల్ 11, డీఆర్డీఏ 6, విద్య 5, పౌర సరఫరాలు 4, ఏపీసీపీడీసీఎల్ 4, హెల్త్ 3, పశుసంవర్ధక 2, పంచాయతీరాజ్ 2, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 2, సోషల్ వెల్ఫేర్ 2, హౌసింగ్ 1, వ్యవసాయ 1, ఆర్ డబ్ల్యూఎస్ 1, రవాణా 1, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఈఐఎస్ 1 అర్జీలు నమోదయ్యాయి. స్పందన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.రుక్మాంగదయ్య, హౌసింగ్ పీడీ రజినీ కుమారి, పశుసంర్థక శాఖ జేడీ కె.విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో దుర్గారావు సత్తా

పెనమలూరు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో యనమలకుదురుకు చెందిన ఎస్.దుర్గారావు రెండు బంగారు పతకాలు సాధించాడు. హైదరాబాద్‌లో ఈ నెల 8వ తేదీన ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్– 2023 పోటీల్లో యనమలకుదురుకు చెందిన ఎస్.దుర్గారావు జోసఫ్ 61 సంవత్సరాల విభాగంలో వ్యక్తిగత విభాగం కాటాలో, అదే విధంగా స్పారింగ్ 70 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించాడు.

నవంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

కృష్ణా జేసీ అపరాజిత సింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో నవంబర్ 15వ తేదీ నుంచి డిసెంబర్ 21వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి జిల్లాకు అందించిన క్రీడాసామగ్రిని జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రీడల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆయా దశల్లో గెలుపొందిన విజేతలకు ప్రత్యేక క్రీడాసామాగ్రిని బహుమతిగా అందిస్తామన్నారు.

- క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో నియోజకవర్గస్థాయిలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 35 వేలు, రెండో బహుమతిగా రూ. 15 వేలు, మూడో బహుమతిగా రూ. 5 వేలు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి రూ. 60 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, రెండో బహుమతిగా రూ.3 లక్షలు, మూడో బహుమతిగా రూ.2 లక్షలు అందజేస్తామని తెలిపారు.
- బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలైన వారికి నియోజకవర్గస్థాయిలో మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతిగా రూ.35 వేలు, రెండో బహుమతిగా రూ.20వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిగా రూ. 2 లక్షలు, రెండో బహుమతిగా లక్ష రూపాయలు, మూడో బహుమతిగా రూ.50 వేలు అందజేస్తామన్నారు. జిల్లాలోని ఆసక్తి కలిగిన క్రీడాకారులందరూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో బందరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.శివనారాయణరెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.



క్రీడాసామగ్రిని చూపుతున్న జేసీ అపరాజితాసింగ్, తదితరులు

లక్ష్యం మేరకు పోర్టు నిర్మాణ పనులు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు సీఈఓ ప్రవీణ్‌కుమార్ సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓడరేవుల నిర్మాణ పురోగతిపై సంబంధిత కలెక్టర్లతో సమీక్షించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ పురోగతిపై సీఎస్‌కు కలెక్టర్ రాజాబాబు వివరించారు. 2.325 కిలోమీటర్ల మేర దక్షిణం రక్షణ గోడ, 825 మీటర్ల మేర ఉత్తరం రక్షణ గోడ నిర్మాణం కొనసాగుతోందన్నారు. కస్టమ్స్, సెక్యూరిటీ తదితర భవనాలు పునాదిదశలో ఉన్నాయన్నారు. 40 ఎకరాల్లో బెర్త్ రిలేటెడ్ ఫైలింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ ఎం.శివయ్య, మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధి రాఘవేంద్రరావు, రైట్ సంస్థ మేనేజర్ ఎంవీపీ రవికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

కృష్ణా కలెక్టర్ రాజాబాబు పిలుపు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా నిరోధించేందుకు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బాల్య వివాహాల నివారణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధించేందుకు ప్రభుత్వం తాజాగా జీఓ నంబర్ 31, 39లలో మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. గ్రామ/వార్డు స్థాయి నుంచి అన్ని ప్రభుత్వశాఖల అధికారులందరూ బాల్యవివాహాలు నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. చదువుకోని తల్లిదండ్రులు, పేదలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు బాల్యవివాహాల పట్ల మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ పరిస్థితులను నియంత్రించేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తదితర శాఖల సిబ్బంది ఈ వివాహాలు జరగటం వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారని తెలియగానే సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో బాల్యవివాహాల నియంత్రణపై చర్చించాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీస్, ఇతర సిబ్బంది బాధ్యత తీసుకొని బాల్యవివాహాలు నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్, ఇన్‌చార్జ్ ఆర్డీవో శివన్నారాయణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ అపరాజిత సింగ్, ఇతర అధికారులు

15న కూచిపూడి నాట్య దినోత్సవం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో ఈ నెల 15వ తేదీన నాలుగో ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వెంపటి చినసత్యం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవాన్ని ఆయన స్వగ్రామమైన కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోమవారం కళాపీఠం ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగ శాస్త్రి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్, సేవ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకుడు భావన పెదప్రోలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణతో కలిసి కళాపీఠం ప్రాంగణాన్ని, డాక్టర్ వెంపటి చినసత్యం స్మారక భవనాన్ని పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు రోజా, జోగి రమేష్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు హాజరుకానున్నట్లు... పాల్గొంటారని తెలిపారు. సుమారు 1000 మంది కళాకారులతో బృంద, మహా బృంద నాట్యాలను ఏర్పాటు చేసినట్లు భావన పెదప్రోలు వెల్లడించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసులు, ఘంటసాల పవన్ కుమార్ పాల్గొన్నారు.

జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా తరుణ్ కాకాని



లబ్బీపేట(విజయవాడతూర్పు): జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ తరుణ్ కాకానిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ ఫోరం ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఎంజీ రోడ్డులోని హోటల్ వైబ్రెంట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత దశాబ్దకాలంలో కాకాని ఆశయ సమితి వ్యవస్థాపకుడిగా డాక్టర్ తరుణ్ కాకాని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తరుణ్ మాట్లాడుతూ కాకాని వెంకట రత్నం వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి, ఆయన భావజాలాన్ని ఆదర్శాలను నేటి యువతరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఫోరం కార్యదర్శి అవదానుల హరి, బొంటు రామ్మోహన్, డాక్టర్ తాతా సేవకుమార్, వైవీఎస్ మహాదేవు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుడిని గుర్తించిన పోలీసులు

పెనమలూరు: గంగూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తిని పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. పెనమలూరు సెక్టార్ ఎస్‌ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం గంగూరువద్ద ఆదివారం ఎదురుగా వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. ఘటనలో వెనుక నుంచి ఢీ కొట్టిన వ్యక్తి మృతి చెందాడు. అతని వివరాలు తెలియక పోవడంతో పోలీసులు బైక్ నంబర్ ఆధారంగా విచారణ చేశారు. పోలీసుల విచారణలో మృతి చెందింది బండి అమర్‌చంద్‌గా సోమవారం గుర్తించారు. అతను గతంలో కంకిపాడులోఉంటూ ప్రస్తుతం తాడేపల్లిలోనివసిస్తున్నట్లు తెలిపారు. అతను, అతని భార్య నాగలక్ష్మి విద్యార్థులకు ట్యూషన్లు చెబుతారని ఎస్‌ఐ ఫిరోజ్ తెలిపారు.

భక్తుల భద్రతకు పెద్దపీట

- కొండ రాళ్లు విరిగిపడిన చోట ఇనుప గడ్డర్లు
- ఘాట్‌రోడ్డులో నిరంతర పర్యవేక్షణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా ఉత్సవాల్లో భక్తుల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరగనున్నాయి. గత నెల కురిసిన భారీ వర్షాలకు దుర్గాఘాట్ ఎదుట కొండ చరియలు విరిగి పడిన సంగతి తెలిసిందే. ఉత్సవాల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా టాటా ఆలయ అధికారులను ఆదేశించారు. దీంతో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతంలో క్యూలైన్లు కాకుండా ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేస్తున్నారు. కొండ వైపున ఇనుప గడ్డలతో భారీ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందుగా భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు సూచనతో వీటిని అమరుస్తున్నట్లు దుర్గగుడి అధికారులు పేర్కొంటున్నారు.



దుర్గాఘాట్ ఎదుట ఏర్పాటు చేస్తున్న ఇనుప గడ్డర్లు

ఈ ఏడాది కొత్తగా రెండు ఫుట్ బ్రిడ్జిలు

దసరా ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని టోల్‌గేట్ సమీపంలో రెండు ఫుట్‌బ్రిడ్జిలే ఏర్పాటు చేస్తున్నారు. కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే భక్తుల క్యూలైన్ కోసం ఓ ఫుట్‌బ్రిడ్జి వినియోగించాలని నిర్ణయించారు. వినాయకుడి గుడి నుంచి వచ్చే క్యూలైన్లు ఘాట్ రోడ్డు పైకి మళ్లించేందుకు మరో ఫుట్ బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు. ఫుట్ బ్రిడ్జిల నుంచి అత్యవసర వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

ఘాట్‌రోడ్డులో ప్రత్యేక భద్రతా చర్యలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి అభివృద్ధికి కేటాయించిన రూ. 72 కోట్లతో ఘాట్‌రోడ్డులోని పలు ప్రాంతాల్లో రక్షణగోడలను నిర్మించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం, సమాచార కేంద్రం నుంచి ఓం టర్నింగ్ వరకు ఈ వాల్ నిర్మాణం చేశారు. ఓం టర్నింగ్ నుంచి ఘాట్‌రోడ్డు మొదటి మలుపు వరకు కొండ వైపు ప్రమాదకరంగా ఉండటంతో అక్కడ ఆలయ అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఉత్సవాల్లో ఇంజినీరింగ్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామంటున్నామని అధికారులు తెలిపారు.



సీఎం కేటాయించిన నిధుల నుంచి నిర్మించిన రక్షణ గోడ



ఫుట్‌బ్రిడ్జిలు ఏర్పాటు చేయనున్న ప్రాంతం

సత్వర న్యాయానికి చర్యలు

జిల్లా ఎస్పీ జాషువా



బాధితుల సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ జాషువ

కోనేరుసెంటర్: బాధితులకు సత్వరం న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని కృష్ణా ఎస్పీ జాషువా చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో పాల్గొన్న ఆయన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎస్పీ బాధితుల సమస్యలను సావదానంగా ఆలకించారు. ప్రతి ఒక్కరి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

అర్జీలు :

- యనమలకుదురుకు చెందిన ఓ బాధితురాలు 2014లో భర్తచనిపోగా పిల్లలతో కలిసి అత్తింటిలో ఉంటున్నట్లు తెలిపింది. అత్తింటివారు హింసిస్తున్నారని కొంతకాలానికి అత్తగారు చనిపోవటంతో ఇంట్లో వారి ఆగడాలకు అడ్డూఅదుపులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. పిల్లలతో సహా ఇంటి నుంచి గెంటివేసినట్లు తనకు న్యాయం చేయాలని కోరింది.
- మచిలీపట్నం ఇంగ్లిషుపాలెంకు చెందిన మరో మహిళ చల్లపల్లికి చెందిన వ్యక్తితో తనకు వివాహమైందని ఆడపిల్ల పుట్టిందనే నెపంతో అత్తింటి వారు ఆడపడుచులు తన భర్తకు లేనిపోని మాటలు నూరిపోయటంతో భర్త రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని వాపోయింది. అప్పటి నుంచి భర్త ఆచూకీ తెలియడంలేదని న్యాయం చేయాలని కోరింది.
- ఈడేపల్లికి చెందిన ఓ బాధితుడు నివాస సరిహద్దు దారుడు పాత గొడవల నేపథ్యంలో దాడులకు తెగబడుతున్నాడని ప్రాణహాని ఉందన్నాడు.
- కానూరుకు చెందిన ఓ బాధితురాలు భర్త చనిపోగా జీవనోపాధికి ఆటో కన్సల్టెన్సీ వ్యాపారం చేస్తున్నానని, దీనికి ముగ్గురు వద్ద అప్పు తీసుకోగా అధిక వడ్డీలు వేసి చెల్లించాలని బెదిరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయమని కోరింది. స్పందనలో వచ్చిన అర్జీలపై స్పందించిన ఎస్పీ బాధితులందరికీ తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

స్నానానికి వెళ్లి.. అనంత లోకాలకు..



మృతుడు నాగుల్‌మీరా (ఫైల్)

తోట్లవల్లూరు: కృష్ణా పాయలో స్నానానికి వెళ్లిన యువకుడు గల్లంతై మృత్యువాత పడిన ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. గ్రామస్తుడు షేక్ నాగుల్‌మీరా(20) పదో తరగతి వరకు చదువుకుని బోరు పనులకు వెళ్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల వేళ పోలగాని వేణు, నాగిడి సాయితేజతో కలిసి అతను స్థానిక కృష్ణానది పాయకు స్నానానికి వెళ్లాడు. అక్కడ నాగుల్‌మీరా, వేణు నీటిలో దిగారు. స్నానం చేసేటప్పుడు నాగుల్‌మీరా కృష్ణానది నీటి గుండంలో లోతుకు వెళ్లి గల్లంతయ్యాడు. వేణు కాపాడే యత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నాగుల్‌మీరా గల్లంతయ్యాడన్న సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు నది నీటి గుండంలో గాలించారు. నదిలో ముమ్మర గాలింపుతో నాగుల్‌మీరా మృతదేహం సాయంత్రం 6 గంటల సమయంలో లభ్యమైంది. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదుకు మృతుని కుటుంబ సభ్యులు అంగీకరించలేదు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

కంకిపాడు: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కోలవెన్ను ఆయుర్వేద ఆసుపత్రిని సోమవారం ఆమె సందర్శించారు. ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలను డాక్టర్ పి.నీలిమను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రక్ష ఫౌండేషన్ రూ.30 వేలు ఆర్థిక వితరణను ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు అందించారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకూ ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యం, నాణ్యమైన విద్య అందేలా సీఎం జగనన్న చర్యలు తీసుకున్నారన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. భవిష్యత్తులో రక్ష ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థిక వితరణ అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

నిమజ్జనంలో టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం

- ఎస్‌ఐపై రాయితో దాడి
- గాయపడిన ఎస్‌ఐ.. చికిత్స తర్వాత వెంటనే విధుల్లోకి..

జగ్గయ్యపేట: వినాయక నిమజ్జనంలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించటంతో పాటు శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐపై గుర్తు తెలియని వ్యక్తి రాయితో దాడి చేయటంతో తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని చెరువు బజారులో టీడీపీ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా గణనాథుడిని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నిమజ్జన నిర్వహించడంతో విగ్రహాన్ని ఊరేగించేందుకు టీడీపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. శాంతి భద్రతలు పర్యవేక్షణకు ఎస్‌ఐ రామారావు సిబ్బందితో అక్కడకు వచ్చారు. విగ్రహం ముందుకు కదిలించే ప్రయత్నం చేస్తుండగా ఒక్కసారిగా వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి రాయి విసరటంతో ఎస్‌ఐ తలకు తీవ్రంగా గాయమైంది. ఎస్‌ఐను సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం తిరిగి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని శాంతి భద్రతలు పర్యవేక్షించారు. నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు అక్కడకు వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఘటనపై కేసు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు. ప్రథమ చికిత్స చేయించుకుని ఎస్‌ఐ అక్కడకు రావటంతో టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేసేందుకు యత్నించినా పోలీసులు అడ్డుకున్నారు.



చెరువు బజారులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనం



తలకు గాయంతో ఎస్‌ఐ రామారావు

బిల్డర్ ఆత్మహత్య



అనిల్(ఫైల్)

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుటుంబ విభేదాలు, ఆస్తి గొడవల నేపథ్యంలో కృష్ణలంకకు చెందిన ఓ బిల్డర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరిగా బతకలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు, తన చావుకు భార్య, ఆమెకు సహకరించిన మరికొంత మంది కారణమని సూసైడ్ నోట్ రాశాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక నివాసి బిల్డర్ దాసరి హనుమంతరావు అలియాస్ అనిల్(60) అపార్ట్‌మెంట్స్ నిర్మించి విక్రయిస్తూ ఉంటాడు. ఇతనికి భార్య రాధాలక్ష్మి, కుమారుడు సిద్దేష్‌కుమార్, కుమార్తె సౌజన్య ఉన్నారు. కుమారుడు, కుమార్తె ఇద్దరూ విదేశాల్లో స్థిరపడ్డారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. అనిల్ కృష్ణలంకలోని శంకర మఠం సమీపంలో కుమార్తెకు చెందిన ఇంటిలోని నాలుగో అంతస్తులో ఒంటరిగా నివసిస్తున్నాడు. అతని భార్య రాధాలక్ష్మి కృష్ణలంక ఆర్చి రోడ్డులో తన సొంతింటిలో నివసిస్తోంది. దీంతో అనిల్ తరచూ మనస్తాపం చెందుతుండేవాడు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సౌజన్య తన తండ్రి అనిల్‌కు ఫోన్ చేసింది. అతను లిఫ్ట్ చేయకపోవడంతో వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి తన తండ్రి వద్దకు వెళ్లాలని చెప్పింది. వెంటనే వాచ్‌మెన్ అనిల్ ఇంటిలోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతను ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిల్ రాసిన సూసైడ్ నోట్‌లో తనకు, తన భార్యకు విభేదాల కారణంగా కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నానని, తమ వద్ద పనిచేసిన డ్రైవర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే కాకుండా తనను మానసికంగా వేధించి ఆమె తన ఆస్తులన్నీ రాయించుకుందని తెలిపారు. తన చావుకు తన భార్య, ఆమెకు సహకరించిన బోనగిరి రాము, అరుణ అనే వారు కారణమని నోట్‌లో అనిల్ పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో మూడు నెలలు జైలు

గన్నవరం: చోరీ కేసులో నిందితుడికి మూడు నెలలు జైలుశిక్ష విధిస్తూ గన్నవరంలోని 12వ ఏఎంఎం కోర్టు సోమ వారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన సమాచారం మేరకు.. స్థానిక రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లోకి ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి దొంగ ప్రవేశించి టేబుల్ డ్రాలోని రూ. 1,450 అపహరించుకుపోయాడు. ఘటనపై స్మార్ట్ పాయింట్ మేనేజర్ సాయికిరణ్ ఫిర్యాదుతో గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడింది తాడేపల్లిగూడేనికి చెందిన గుర్రం అఖిల్ అలియాస్ తాడిశెట్టి మణికంఠను గుర్తించిన పోలీసులు అతనిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగామ: రైతుపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాళహస్తికి చెందిన ఆర్.వెంకటేష్ (37) నందిగామలోని ఎన్టీఆర్‌రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో కొంతకాలంగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బాకీ వసూలుకు వెళ్లాడు. ఈ క్రమంలో 65వ నెంబర్ జాతీయ రహదారి దాటుతున్నప్పుడు విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ పాల వ్యాను ఢీ కొట్టింది. వెంకటేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పండు దొర తెలిపారు.

మరో ఘటనలో..

గన్నవరం: వైద్య పరీక్షల కోసం భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్లి వస్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకానికి వెళ్లిపోయింది. ఘటన కేసరపల్లివద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన పిల్లలమర్రి సత్యనారాయణ, పల్లవి(29) ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొద్ది రోజుల క్రితం పల్లవి కళ్లతిరిగి కింద పడి పోవడంతో చేతికి గాయమైంది. చికిత్స నిమిత్తం భర్త సత్యనారాయణతో కలిసి ఆమె స్కూటీపై చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి వచ్చారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం ఇంటికి బయలుదేరారు. కేసరపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న మినీ ఫ్లై ఓవర్ దాటిన తర్వాత వెనుక నుంచి వస్తున్న ట్రాలీ వీరి వాహనాన్ని ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన పల్లవిపై ట్రాలీ వెనుక చక్రాలు ఎక్కడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆమె భర్త సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. భార్య విగతజీవిగా పడి ఉండటం చూసి సత్యనారాయణ విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

65 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని అరెస్టు చేసిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వేస్టేషన్లలో పలు చోరీలకు పాల్పడిన నిందితుడిని సోమవారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి 165 గ్రాముల మూడు బంగారు చైన్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు గ్రామం, ఈస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన చుక్కపల్లి బాబి సులభంగా డబ్బులు సంపాదించడానికి చోరీలు చేస్తుండేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో అతనిపై ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. నగరంలోని గవర్నరుపేట, రాజగోపాలచారీ వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతన్ని సోదా చేయగా 165 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

ఉంగుటూరు: తేలప్రోలులో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి దాటుతున్న ఓ యువకుడిని రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో అతను దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు పాత గూడెంకు చెందిన యలమర్తి కార్లమార్క్స్(31) కారు పెయింటర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం జాతీయ రహదారి దాటే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో విజయవాడ నుంచి ఏలూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఆ యువకుడిని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కార్లమార్క్స్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. అదే క్రమంలో అటుగా వస్తున్న మరో వాహనం(ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు లారీ) కింద పడిన యువకుడిని తొక్కుకుంటూ వెళ్లింది. దీంతో కాళ్లు పూర్తిగా నలిగి, తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గాయపడిన యువకుడిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొద్ది సేపటికి అక్కడ మృతి చెందాడు. ఆత్కూరు ఎస్‌ఐ సూర్య శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని కారు డ్రైవర్ బి.రామకృష్ణ, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

దోపిడీ కేసులో నిందితులకు ఏడాది జైలు

కంకిపాడు: పెట్రోలు బంకులో నగదు దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులకు విజయవాడ ఐదవ అడిషనల్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఎల్.అన్నపూర్ణశ్రీ ఒక్కొక్కరికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది మార్చి 10న మద్దూరు కరకట్టపై ఉన్న హెచ్‌పీ పెట్రోలు బంకులో వీరంకి శ్రీనివాసరావు డ్యూటీలో ఉన్నాడు. ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి రూ.600 పెట్రోలు కొట్టించుకున్నారు. వారు డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాసరావును కొట్టి చాకుతో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.30 వేలు నగదు దోపిడీకి పాల్పడ్డారు. ఘటనపై సెక్షన్ 392 కింద కంకిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. పటమట దర్శిపేటకు చెందిన సింగిరి చంద్రశేఖర్, పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన చేకుర్తి నాని, రాగాల మధుకిశోర్‌లను నిందితులుగా గుర్తించారు. ఎస్పీ పి.జాషువా, డీఎస్పీ ఆర్‌జే జయసూర్య, సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిందితులను కోర్టుకు హాజరుపరిచారు. విజయవాడలోని ఐదవ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి ఎల్.అన్నపూర్ణశ్రీ నిందితులను విచారించగా నేరం రుజువైంది. నిందితులకు ఒక్కొక్కరికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే ఒక్కొక్కరికి మరో రెండు నెలలు అదనంగా జైలుశిక్ష ఉంటుంది. ఈ కేసులో కోర్టు ఏపీపీ జి.రాధిక 10మంది సాక్షులను విచారణ చేసిన తర్వాత న్యాయమూర్తి అన్నపూర్ణశ్రీ పై విధంగా తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

మా నమ్మకం నువ్వే జగనన్నా



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో విజయవాడ కార్పొరేటర్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగిస్తుండగా మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్‌లు అంబడిపూడి నిర్మలాకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, ఎండీ రెహనా నాహీద్, పుప్పాలకుమారి. వియ్యపు అమర్నాథ్ తదితరులు సందడి చేశారు.

లేగదూడల ప్రదర్శన



మోగులూరు(కంచికచర్ల) : మండలంలోని మోగులూరు పశువైద్యశాలలో సోమవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గన్నవరం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అందమైన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహించామని తెలిపారు. లేగ దూడల ఎదుగుదలకోసం గేదె పాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి నల్లమోతు నరసింహారావు, ద్వితీయ బహుమతి నల్లమోతు అర్జున రావు, తృతీయ బహుమతి నల్లమోతు కృష్ణారావు దూడలు సాధించగా, దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు విజయ్ విశ్వనాథ్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రావు, పశుపోషకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



పెనమలూరు: గోసాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు గోసాల వద్ద ఈ నెల 5వ తేదీన గుర్తు తెలిని వ్యక్తి మద్యం సేవించి హిందీలో మాట్లాడుతూ అల్లరి చేయసాగాడు. అతడ్ని స్థానికులు వెళ్లి పోవాలని చెప్పగా అతను కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో అతడ్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 108 వాహనం ద్వారా చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రామారావు కోరారు.

ఇళ్ల కేసులో నలుగురు అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్లు మంజూరు చేయిస్తామని ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కేసులో కొత్తపేట పోలీసులు నలుగురిని సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట, చిట్టినగర్, కేదారేశ్వరపేట, కంసాలిపేటతో పాటు పశ్చిమ నియోజక వర్గంలో పలువురికి జేఎన్ఎన్‌యుఆర్ఎం కింద నిర్మించిన ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పి కేదారేశ్వరపేటకు చెందిన షేక్. హబీబ్, జక్కంపూడి కాలనీకి చెందిన షేక్. లాల్ అహ్మద్, నిమ్మల అన్నపూర్ణ, పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్. మహ్మద్‌హుస్సేన్‌లు పలువురి నుంచి ఒక్కొక్కరి వద్ద రెండు నుంచి మూడున్నర లక్షల వరకు వసూలు చేశారు. అయితే బాధితులకు ఇళ్లు ఇవ్వకపోవటంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు సోమవారం నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ నిమిత్తం విజయవాడ డిస్ట్రిక్ కోర్టుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విత్తన తయారీపై రైతులకు అవగాహన



తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): రైతులు విత్తన ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఆర్సీ ఏడీఏ మొనీష సూచించారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంపై తక్కెళ్లపాడులో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమకు అవసరమైన విత్తనాన్ని తామే ఉత్పత్తి చేసుకోవచ్చని సూచించారు. విత్తనం తయారు చేసుకునేందుకు పంట విత్తనం దగ్గర నుంచి కోత నిల్వ వరకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రస్తుతం వరి పంటలో విత్తనం తయారు చేసేటప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కంకిదశలో ఉన్నందున కేళీలను గమనించి తీసేయాలని తెలిపారు. వరి రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న కృషి

- వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- 7, 8 డివిజన్‌లలో మెగా ఆరోగ్య శిబిరాలు నిర్వహణ
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు



బాబు జగ్జీవన్‌రావు స్కూల్‌లో శిబిరం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, పక్కన డాక్టర్ మెహబూబ్, బెల్లం దుర్గ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. అందులో భాగంగానే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే తలంపుతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా స్పెషలిస్టు వైద్యులనే ప్రజల చెంతకు వచ్చేలా చేసారన్నారు. విజయవాడ తూర్పు నియోజవర్గంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా ఆరోగ్య శిబిరాలు 7వ డివిజన్‌లోని మొగల్రాజపురం శ్రీ చైతన్య స్కూల్లో, 8వ డివిజన్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ మున్సిపల్ స్కూల్లో నిర్వహించారు. ఆయా శిబిరాలను ప్రారంభించిన దేవినేని అవినాష్ అక్కడ ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యం చాలా ఖరీదుగా మారిందని, ఈ తరుణంలో ప్రజలందరికీ ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించినట్లు తెలిపారు. అంతేకాకుండా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మెగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ, స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైద్య రంగంలో చేస్తున్న కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్‌షేక్, 7వ డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, అధికారులు సత్యవతి, కృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యమేళాలకు విశేష స్పందన...

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహించిన ఆరోగ్య మేళాలకు విశేష స్పందన లభించింది. బాబు జగజ్జీవన్‌రావు స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో ఇద్దరు గైనకాలజిస్టులతో పాటు, ఒక పిల్లల వైద్యుడు, కంటి వైద్యుడు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లు పాల్గొని పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీ చైతన్య స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో జనరల్ మెడిసిన్ నిపుణులు, గైనకాలజిస్టు, కంటి వైద్యులు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లు పాల్గొనగా, సుమారు 450 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న దేవినేని అవినాష్, చిత్రంలో బెల్లం దుర్గ తదితరులు



జగ్జీవన్‌రామ్ స్కూల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ముబీన్

ఫారెస్ట్ భూములను పరిశీలించిన కలెక్టర్



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం పరిశీలించారు. గత 30 సంవత్సరాలుగా కొత్తూరు రిజర్వుడ్ ఫారెస్టుకు చెందిన అంబాపురం గ్రామంలో కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకుని నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇంటి పట్టాలను మంజూరు చేసేందుకు ఆ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలసి పరిశీలించారు. రిజర్వుడ్ ఫారెస్ట్ భూములను ఇళ్ల స్థలాలుగా మార్పు చేయాలంటే ఎంత భూమిని అయితే ఇళ్ల స్థలాలుగా ఇవ్వనున్నారో అంతే రెవెన్యూ భూమిని రిజర్వుడ్ ఫారెస్టుకు బదిలీ చేయాల్సి ఉంటుంది. గతంలో పాతపాడు గ్రామంలోని భూమిని రిజర్వుడ్ ఫారెస్టుకు బదిలీ చేసి, అంబాపురం గ్రామంలో రిజర్వుడ్ భూమిని ఇళ్ల పట్టాలుగా ఇవ్వడానికి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సమస్యలను సర్పంచ్ గండికోట సీతయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ జాహ్నవి, శేషగిరిరావు ఉన్నారు.

స్పందన వినతులకు సంతృప్తికర పరిష్కారం

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో అందుకున్న వినతులకు సంతృప్తికర పరిష్కారాలు చూపాలని, సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన సంబంధిత విభాగం అధికారులకు గడువులోగా అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. స్పందనలో మొత్తం 21 అర్జీలను స్వీకరించగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం-6, ఇంజినీరింగ్ విభాగం-3, రెవెన్యూ-3, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-7, పబ్లిక్ హెల్త్ విభాగం-1పై, అసిస్టెంట్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) విభాగంపై-01 అర్జీ వచ్చింది. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అర్జీదారుని సంతృప్తే లక్ష్యంగా అధికారులు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులను తగ్గించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కోరారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని తెలిపారు. నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ యం. ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎ.డి.హెచ్ శ్రీనివాస్, (డిప్యూటీ సిటి ప్లానర్ ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మృతి వనం సుందరీకరణ పనులు పరిశీలన



అంబేద్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. అభివృద్ధి - గ్రీనరీ పనుల పురోగతిని అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎగ్జిబిషన్, ఆడిటోరియం హాల్, ప్రవేశ ద్వారం పనుల గురించి మాట్లాడారు. గ్రీనరీ మరింతమెరుగ్గా తీర్చిదిద్దాలని, ఆకర్షణీయమైన మొక్కలతో సందర్శకులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వృత్తిదారులందరికీ విశ్వకర్మ యోజన అమలు చేయాలి



మాట్లాడుతున్న భాస్కరయ్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): వృత్తి దారులందరికీ ప్రధానమంత్రి విశ్వకర్మ కౌలస్య యోజన అమలు చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాస్కరయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 40 శాతం ఉన్న బీసీ, వృత్తిదారులకు కేవలం రూ.13 వేల కోట్లు కేటాయిస్తూ 5 శాతం వడ్డీతో పథకం అమలు చేస్తామనడం వృత్తిదారులను మోసగించడమేనన్నారు. గత 9 ఏళ్లలో ఎలాంటి శ్రద్ధ చూపని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో వృత్తిదారుల ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజనా ప్రారంభించడం మోసపూరిత ఆలోచనన్నారు. ఈ పథకానికి కనీసం రూ.50 వేల కోట్లు మంజూరు చేసి వృత్తిదారులకు 50 శాతం సబ్సిడీతో రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి వృత్తిదారునికి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఐక్య పోరాటాలు చేస్తామన్నారు.

న్యూఆర్ఆర్‌పేట ఆర్‌యూబీ మార్గంలో రాకపోకలు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరీపేట నుంచి అయోధ్యనగర్ మీదుగా వెళ్లే ఆర్‌యూబీ మార్గంలో రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైల్వే అదనపు లైన్ నిర్మాణ పనుల కారణంగా కొన్ని నెలల నుంచి ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులంతా సింగ్‌నగర్ వైపు, పాత ఆర్ఆర్‌పేట వైపుగా చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వచ్చేది. ప్రయాణికుల ఇబ్బందులు, స్థానిక ప్రజల అభ్యర్థనలను గుర్తించిన ప్రభుత్వం ఈ మార్గంలో రాకపోకలు పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. జేసీబీ సాయంతో ఆర్‌యూబీ మార్గాన్ని శుభ్రం చేయించింది. 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి సోమవారం ఈ పనులను పరిశీలించి, రాకపోకలను ప్రారంభించారు. ఆర్‌యూబీ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకున్నామన్నారు. రూ.4 లక్షల వ్యయంతో ఈ మార్గంలో చేపట్టిన చప్టాలు వేసి, రోడ్డు నిర్మించే పనులను అతి త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆమె వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, ఆదినారాయణ, పఠాన్ నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మంచి ప్రవర్తన అలవాటు చేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి ప్రవర్తన, సర్దుకుపోయే స్వభావం, క్రమశిక్షణ అలవాటు చేయాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండ్లాస్ హాస్పటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్లో సోమవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అతిథి సింగ్ తొలుత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ విశాల్ మాట్లాడుతూ పిల్లల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అతి కఠినంగా, అతి గారాబంగా పెంచడం మంచిది కాదన్నారు. పిల్లల మాటలకు విలువ ఇస్తూనే, మంచి చెడు వారికి తెలియచెప్పాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు మితంగా వాడే విధంగా చూడాలని, వాటిలో ఏమి చూస్తున్నారో గమనించాలన్నారు. కార్యక్రమంలో ఇండ్లాస్ హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్‌ఎంఏ రెహ్మాన్, డాక్టర్ దుర్గారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను సత్కరించారు.

వీజీఆర్‌లో అడ్వాన్స్‌డ్ బ్లడ్ టెస్టింగ్ పరికరం

సేవలు ప్రారంభించిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు



పరికరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, వీజీఆర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అనారోగ్యానికి గురైనప్పుడు కచ్చితమైన వ్యాధి నిర్ధారణ జరిగినప్పుడే మెరుగైన వైద్యం అందుతుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు అన్నారు. మొగల్రాజపురంలో వీజీఆర్ డయాబెటీస్ హాస్పటల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ బ్లడ్ టెస్టింగ్ పరికరం ఇటాజీ కంపెనీకి చెందిన కొబాస్ సి 311ను ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కొబాస్ సి 311 మిషన్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు అత్యాధునిక సాంకతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్ ఎక్యూప్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం మంచి అవకాశమని చెప్పారు. తద్వారా వారికి ఆరోగ్యపరంగా ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మధుమేహ రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఎ. శ్రీధర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ డాక్టర్ సమరం తదితరులు పాల్గొన్నారు.


11న నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): భవానీపురంలోని హెడ్‌వాటర్ వర్క్‌లో 8ఎంజీడీ క్లియర్ వాటర్ సంపును శుభ్రం చేస్తున్నందున ప్లాంట్‌కు ఈ నెల 11వ తేదీన బ్రేక్‌డౌన్ ప్రకటిస్తున్నామని ఈ కారణంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపేస్తున్నామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జీవీఆర్‌నగర్, వాంబేకాలనీ-1, వాంబేకాలనీ-2, రాజీవ్‌నగర్ ఉడాకాలనీ, కండ్రిక విలేజ్, ఆంధ్రప్రభ కాలనీ, రాజరాజేశ్వరిపేట, అజిత్‌సింగ్‌నగర్-1, అజిత్‌సింగ్‌నగర్-2, అజిత్ సింగ్‌నగర్-3, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతినగర్, ఎస్ఎస్సీ బోస్‌నగర్, ప్రైజర్‌పేట, టన్నెల్ బూస్టర్‌తోపాటు డైరెక్ట్ వాటర్ సప్లై అవుతున్న కేదరేశ్వరరావుపేట, రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ, శాంతినగర్, సింగ్‌నగర్, కేఎల్‌రావు నగర్, మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తమ విద్యా సంస్థలో 11వ (సీబీఎస్ఈ) చదువుతున్న జె.విశ్వనాథ్ కృష్ణా జిల్లా పురుషుల జట్టుకు, 10వ తరగతి చదువుతున్న జి.సుష్మిత కృష్ణా జిల్లా బాలికల జట్టులో ఎంపిక అయిందని డాక్టర్ కేకేఆర్స్ హ్యాపీవాలీ స్కూల్ ప్రిన్సిపాల్ వై.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేకేఆర్స్ సంస్థల డైరెక్టర్స్ కె.అవినాష్, కె.శ్రీతేజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నానో సైన్స్ రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నానో సైన్స్ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నానో సైన్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కెమిస్ట్రీ రంగంలో వివిధ ఇంటర్న్‌షిప్ అవకాశాలు, రసాయన రంగంలో నానో అద్భుతాలను వివరించారు.
అలాగే రసాయన, ఫిజిక్స్ రంగంలో 2023లో ఇచ్చిన నోబెల్ బహుమతుల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి రసాయన శాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. శైలజ, డాక్టర్ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

డీబీఆర్‌సీ ఈడీ అల్లాడి దేవకుమార్



మాట్లాడుతున్న డీబీఆర్‌సీ ఈడీ అల్లాడి దేవకుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దళిత ఆదివాసి ప్రజల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా మేనిఫెస్టోలు రూపొందించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడి దేవకుమార్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ జామి రమాదేవి అధ్యక్షతన దళిత, ఆదివాసీ మేనిఫెస్టో- 2024 జిల్లా సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దళిత, ఆదివాసీలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆయా వర్గాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. వివక్షను రూపుమాపేందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, గౌరవం సాధించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ సదస్సులో డీహెచ్‌పీఎస్ ప్రతినిధి నూరుపోగు ఏసు, జశ్వంత్ రాణి, ఎస్‌డీఎఫ్ అధ్యక్షుడు గురునాథం, మురళీకృష్ణ , ఎన్‌టీఎఫ్ నాయకుడు మానుపాటి నవీన్, రామచంద్రయ్య తదితరులున్నారు.

దేవస్థాన మండపం శ్లాబ్ పనులు పూర్తి



పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఈఈ నాగేంద్రకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని సత్య భామ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో మండపం శ్లాబ్ నిర్మాణ పనులు సోమవారం చేపట్టారు. దేవస్థానంలో అభివృద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నిధులు దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రిగా గతంలో పని చేసిన స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మంజూరు చేశారు. ఆ క్రమంలో దేవాలయ ప్రాంగణంలో షాపుల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అటుపై నిర్మాణంలో ఉన్న మండపం పనుల్లో భాగంగా శ్లాబ్ వేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు వంజరపు సూర్యారావు, దేవదాయ శాఖ ఏఈఈ డి.నాగేంద్ర కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు సూర్యారావు మాట్లాడుతూ మాజీ మంత్రి, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తమకు ఎంతో తోడ్పాటు అందిస్తూ దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తున్నారని చెప్పారు. ఆలయం అభివృద్ధిలో ప్రతి అంగుళం ఆయన చొరవేనని తెలిపారు.

పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి పెట్టి విజయం సాధించే దిశగా ముందుకు అడుగులు వేయాలని ఏసీఈ ఇంజినీరింగ్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ పబ్బా రమేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'పీఎస్‌యు జాబ్ నో మోర్ ఏ డ్రీమ్' అంశంపై సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో చక్కని విజయం సాధించేందుకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక పోటీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని ఎంచుకున్న విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయం ఖాయమని పేర్కొన్నారు. అదేవిధంగా ఈఈఈ విభాగ విద్యార్థులకు గేట్ వంటి పరీక్షలను గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ ఎ.శేఖర్‌సునీల్ తదితరులు పాల్గొన్నారు.



అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌కూ శుబ్‌మన్ గిల్ దూరం

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఓపెనర్ శుబ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌కూ దూరమయ్యాడు. బుధవారం అఫ్గానిస్తాన్ జట్టుతో మ్యాచ్ ఆడేందుకు ఢిల్లీ బయలుదేరిన భారత జట్టు వెంట గిల్ వెళ్లలేదు. డెంగీ జ్వరం బారిన పడ్డ గిల్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, చెన్నైలో వైద్యుల పర్యవేక్షణలో అతను చికిత్స తీసుకుంటున్నాడని బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లోనూ గిల్ ఆడలేదు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్‌-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-3తో మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్)-ఆండ్రియా మీస్ (జర్మనీ) జంటపై గెలిచింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.

వెర్‌స్టాపెన్ 'హ్యాట్రిక్'

- వరుసగా మూడో ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం
- ఈ సీజన్‌లో 14వ విజయం



దోహా: వేదిక మారినా ఫలితం మారలేదు. ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 14వ విజయం నమోదు చేసుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఖతర్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ చాంపియన్‌గా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 27 నిమిషాల 39.168 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్కార్ పియస్ట్రీ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, లాండో నోరిస్ (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) తొలి ల్యాప్‌లోనే వెనుదిరిగారు. ఈ ఫలితంతో వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో మరో ఐదు రేసులు మిగిలి ఉండగానే 433 పాయింట్లతో ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17 రేసులు ముగిశాయి. ఇందులో 14 రేసుల్లో వెర్‌స్టాపెన్, రెండు రేసుల్లో పెరెజ్ (రెడ్‌బుల్), మరో రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. 2021, 2022లలో కూడా వెర్‌స్టాపెన్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు యూఎస్ఏ గ్రాండ్‌ప్రి ఈనెల 22న జరుగుతుంది.

'ధర్మశాల' అవుట్ ఫీల్డ్‌పై బట్లర్ అసంతృప్తి





ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా నేడు ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లు తలపడనున్నాయి. అయితే ఇంగ్లండ్ సారథి బట్లర్ ధర్మశాల స్టేడియంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చాడు. మీడియాతో మాట్లాడుతూ 'ఈ మైదానం పేలవంగా ఉంది. అవుట్‌ఫీల్డ్ ఆటగాళ్లకు ప్రమాదకరం. క్యాచ్‌లు పట్టేటపుడు, డైవింగ్ చేసేటపుడు ఫీల్డర్లు జాగ్రత్తగా వ్యవహరించాలి. పరుగు ఆపేందుకు డైవ్ చేస్తే గాయాల బారిన పడొచ్చు. ఐపీఎల్‌లో ఆడినప్పటిలా ఈ అవుట్‌ఫీల్డ్ లేదు. ఇది క్రికెటర్లకు ఇబ్బందికరం' అని బట్లర్ అన్నాడు. బౌలర్లకు ప్రత్యేకించి పేసర్లు రనప్ ఏరియాను ఓ కంట కనిపెడుతూనే బౌలింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. ఈ వేదికపై అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు బంతిని అందుకునే క్రమంలో పదేపదే జారి పడ్డారు. దీంతో అఫ్గాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ అవుట్‌ఫీల్డ్ చెత్తగా ఉందన్నాడు.

లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌లో క్రికెట్!

ఐఓసీ ఆమోదమే తరువాయి

దుబాయ్: లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మ్యాచ్‌లకు టాస్ పడే అవకాశాలు మెరుగయ్యాయి. 2028లో అమెరికాలో జరిగే ఈ విశ్వక్రీడల కోసం నిర్వాహకులు క్రికెట్ క్రీడను చేర్చేందుకు సిఫారసు చేశారు. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) హర్షం వ్యక్తం చేసింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహణ కోసం ఐసీసీ... లాస్ ఏంజెలిస్ నిర్వాహక కమిటీతో కొంతకాలంగా సంప్రదింపులు జరుపుతోంది. మొత్తానికి కమిటీ సిఫారసు చేయడంతో ఇక అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆమోదమే మిగిలుంది. ఐఓసీ ఓకే అంటే అమెరికాలో క్రికెట్ ఆటకు రంగం సిద్ధమవుతుంది. ఈనెల 15 నుంచి 17 వరకు ముంబైలో జరిగే ఐఓసీ సమావేశంలో క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో క్రీడాంశంగా చేర్చాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు.

కివీస్ గెలుపు జోరు...

ప్రపంచకప్‌లో మరో ఏకపక్ష విజయం... గత టోర్నీ రన్నరప్ న్యూజిలాండ్ సమష్టి ప్రదర్శన ముందు అసోసియేట్ టీమ్ నెదర్లాండ్స్ నిలవలేకపోయింది... బ్యాటింగ్ పిచ్‌పై ముందుగా భారీ స్కోరు నమోదు చేసిన న్యూజిలాండ్ విసిరిన సవాల్‌కు పసికూన నెదర్లాండ్స్ వద్ద జవాబు లేకపోయింది... ఫలితంగా కివీస్ ఖాతాలో వరుసగా రెండో విజయం చేరగా... హైదరాబాద్ వేదికగా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ డచ్ బృందానికి ఓటమే ఎదురైంది. బ్యాటింగ్‌లో విల్ యంగ్, లాథమ్, రచిన్ రవీంద్ర, బౌలింగ్‌లో సాన్‌ట్నర్ న్యూజిలాండ్ విజయసారథులుగా నిలిచారు.

- న్యూజిలాండ్‌కు రెండో విజయం
- 99 పరుగులతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన యంగ్, సాన్‌ట్నర్


సాన్‌ట్నర్


యంగ్


రచిన్


లాథమ్

సాక్షి, హైదరాబాద్: న్యూజిలాండ్ జట్టు తమపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మళ్లీ సత్తా చాటింది. విడిగా చూస్తే విధ్వంసక ప్రదర్శనలు లేకపోయినా... ప్రతీ ఒక్కరూ రాణించడంతో క్వాలిఫయర్ జట్టు నెదర్లాండ్స్‌పై కివీస్ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో న్యూజిలాండ్ 99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. విల్ యంగ్ (80 బంతుల్లో 70; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ లాథమ్ (46 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (51 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... డరైల్ మిచెల్ (47 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కొలిన్ అకెర్‌మన్ (73 బంతుల్లో 69; 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ సాన్‌ట్నర్ (5/59) ఉప్పల్ స్టేడియంలో వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

సమష్టి బ్యాటింగ్‌తో...

ఆశ్చర్యకర రీతిలో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ బాగా నెమ్మదిగా ప్రారంభమైంది. తొలి మూడు ఓవర్లు ఒక్క పరుగు లేకుండా మెయిడిన్లుగా ముగియడం విశేషం. అయితే ఆ తర్వాత జట్టు ధాటిని పెంచింది. కాన్వే (40 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), యంగ్ చక్కటి బ్యాటింగ్‌తో తర్వాతి 7 ఓవర్లలో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 పరుగులు రాబట్టారు. ఈ జోడీ విడిపోయిన తర్వాత వచ్చిన రచిన్ తన ఫామ్‌ను కొనసాగించాడు. 59 బంతుల్లో యంగ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, రచిన్‌కు హాఫ్ సెంచరీ కోసం 50 బంతులే సరిపోయాయి. మరో ఎండ్‌లో మిచెల్ కూడా జోరు ప్రదర్శించాడు. కానీ ఈ దశలో డచ్ బౌలర్లు ప్రత్యర్థిని కొద్దిసేపు నిలువరించారు. 16 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి దెబ్బ కొట్టారు. అయితే మరోవైపు లాథమ్ దూకుడు కివీస్ స్కోరును 300 వందలు దాటించింది. సాన్‌ట్నర్ (17 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా చెలరేగడంతో చివర్లో భారీ స్కోరు చేయడంలో న్యూజిలాండ్ సఫలమైంది. ఆఖరి 10 ఓవర్లలో 84 పరుగులు సాధించిన న్యూజిలాండ్ వీటిలో చివరి 3 ఓవర్లలోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 పరుగులు రాబట్టడం విశేషం.

అకెర్‌మన్ మినహా...

భారీ లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఏ దశలోనూ నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ వేగంగా సాగలేదు. పాక్‌తో మ్యాచ్‌తో పోలిస్తే జట్టు బ్యాటింగ్ ఈ సారి పేలవంగా కనిపించింది. ఓపెనర్లు విక్రమ్‌జిత్ (12), డౌడ్ (16) విఫలం కాగా, అకెర్‌మన్ ఒక్కడే పోరాడగలిగాడు. అకెర్‌మన్, తేజ నిడమనూరు (26 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) మధ్య నమోదైన 50 పరుగుల భాగస్వామ్యమే ఈ ఇన్నింగ్స్‌లో పెద్దది. క్రీజ్‌లో నిలదొక్కుకొని చక్కటి షాట్లతో జోరు పెంచిన దశలో తేజ లేని రెండో పరుగు కోసం అనవసరంగా ప్రయత్నించాడు. అకెర్‌మన్‌తో సమన్వయ లోపంతో అతను రనౌటయ్యాడు. 55 బంతుల్లో అకెర్‌మన్ అర్ధ సెంచరీ పూర్తయింది. చివర్లో స్కాట్ ఎడ్వర్డ్స్ (27 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్), సైబ్రాండ్ (34 బంతుల్లో 29; 3 ఫోర్లు) కొంత వరకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. లక్ష్యానికి చాలా దూరంలో నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ ముగిసింది.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X బంగ్లాదేశ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి

పాకిస్తాన్ X శ్రీలంక
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) డి లీడ్ (బి) వాండర్ మెర్వ్ 32; యంగ్ (సి) డి లీడ్ (బి) మీకెరెన్ 70; రచిన్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాండర్ మెర్వ్ 51; మిచెల్ (బి) మీకెరెన్ 48; లాథమ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) దత్ 53; ఫిలిప్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 4; చాప్‌మన్ (సి) వాండర్ మెర్వ్ (బి) దత్ 5; సాన్‌ట్నర్ (నాటౌట్) 36; హెన్రీ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 322. వికెట్ల పతనం: 1-67, 2-144, 3-185, 4-238, 5-247, 6-254, 7-293. బౌలింగ్: ఆర్యన్ దత్ 10-2-62-2, ర్యాన్ క్లీన్ 7-1-41-0, మీకెరెన్ 9-0-59-2, వాండర్ మెర్వ్ 9-0-56-2, అకెర్‌మన్ 4-0-28-0, డి లీడ్ 10-0-64-1, విక్రమ్‌జిత్ 1-0-9-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (బి) హెన్రీ 12; డౌడ్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 16; అకెర్‌మన్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 69; డి లీడ్ (సి) బౌల్ట్ (బి) రచిన్ 18; తేజ (రనౌట్) 21; ఎడ్వర్డ్స్ (సి అండ్ బి) సాన్‌ట్నర్ 30; సైబ్రాండ్ (సి) కాన్వే (బి) హెన్రీ 29; వాండర్‌మెర్వ్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 1; క్లీన్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 8; ఆర్యన్ దత్ (బి) హెన్రీ 11; మీకెరెన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 223. వికెట్ల పతనం: 1-21, 2-43, 3-67, 4-117, 5-157, 6-174, 7-180, 8-198, 9-218, 10-223. బౌలింగ్: బౌల్ట్ 8-0-34-0, హెన్రీ 8.3-0-40-3, సాన్‌ట్నర్ 10-0-59-5, ఫెర్గూసన్ 8-0-32-0, రచిన్ రవీంద్ర 10-0-46-1, ఫిలిప్స్ 2-0-11-0.

సినిమా

కథ విన్నారా?


నాగార్జున

హీరో నాగార్జున, తమిళ దర్శకుడు నవీన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇటీవల నాగార్జునను కలిసి, ఓ కథ వినిపించారట నవీన్. స్క్రిప్ట్ నచ్చడంతో నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ప్రస్తుతం ఈ స్క్రిప్ట్‌కు పూర్తిస్థాయిలో మెరుగులుదిద్దే పనిలో నవీన్ ఉన్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జోరుగా సాగుతోంది. అంతేకాదు.. నాగార్జున కెరీర్‌లో ఇది వందో చిత్రమట. మరోవైపు ప్రస్తుతం 'నా సామిరంగ' సినిమా చేస్తున్నారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాకు శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరిలో 'నా సామిరంగ' విడుదల కానుంది.

మార్చిలో మొదలు?


మహేశ్ బాబు

'గుంటూరుకారం' సినిమాతో బిజీగా ఉన్నారు హీరో మహేశ్ బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్‌తో మహేశ్ చేస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. అయితే దర్శకుడు రాజమౌళితో మహేశ్ బాబుకు ఓ సినిమా కమిట్‌మెంట్ ఉన్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు విజయేంద్ర ప్రసాద్ కథ సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ కథ ఓ కొలిక్కి వచ్చిందని, మార్చిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను మొదలు పెట్టేలా రాజమౌళి అండ్ కో ప్రణాళికలు రచిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.


రెజీనా

ఒక్కటి గుర్తు పెట్టుకోండి!


జీవా, మమ్ముట్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో దర్శకుడు మహి వి.రాఘవ్ తెరకెక్కించిన చిత్రం 'యాత్ర'. వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించారు. 2019 ఫిబ్రవరి 8న విడుదలైన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'యాత్ర 2' మూవీని తెరకెక్కిస్తున్నారు మహి వి.రాఘవ్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని కొన్ని ఘటనల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ మూవీలో వైఎస్ జగన్ పాత్రలో తమిళ హీరో జీవా నటిస్తున్నారు. 'యాత్ర'లో వైఎస్ఆర్ పాత్ర పోషించిన మమ్ముట్టి 'యాత్ర 2' లోనూ అదే పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలోని వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'నేనెవరో ఇంకా ఈ ప్రపంచానికి తెలియక పోవచ్చు. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి... నేను వైఎస్ రాజశేఖర రెడ్డి కొడుకుని' అనే అనే డైలాగ్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఉన్నాయి. మహి వి.రాఘవ్ మాట్లాడుతూ– ''వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల నేపథ్యంలో 'యాత్ర 2' రూపొందుతోంది. ఈ సినిమాని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యులాయిడ్‌పై శివ మేక నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

వినోదాల ప్రేమ


కార్తీక్ రత్నం

కార్తీక్ రత్నం, సుప్యర్ద సింగ్ జంటగా ఆనంద్ బడా దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'లింగొచ్చా..'. 'గేమ్ ఆఫ్ లవ్' అనేది ఉపశీర్షిక. జె.నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఆనంద్ బడా మాట్లాడుతూ– ''హైదరాబాద్ నేపథ్యంలో సాగే లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'లింగొచ్చా..'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: బికాజ్ రాజ్, సహ నిర్మాత: మల్లేష్ కంజర్ల.

మరికాస్త ముందుకు ఎక్స్‌ట్రా


నితిన్

అనుకున్న సమయానికంటే ముందుగానే థియేటర్స్‌కు వస్తున్నారు హీరో నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్ హీరోగా 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను తొలుత డిసెంబరు 23న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఆ సమయానికి ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్:సీజ్‌ఫైర్' చిత్రం రిలీజ్‌కు సిద్ధం కావడంతో 'ఎక్స్‌ట్రా'ని కాస్త ముందుగానే డిసెంబరు 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు హారిస్ జైరాజ్ స్వరకర్త.

నాకూ అలా అనిపిస్తోంది - విశ్వక్ సేన్


విశ్వక్ సేన్, ఆనంది, రోహిత్

''విధి' నిర్మాత రంజిత్ నాకు మంచి స్నేహితుడు. ప్రొడక్షన్‌లో సాయం చేసేందుకు, సపోర్ట్‌గా నిలిచేందుకు నాకూ ఓ బ్రదర్ ఉంటే బాగుండని ఈ దర్శకుల్ని(శ్రీకాంత్, శ్రీనాథ్) చూస్తుంటే అనిపిస్తోంది. 'విధి' టీజర్ బాగుంది.. సినిమా పెద్ద హిట్ కావాలి.. నిర్మాతకు మంచి లాభాలు రావాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ దర్శకద్వయం తెరకెక్కించిన చిత్రం 'విధి'. రంజిత్ ఎస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 3న విడుదలకానుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వక్ సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ ఎస్ మాట్లాడుతూ–''మా సినిమా కథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. కథ, కథనాలను ప్రేక్షకులు ముందుగా ఊహించలేరు'' అన్నారు. ''మనం మాట్లాడటం కంటే.. మనం తీసే సినిమానే మాట్లాడాలనుకుంటున్నాం'' అన్నారు శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్. ''మా సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి'' అన్నారు రోహిత్ నందా, ఆనంది.

యూత్‌ఫుల్ కిస్మత్


అభినవ్, విశ్వ, నరేష్

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, అవసరాల శ్రీనివాస్, విశ్వ దేవ్, రియా సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కిస్మత్'. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రాజు నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హీరో సత్యదేవ్ విడుదల చేశారు. ''బెస్ట్ బడ్డీస్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫన్ రైడ్ 'కిస్మత్'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వేదరామన్ శంకరన్, సహ నిర్మాత: సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి.

చదువు గొప్పదనం నేపథ్యంలో...



అభయ్ నవీన్, కుశాలిని

''రాక్షస కావ్యం' బడ్జెట్ పరంగా చిన్న సినిమా. కానీ, కథ పరంగా పెద్ద సినిమా. పురాణాల్లోని జయవిజయ పాత్రల్ని స్ఫూర్తిగా తీసుకుని, కలియుగంలో వారు జన్మిస్తే ఎలా ఉంటుంది? అనే ఊహతో 'రాక్షస కావ్యం' తీశా'' అని డైరెక్టర్ శ్రీమాన్ కీర్తి అన్నారు. అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాక్షస కావ్యం'. దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దామురెడ్డి మాట్లాడుతూ–''ఇదొక వైవిధ్యమైన ప్రయోగాత్మక చిత్రం. ఈ మూవీలో ఫ్యామిలీ డ్రామా, భావోద్వేగాలతో పాటు చదువు గొప్పదనాన్ని చెబుతున్నాం'' అన్నారు. ''ఇటీవల వేసిన ప్రీమియర్స్‌కి మంచి స్పందన వచ్చింది'' అన్నారు అభయ్ నవీన్. నటీనటులు కుశాలిని, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు, అన్వేష్ మైఖేల్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: నవీన్ రెడ్డి, వసుంధరా దేవి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ చిక్కు.

లక్కీ చాన్స్

దక్షిణాది ప్రేక్షకులకు హీరోయిన్ రెజీనా సుపరిచితురాలే. కానీ ఇటీవల కాలంలో ఈ బ్యూటీకి చెప్పుకోదగ్గ హిట్ దక్కలేదు. ఇలాంటి సమయంలో రెజీనాకు ఓ లక్కీచాన్స్ లభించిందని కోలీవుడ్ టాక్. అజిత్ హీరోగా మగిళ తిరుమేణి దర్శకత్వంలో 'విడాముయార్చి' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నారని సమాచారం. అలాగే కథ రీత్యా ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చాన్స్ ఉందని, ఈ అవకాశం రెజీనా తలుపు తట్టిందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. మరి.. ఈ మూవీలో రెజీనా నటి స్తారా? లేదా? వేచి చూడాలి. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారు.

అంబాజీపేట బ్యాండు


సుహాస్, శివాని

సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ విడుదలలో దర్శకులు మారుతి, హను రాఘవపూడి, శైలేష్ కొలను, సాయి రాజేశ్, సందీప్ రాజ్, ప్రశాంత్, మెహర్ రమేశ్, భరత్ కమ్మ, నిర్మాతలు ఎస్‌కేఎన్, శరత్ అతిథులుగా పాల్గొన్నారు. ''నాలాంటి కొత్త డైరెక్టర్‌కు చాన్స్ ఇచ్చిన అల్లు అరవింద్, 'బన్ని' వాసు, వెంకటేష్ మహాగార్లకు, సుహాస్‌కి థ్యాంక్స్'' అన్నారు దుశ్యంత్ కటికినేని. ''నా కెరీర్‌లో ఈ మూవీ మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు సుహాస్. సినిమాటోగ్రాఫర్ వాజిద్ బేగ్, మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర మాట్లాడారు.

హారర్ కామెడీ


పూజిత, శివ, జ్యోతి

శివ, గోవా జ్యోతి, స్వర్ణలత, పూజిత, సుమన్ శెట్టి, అప్పారావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యజ్ఞ'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో ఆర్ఆర్ మూవీ క్రియేషన్స్‌పై చిలుకోటి రఘురామ్, చలపల్లి విఠల్ గౌడ్, చిత్తజల్లు ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్, పాటల విడుదల వేడుకలో తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నిర్మాత సాయి వెంకట్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు.''వినోదం, ప్రేమ, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ రూపొందుతోంది''అన్నారు చిత్తజల్లు ప్రసాద్. ''మా చిత్రంలోని నటీనటులకు మంచి పేరు వస్తుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సమర్పణ: దేశ్‌పాండే, సుభాష్, రావ్(దొర) ముళ్లవరం, కెమెరా: జి.కృష్ణనాయుడు, సంగీతం: లక్ష్మణ సాయి.